ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 05.03.2026 | సంపుటి : 12 సంచిక : 225 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv JANAMSAKSHI
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## మావోయిస్టుపార్టీ లీగల్‌కు
# అనుమతివ్వండి

**ఆ పార్టీ అగ్రనేతల వినతి**

**అమిత్ షాతో సీఎం రేవంత్ మధ్యవర్తిత్వం**



తెలంగాణకు అదనంగా ఐపీఎస్ అధికారులను కేటాయించాలని సీఎం వినతి 2 లో..

- ఇతర నాయకత్వంతో మాట్లాడి పీఎల్‌జీఏ రద్దు చేసుకుంటాం
- ఇటీవల లొంగుబాటు సందర్భంగా సీఎంకు వివరించిన నేతలు
- ఢిల్లీలో భేటీలో సీఎంతో పాటు డీజీపీ శివధర్ రెడ్డి, ఎస్ఐబీ సుమతి

న్యూఢిల్లీ, మార్చి 4 (జనంసాక్షి) : మావోయిస్టు పార్టీలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంటున్నట్టు తెలుస్తోంది. మావోయిస్టు పార్టీ లీగల్‌గా మారి పనిచేసుకునేందుకు అందులోని కొందరు కీలక నేతలు అంగీకరించినట్టుగా సమాచారం. పీఎల్‌జీఏను కూడా రద్దు చేసుకుని, ఇతర నాయకత్వంతోనూ సమాలోచనలు చేసి రాజకీయ పార్టీగా మలుచుకునేందుకు తమకెలాంటి అభ్యంతరం లేదని ఇటీవల లొంగుబాటు సందర్భంగా మావోయిస్టు నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్రంతో మధ్యవర్తిత్వం వహించాలని సీఎం రేవంత్ రెడ్డిని వారు కోరినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో బుధవారం ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి.. కేంద్ర హెూంమంత్రి మిగతా 2లో..

## నేడు సీఎం ఎదుట 100 మంది మావోయిస్టులు
# లొంగుబాటు



- ఆయుధాలతో సహా సరెండర్ కానున్న పీఎల్‌జీఏ నాయకులు
- తెలంగాణలోనే ఇది మొట్టమొదటి భారీ లొంగుబాటు ప్రక్రియ



హైదరాబాద్ (జనంసాక్షి) : గత రెండేళ్లుగా తెలంగాణలో మావోయిస్టుల పునరావాసానికి మెరుగైన చర్యలు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. మిగిలిన నాయకత్వాన్ని సైతం జనజీవన స్రవంతిలోకి ఆహ్వానిస్తున్న విషయం విదితమే. సామన్య పౌరులుగా సాధారణ జీవతాన్ని గడిపేందుకు అన్ని విధాలా సహాయసహాకారాలు అందిస్తున్న నేపథ్యంలో ఇటీవల కీలక నేతలు సైతం తెలంగాణ పోలీసుల ఎదుట లొంగుబాట పట్టారు. రెండేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా 591 మంది మావోయిస్టులు పునరావాసం పొందారని వెల్లడించిన డీజీపీ శివధర్ రెడ్డి.. పోలీసు శాఖ సమన్వయం సత్ఫలితాలిచ్చినట్టు పేర్కొన్నారు. అయితే, అగ్రనేతలు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, బడే చొక్కారావు, మిగతా 2లో..

## స్పీకర్ నుంచి వ్యక్తిగతంగా
# నోటీసు అందలేదు

**ఎమ్మెల్యే దానం నాగేందర్**



హైదరాబాద్(జనంసాక్షి): అనర్హత పిటిషన్‌పై స్పీకర్ నుంచి వ్యక్తిగతంగా తనకు నోటీసు అందలేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. నోటీసు అందితే తన అభిప్రాయాన్ని నేరుగా స్పీకర్‌కే చెబుతానన్నారు. నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజాలో నిర్వహించిన హోలీ వేడుకల్లో దానం పాల్గొన్నారు. తన చిన్ననాటి రోజులు మిగతా 2లో..

## తెలంగాణ కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులుగా
# వేం నరేందర్‌రెడ్డి, అభిషేక్ మను సింఘ్వి



**ఖరారు చేసిన పార్టీ అధిష్టానం**

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ నుంచి కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులు ఖరారయ్యారు. వేం నరేందర్‌రెడ్డి, అభిషేక్ మను సింఘ్వి పేర్లను అధిష్టానం ఖరారు చేసింది. గురువారం వీరు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, మాజీ ఎంపీ వీహెచ్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, వినయ్‌కుమార్, జెట్టి కుసుమకుమార్ తదితరుల పేర్లు వినిపించినప్పటికీ.. సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పేరు ఖరారైంది.మహబూబాబాద్ జిల్లాకు చెందిన వేం నరేందర్‌రెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత మిగతా 2లో..

## 6 లక్షల మంది మహిళల
# హెల్త్ ప్రొఫైల్ తయారీ



- అంతర్జాతీయ మహిళ దినోత్సవం కానుక
- ఈ నెల 8 నుంచి స్క్రీనింగ్ ప్రారంభం
- టీ డయాగ్నస్టిక్స్ ద్వారా ఒక్కొక్కరికీ 30 రకాల పరీక్షలు
- 4 దశల్లో ఆరోగ్యశాఖ కార్యక్రమాలు
- ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష

12 లో..

## ఇరాన్ మౌలిక సదుపాయాలపై
# ఉక్కుపాదం



అమెరికా,ఇజ్రాయెల్ దళాల దాడిలో ధ్వంసమైన ఇరాన్‌లోని భూగర్భ అణుకేంద్రం


### దేశాన్నే ధ్వంసం చేస్తామని ప్రతిజ్ఞ

- ఇరాన్ రహస్య భూగర్భ అణు ప్రాజెక్ట్ ధ్వంసం
- తామే దాడి చేశామని ఇజ్రాయిల్ రక్షణ దళం ప్రకటన
- ఇజ్రాయిల్ దాడులకు దీటుగా ఇరాన్ బాంబులు
- టెహ్రాన్ ప్రార్థనా మందిరంలో ఖమేనీ భౌతిక కాయం
- మూడ్రోజుల పాటు ప్రజల సందర్శనకు అనుమతి

టెహ్రాన్(జనంసాక్షి): ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు మరింత తీవ్రతరం చేసింది. ఈ క్రమంలోనే ఇరాన్ రహస్య భూగర్భ అణుప్రాజెక్ట్‌ను తమ దళాలు ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళం ప్రకటించింది. టెహ్రాన్ సరిహద్దుల్లోని మింజాదెహైలో రహస్యంగా ఏర్పాటుచేసిన న్యూక్లియర్ కేంద్రం కాంపౌండ్‌పై మిగతా 2లో..

## ఖమేనీ కుమారుడే
# వారసుడు?

**ఇరాన్ పగ్గాలు ముజ్తబా ఖమేనీకి అప్పగింత!**
**అధికార మార్పిడి జరిగిందని ప్రచారం**




టెహ్రాన్(జనంసాక్షి): అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీఖమేనీ మరణించడంతో ఇరాన్ తదుపరి నాయకత్వంపై సందిగ్ధం నెలకొంది. ఎవరు పగ్గాలు అందుకుంటారన్న చర్చలో ఖమేనీ కుమారుడే ముందువరసలో ఉన్నట్లు సమాచరం. ఇప్పుడా పాలనా పగ్గాలను ఖమేనీ మిగతా 2లో..

**ఇదేం దాష్టికం?**

## ఇరాన్ కొత్త సుప్రీంనూ
# హతమారుస్తాం

**'సుప్రీం' ఎవరైనా.. తమ టార్గెట్‌లోనే అంటూ అమెరికా,ఇజ్రాయెల్ వార్నింగ్**



వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా- ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆయన వారసుడిగా ముజ్తబా హ్సేనీ ఖమేనీ ఎన్నికైనట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఈ క్రమంలో ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఖమేనీ స్థానంలో ఎవరు వచ్చినా.. వాళ్లని లక్ష్యంగా చేసుకుంటామన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు.ఇజ్రాయెల్‌ను నాశనం చేయాలనుకునేవారిని వదిలిపెట్టేది లేదని కట్జ్ పేర్కొన్నారు. అమెరికాతో సహా ప్రపంచంలోని దేశాలను బెదిరించడానికి, ఇరాన్ ప్రజలను అణచివేయడానికి మిగతా 2లో..

## శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధనౌక మునక..

**100 మందికిపైగా గల్లంతు**

## మేమే ముంచేశాం

- మా సబ్‌మైరైన్ల ద్వారా పేల్చేశాం
- ఇరాన్ యుద్ధనౌకను ధ్వంసం చేసినట్లు ప్రకటించిన అమెరికా

2 లో..




## ప్రాజెక్టుల భూసేకరణకు
# రూ.5000 కోట్లు

- సింగూర్ డ్యామ్ భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటాం
- త్వరలోనే స్వయంగా డ్యామ్‌ను సందర్శిస్తా
- పాలెంవాగు ప్రాజెక్ట్ గేట్లు,రెగ్యులేటర్ సమస్యలను పరిష్కరిస్తా
- ప్రాజెక్ట్ పరిస్థితిని క్షేత్రస్థాయిలో వెళ్లి సమీక్షించండి
- అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు
- ప్రాజెక్టులపై అధికారులతో సచివాలయంలో సమీక్ష

హైదరాబాద్(జనంసాక్షి):సింగూర్ డ్యామ్ భద్రత ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖా మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ మహానగరానికి ప్రాణాధారంగ నిలిచిన సింగూర్ ప్రాజెక్టు పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. స్వయంగా తాను సింగూర్ ప్రాజెక్టును సందర్శించి పరిస్థితిని పూర్తిస్థాయిలో సమీక్షిస్తానని ఆయన ప్రకటించారు. బుధవారం ఉదయం సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ సితక్క, వివేక్ వెంకటస్వామి లతో కలసి డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయంలో ఆయన నీటి పారుదలశాఖ ఇంజినీర్లతో ఉన్నత స్థాయిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జంటనగరాలకు తాగునీటిని సరఫరా చేస్తూ, పరిసర ప్రాంతాలకు సాగు నీరూ అందిస్తున్న సింగూర్ ప్రాజెక్టును పరిరక్షించడంతో పాటు పునరుద్ధరణ విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. జాతీయ ఆనకట్ట భద్రతా సంస్థతో పాటు, రాష్ట్ర అధికారుల నుంచి భద్రతా పరిస్థితిపై హెచ్చరికలు వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించేందుకు తక్షణ సాంకేతిక జోక్యాలు, నీటిమట్టం దిగువన అండర్‌వాటర్ పరిశీలనలు, మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. సంగారెడ్డి జిల్లాలో ఉన్న సింగూర్ డ్యామ్ పై 2025 మధ్యకాలం నుండే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు. ఆ సమయంలో నిర్వహించిన అంచనాల్లో ఎంబాంక్మెంట్‌లో చీలికలు, స్లోప్ ఎరోషన్, మిగతా 2లో..

## జైల్లో నన్ను ఇబ్బందిపెట్టారు

**మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేత బాల్క సుమన్**



మందమర్రి (జనంసాక్షి):క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మంత్రి వివేక్ తనను అనేక రకాలుగా వేధింపులకు గురిచేశారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ అన్నారు. ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే తనను అంత మొందిస్తారేమోనని అనుమానంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జైలు నుంచి విడుదలై వచ్చిన తర్వాత మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలోని తన నివాసంలో మీడియాతో మిగతా 9లో..

## యంగ్ ఇండియా పాఠశాలల
# టెండర్లలో అవినీతి

**త్వరలోనే వివరాలు బయటపెడతాం • జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌ను పక్కన పెట్టారు**

**ఐఏఎస్, ఐపీఎస్‌లను సీఎంది బెదిరింపు ధోరణి: హరీశ్ రావు**



హైదరాబాద్(జనంసాక్షి):యంగ్ ఇండియా స్కూల్స్‌లో జరిగిన అవినీతి అంతా ఇంతా కాదు.. అన్ని ఆధారాలు ఉన్నాయి. త్వరలో అన్ని బయట పెడుతానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ప్రభుత్వ పనితీరుపై హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.. యంగ్ ఇండియా మిగతా 9లో..

## ఏ సమయంలో నాకు ఏ స్థానం ఇవ్వాలన్నది
# అధిష్టానమే నిర్ణయిస్తుంది

- ముఖ్యమంత్రి కుర్చీ కోసం విప్లవం అవసరం లేదు
- కాలమే నిర్ణయిస్తుంది: డీకే శివకుమార్
- మాది పాలు-తేనె వంటి బంధం: సిద్ధరామయ్య



బెంగుళూరు(జనంసాక్షి):కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశం మరోసారి చర్చకు వచ్చింది. ఈ విషయంపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం స్థానం దక్కాలంటే విప్లవం లేవనెత్తాల్సిన అవసరం మిగతా 9లో..



## వాట్సప్ చాట్‌ల ఆధారంగా
# విడాకులు ఇవ్వలేం

**బాంబే హైకోర్టు** 9 లో..

# సమస్యలను ప్రశ్నిస్తే కేసులా?

- నాపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టారు
- బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపి బాల్క సుమన్



**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి)** : కాంగ్రెస్ ప్రభుత్వం తనపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టారని బీఆర్ఎస్ మాజీ ఎంపీ బాల్క సుమన్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 14రోజులపాటు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవించిన బాల్క సుమన్ కు జిల్లా కోర్టు బెయిలు మంజూరు చేయడంతో బుధవారం సుమన్ జైలు నుంచి బెయిలుపై బయటకు వచ్చారు. ఆయన రాక కోసం ఎదురు చూస్తున్న బీ ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు బాల్క సుమన్ కు స్వాగతం పలికారు. అనంతరం సుమన్ అక్కడే ఉన్న మీడియాతో మాట్లాడుతూ ఏ తప్పు చేయని తనపై కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకొని అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా 14 రోజులపాటు జైల్లో వేసిందన్నారు. ప్రభుత్వం ప్రజలపట్ల అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అధికారులను, ప్రభుత్వంపై ప్రశ్నిస్తున్నందునే అది జీర్ణించుకోలేక ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పుతూ తనను జైల్లో పెట్టించిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు పరచకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తూ జైలు పాలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తమపై ఎన్ని కేసులు పెట్టిన భయపడేది లేదని ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చేంత వరకు ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రస్తుత ప్రభుత్వ హాయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రాబోవు రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెప్తారని అన్నారు. ఆయనతో పాటు జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# 14న మోడల్ హౌసింగ్ కాలనీ ప్రారంభం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తాం
- లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరగాలి
- లబ్ధిదారుల కుటుంబాలతో సహపంక్తి భోజనం
- సుమారు 15 ఏళ్ల కృషి ఫలించనున్నది
- అవినీతికి ఆస్కారం లేదు.. ఒక యజ్ఞంలా చేస్తున్నాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి





**హుజూర్ నగర్, మార్చి 4 (జనంసాక్షి):** హుజూర్ నగర్ రామస్వామి గుట్టవద్ద 110 ఎకరాలలో నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీని ఈ నెల 14 న ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా బుధవారం రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీని ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, ఆదర్శ గృహ కాలనీ ప్రారంభానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించినట్లు తెలిపారు. అవసరమైతే అదనపు సమయం పనిచేసి అయినా వచ్చే ఒక వారంలో అన్ని పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. హుజూర్‌నగర్ సమీపంలోని రామస్వామి గుట్టలో 110 ఎకరాల విస్తీర్ణంలో ఈ కాలనీ నిర్మించబడింది. ఇందులో 2,160 కుటుంబాలకు సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో తాను గృహనిర్మాణ శాఖామంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అయితే 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్ట్ నిర్లక్ష్యానికి గురైందని ఆయన పేర్కొన్నారు. 2023లో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్ట్ పునరుద్ధరణకు చర్యలు ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గృహ నిర్మాణ శాఖా మంత్రిగా ప్రారంభించిన ఈ ప్రాజెక్ట్‌కు ఎట్టకేలకు తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకే తుదిదశకు చేరుకుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక రాజకీయ దురుద్దేశంతో ఈ పనులు ఆపివేశారని ఆయన ఆరోపించారు. "నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రాంతాన్ని చెత్త మైదానంగా మార్చేశారు. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చి ఈ ప్రాజెక్ట్‌కు కొత్త ఊపిరి పోసింది," అని మంత్రి తెలిపారు. 110 ఎకరాల విస్తీర్ణంలో రూ.125 కోట్ల వ్యయంతో ఈ గృహ కాలనీ నిర్మించబడింది. మొత్తం 2,160 ఆధునిక సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు నిర్మించి అంతే సంఖ్యలో కుటుంబాలకు వసతి కల్పించనున్నారు. ఈ భూమిని ఎండోమెంట్స్ శాఖ నుంచి పూర్తి మార్కెట్ విలువ చెల్లించి, చట్టబద్ధమైన అన్ని అనుమతులతో ప్రభుత్వమే కొనుగోలు చేసిందని మంత్రి స్పష్టం చేశారు. అన్ని చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ కాలనీ నిర్మాణం చేపట్టింది," అని మంత్రి వివరించారు. ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాంతాన్ని సుసంపన్నమైన కాలనీగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్లినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, అత్యంత పేద కుటుంబాలు, నిరాశయులకు, నిరుపేద వ్యవసాయ కూలీలకు, రైస్ మిల్ కార్మికులు, ఏమీ లేని వారికి ఆశ్రయం, గూడు కల్పిస్తామన్నారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా ఉంటుందన్నారు. "మొదటి దశలో కేవలం 1,000 మంది లబ్ధిదారులను మాత్రమే ఖరారు చేస్తున్నామని అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి, సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె నరసింహ, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, ఆర్టికల్చర్ పిడి నాగయ్య, ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, జిల్లా డీసీసీ అధ్యక్షులు నరసయ్య, తహసిల్దార్ కవిత, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామం మధ్యలో సెల్ టవర్ నిర్మాణం

- సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్థులు నిరసన

**పెద్దపల్లి, మార్చి4 (జనంసాక్షి) :** ఆరోగ్యానికి కలిగించేలా నిబంధనలకు విరుద్ధంగా సెల్ టవర్ నిర్మించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని బ్రాహ్మణపల్లి గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇండ్ల మధ్యలో సెల్ టవర్ నిర్మించొద్దని పెద్దపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో గ్రామస్తులు ఆందోళన బాట పట్టారు. ఈ మేరకు బుధవారం స్థానిక గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ మేకల రోజారాణి యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం పేరుతో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ మేకల విజయ్ యాదవ్ మాట్లాడుతూ.. గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రజలకు ప్రాణసంకటంగా మారేందుకు కారణం కాబోతున్న సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని, గ్రామస్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలనే ఉద్దేశంతో గ్రామసభను ఏర్పాటు చేశారని అన్నారు. ఎయిర్‌టెల్ సెల్ టవర్ ఏర్పాటుతో రేడియేషన్ మూలంగా అనారోగ్య సమస్యలు ఏర్పడతాయన్నారు. గ్రామానికి కొద్ది దూరంలో సెల్ టవర్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఎయిర్‌టెల్ యజమాన్యాన్ని కోరినా వినకుండా గ్రామంలోని పోచమ్మ దేవాలయం కోసం కేటాయించిన స్థలంలో సెల్ టవర్ ఏర్పాటుకు గ్రామానికే చెందిన ఓదెల రాజు అనే రైతు తన భూమిగా పేర్కొంటూ తనకు అన్ని అనుమతులున్నాయని చెబుతున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి గ్రామపంచాయతీ తీర్మానం లేకుండా సెల్ టవర్ నిర్మాణం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

# బిజిలి యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి మార్చి 4 (జనం సాక్షి) :** ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం కింద గృహ విద్యుత్ వినియోగదారులు తమ ఇండ్ల రూఫ్ టాప్ లపై సోలార్ ప్లాంట్ ను ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకానికి సంబంధించి జిల్లాలో అవగాహన కల్పించేందుకు తెలంగాణ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్మెంట్ కార్పొరేషన్ ( టీజీ రెడ్ కో ) ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార వాహనాన్ని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ ఒక కిలో వాట్ సోలార్ ప్యానల్ కు 30 వేల రూపాయలు, రెండు కిలో వాట్స్ సోలార్ ప్యానెల్ కు 60 వేల రూపాయలు, మూడు కిలోవాట్లు అంతకంటే ఎక్కువ ఉన్నవాటికి 78 వేల రాయితీ ఉందని తెలిపారు. గృహ విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సౌకర్యంను సద్వినియోగం చేసుకోవడం ద్వారా గృహ అవసరాలకు సరిపోగా మిగిలిన విద్యుత్తును పవర్ గ్రిడ్ కు అందజేయడం ద్వారా ఆదాయం కూడా పొందే అవకాశం లభిస్తుందన్నారు. ఈ పథకానికి సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ ప్రచార వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళా సమాఖ్యల ద్వారా కూడా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి, టీజీ రెడ్ కో అధికారి మహేందర్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ ఈ మధుసూదన్ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భార్య కాపురానికి రాకపోవడంతో ఆవేదన

- పురుగుల మందు తాగా భర్త ఆత్మహత్య

**పెద్దపల్లి, మార్చి4 (జనంసాక్షి) :** కమాన్ పూర్ మండలం పేరపల్లి గ్రామానికి చెందిన చెప్పాల దేవేందర్ (38) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దపల్లి మంథని ప్రధాన రహదారిలో గల గుండారం గ్రామ శివారులోని పత్తి చేసులో ఈ దారుణానికి పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ, సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగరేణి సంస్థ ఆర్జీ- 3 పరిధిలోని సెంటినరిరాలనీ నర్సరీలో ఔట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తు కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం రాత్రి దేవేందర్ పేరపల్లిలోని తన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే గుండారం శివారులోని ఓ పత్తి చేసులో దేవేందర్ మృతదేహం కనిపించింది. దేవేందర్ గత 15 ఏళ్ల క్రితం పేరపల్లి గ్రామానికి చెందిన మల్లేశ్వరి అనే యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు ఆశీష్, కుమార్తె కీర్తన ఉన్నారు. భార్య, భర్త మధ్య రెండేళ్లుగా విభేదాలు జరుగుతున్నాయి . ఏడాదిగా ఇద్దరి పిల్లలతో కలిసి తన తల్లిగారింటికి మల్లేశ్వరి వెళ్లిపోయింది. అప్పటి నుండి దేవేందర్ మానసికంగా కుంగిపోయి మద్యానికి బానిసై మంగళవారం ఈ అఘాత్యానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# నేల పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలి

- అగ్రికల్చర్ వర్సిటీ సంచాలకులు బలరాం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** నేల పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేస్తే పంటల దిగుబడి పెరగడంతో పాటు నేల ఆరోగ్యం దీర్ఘకాలికంగా మెరుగుపడుతుందని ప్రొపెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డా.బలరాం తెలిపారు. బుధవారం యూనివర్శిటీలో నేల పరీక్షలు, సేంద్రీయ ఎరువుల వినియోగంపై రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సమతుల్య ఎరువుల వినియోగం, సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించడం ద్వారా సుస్థిర వ్యవసాయాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ రకమైన శిక్షణ ద్వారా స్వంతంగా లాబరేటరీని ఏర్పాటు చేసుకునే నైపుణ్యం పొందవచ్చన్నారు. అనంతరం రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాస్ వివరిస్తూ రైతులకు శాస్త్రీయ వ్యవసాయ పరిజ్ఞానం చేరేలా ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. పరిశోధనా సంస్థలు అభివృద్ధి చేసిన సాంకేతికతలను రైతులకు చేరవేయడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచవచ్చని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను పరిచయం చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని వర్శిటీ డైరెక్టర్?జగన్?మోహన్?రెడ్డి అన్నారు. ఈ శిక్షణలో నేల నమూనాల సేకరణ, నేల పరీక్ష విధానాలు, నేల పరీక్ష ఫలితాల విశ్లేషణ, వాతావరణ ప్రభావాల అవగాహన, పంటల ప్రణాళిక, సేంద్రియ ఎరువుల వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించినట్లు సైంటిస్టు మాదవి తెలిపారు. ఈ కార్యక్రమంలో నేల ఆరోగ్య విభాగం ప్రధాన శాస్త్రవేత్తలు డా. శ్రీదేవి, డా. సుకృత కుమార్ , డా. ఎం. శంకర్, డా . రెడ్డి ప్రియ. పాల్గొన్నారు.

# రాహుల్‌ను ప్రజలే దేశప్రధానిని చేస్తారు!

- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాహుల్ గాంధీ ప్రధాని కావాలా వద్దా అనేది దేశ ప్రజలు నిర్ణయిస్తారని, ఆయన ఐదు సార్లు ఎంపీగా గెలిచారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. 2004లో రాహుల్ గాంధీ కేంద్ర మంత్రి పదవి తీసుకోవాలని కోరినా తీసుకోలేదని, అప్పుడు ఆయన ఏఐసీసీ జనరల్ సెక్రటరీ పదవి తీసుకున్నారని, 2009లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ రాహుల్ గాంధీని ప్రధాని పదవి తీసుకోమన్నా తనకు అనుభవం లేదని రాహుల్ చెప్పారని ఎంపీ చామల అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీ చామల మాట్లాడుతూ 2004లో రాహుల్ గాంధీ ఎంపీ అయినప్పుడు కేంద్రమంత్రి బండి సంజయ్ కార్పొరేటర్ అయ్యారో లేదో తెలియదన్నారు. "2001లో మోడీ ప్యారాచ్యుట్‌లో వచ్చి ఎమ్మెల్యే కాకముందే గుజరాత్ సీఎం అయ్యారు.. అప్పుడు గుజరాత్ ప్రజలకు మోడీ ఎవరో తెలియదు." అని ఎంపీ చామల చెప్పారు. ఇద్దరు బిల్లా రంగాలు మోడీ, అమిత్ షాలు దేశాన్ని భ్రష్టు పట్టించారని విమర్శించారు. దేశానికి బీజేపీ ఏం చేయలేదని, గుజరాత్‌లో సబర్మతి రివర్ అభివృద్ధికి మోడీ సీఎంగా ఉన్నా కాంగ్రెస్ సహకరించిందని, నాడు అహ్మదాబాద్ నగర మేయర్ కాంగ్రెస్ నేత ఇమ్మత్ సింగ్ పటేల్ మోడీతో కలిసి శంఖుస్థాపన చేశారని ఆయన చెప్పారు. తాము గుజరాత్ వెళ్లి సబర్మతి రివర్‌ని సందర్శించామని, సబర్మతి రివర్ ప్రక్షాళనతో అహ్మదాబాద్ నగరం పర్యాటకంగా అభివృద్ధి చెందిందన్నారు. మూసీ ప్రక్షాళనతో హైదరాబాద్ అభివృద్ధి చెందుతుందని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు.

# గత సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల చెల్లింపులపై స్పష్టత

- మంత్రి సీతక్క ఆదేశాలతో పంచాయతీ రాజ్ శాఖ మార్గదర్శకాలు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** గత సర్పంచ్‌లు చేపట్టిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల చెల్లింపుల విషయంలో మంత్రి సీతక్క ఆదేశాల మేరకు తెలంగాణ పంచాయతీ రాజ్ శాఖ స్పష్టతనిచ్చింది. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్మెంట్ శాఖ డైరెక్టర్ దివ్యా దేవరాజన్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం కింద 2023-24 ఆర్థిక సంవత్సరానికి గ్రామ పంచాయతీలకు టైడ్ కాంపొనెంట్ క్రింద రూ. 245.00 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరానికి బేసిక్ అన్‌టైడ్ మరియు టైడ్ గ్రాంట్స్ కింద రూ. 640.07 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. గత సర్పంచ్‌ల పదవీకాలం 01.02.2024తో ముగిసిన నేపథ్యంలో, 2023-24 సంవత్సరానికి విడుదలైన టైడ్ కాంపొనెంట్ నిధులతో చేపట్టిన తాగునీరు, పారిశుధ్య పనులకు సంబంధించిన రికార్డులు అందుబాటులో ఉన్న మేరకు మాత్రమే గత సర్పంచ్ లకు బిల్లులు చెల్లించవచ్చని స్పష్టం చేశారు. 19.02.2026న జారీ చేసిన సర్క్యులర్ నం. CPR&RE-G1/SCHM/XVFC/2/2025 ద్వారా జిల్లాల పంచాయతీ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు గుర్తు చేశారు. 2023-24 టైడ్ కాంపొనెంట్ కింద విడుదలైన నిధులపై గత సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను రికార్డులు సరిచూసి చెల్లించాలని ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా, గ్రామ పంచాయతీలకు అందుబాటులో ఉన్న నిధుల నుంచి మల్టీ పర్పస్ వర్కర్లు వేతనాలు చెల్లించాలని సూచించారు. ఈ మేరకు జిల్లాల స్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.


# ఎస్సీ గురుకులాల ఖ్యాతిని పెంచాలి

- తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి విజయేందిర బోయి




**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఎస్సీ గురుకులాల ఖ్యాతిని మరింతగా పెంపొందించేందుకు అందరూ కట్టుబడి పని చేయాలని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి విజయేందిర బోయి అధికారులకు సూచించారు. అత్యున్నత వృత్తిపరమైన ప్రమాణాలను కొనసాగించేందుకు నిరంతరం కృషి చేయాలని వారికి స్పష్టం చేశారు. గురుకుల విద్యాసంస్థలు సీఎం ప్రాధాన్యతలో ఉన్నాయని అధికారులు గుర్తుంచుకోవాలని, విద్యార్థుల సంక్షేమం, రక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె స్పష్టం చేశారు. బుధవారం శాఖ ప్రధాన కార్యాలయం నుండి జిల్లా కోఆర్డినేటింగ్ అధికారులు, జోనల్ అధికారులు, మల్టీ జోనల్ అధికారులతో విజయేందిర బోయి జూమ్ ద్వారా సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యా ప్రగతి, విద్యార్థుల సంక్షేమం, సంస్థల నిర్వహణ, పరిపాలనా ప్రమాణాలపై ఆమె అధికారులకు ముఖ్య సూచనలు జారీ చేశారు. విద్యా ప్రతిభ, విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, క్రమశిక్షణ, సంస్థల ప్రతిష్టను అత్యున్నత ప్రాధాన్యంగా పరిగణించాలని విజయేందిర బోయి పిలుపునిచ్చారు. ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్లో 100% ఉత్తీర్ణత లక్ష్యంగా పని చేయాలని, ఎస్సెస్సీలో గుర్తించిన 3% విద్యార్థులు, ఇంటర్మీడియట్‌లో 14% స్టార్ కేటగిరీ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల గోప్యతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, ఏవైనా లోపాలు బయటపడితే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలను సక్రమంగా నిర్వహించాలని, ప్రతి సంస్థలో పరిశుభ్రత, భద్రతా ఆడిట్ ని క్రమం తప్పకుండా నిర్వహించాలని విజయేందిర బోయి ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు ఎటువంటి సంకోచం లేకుండా ఫోన్ మిత్ర సదుపాయాన్ని వినియోగించుకునేలా ప్రోత్సహించాలని, కుటుంబ సభ్యులు, స్నేహితులతో స్వేచ్ఛగా మాట్లాడుకునేలా ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలన్నారు. ఆందోళన లేదా మానసిక ఒత్తిడితో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి తక్షణ సహాయం అందించాలని, నెగిటివ్ ఆలోచనల నుండి బయటపడేందుకు లైఫ్ సేవింగ్ గ్రూపులను చురుకుగా భాగస్వామ్యం చేయాలన్నారు. పరీక్షల ముందు ఆందోళనకు గురయ్యే విద్యార్థులకు కౌన్సిలర్ల ద్వారా ప్రత్యేక సహాయం అందించాలని విజయేందిర బోయి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మార్చి 6 నుంచి 15 వరకు పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించాలన్నారు. చెత్త తొలగింపు, వ్యర్థాల నిర్వాహణ కోసం రోజువారీ కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారులు మరియు పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలని విజయేందిర బోయి తెలిపారు. ప్రతి విద్యార్థికి వ్యక్తిగత ఆరోగ్య కార్డు ప్రవేశపెట్టాలని, వేసవి ప్రారంభాన్ని దృష్టిలో ఉంచుకుని మార్చి నెలలో సమగ్ర ఆరోగ్య పరీక్ష తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. నిర్ణయించిన పోషకాహార ప్రమాణాలకు అనుగుణంగా కామన్ డైట్ మెనూను కచ్చితంగా అమలు చేయాలని, ఆహార నాణ్యత మరియు పరిమాణం విషయంలో రాజీ ఉండకూడదన్నారు. ఆహార నిల్వ విధానాలు ఎస్ఓపీల ప్రకారం ఉండాలని, ఆహారంపై విద్యార్థుల అభిప్రాయాలను సేకరించి సమీక్షించాలని విజయేందిర బోయి సూచించారు. ఎటువంటి తేడాలు వచ్చినా సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. డీసీఓలు, జెడ్వోలు, ఎంజెడ్వోలు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని, తనిఖీ నివేదికలను సమగ్రంగా సమీక్షించి అమలు చర్యలు చేపట్టాలని విజయేందిర బోయి అన్నారు. ఆహార కలుషితాన్ని నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రతికూల మీడియా వార్తలు రాకుండా పారదర్శకత మరియు బాధ్యతాయుత వ్యవహారం పాటించాలని ఆమె తెలిపారు.

# ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ పదవీకాలం పొడిగింపు



**హనుమకొండ ప్రతినిధి, మార్చి4 (జనంసాక్షి) :** హనుమకొండ కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి పదవీకాలాన్ని మరో 1 సంవత్సరం పొడిగిస్తూ విశ్వవిద్యాలయ అధికారులు గురువారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.ఈ సందర్భంగా పదవీకాల పొడిగింపు ఉత్తర్వుల కాపీని కే యూ వి సి ప్రొఫెసర్ ప్రతాపరెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం ప్రిన్సిపాల్ అందజేశారు. కళాశాలలో అకడమిక్ ప్రమాణాల పెంపు, పరిపాలనా సమర్థత, విద్యార్థి సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రిన్సిపాల్ నాయకత్వం విశేష ఫలితాలు సాధించిందని అధికారులు పేర్కొన్నారు. పదవీకాలం పొడిగింపుతో రాబోయే 1 సంవత్సరంలో కళాశాల అభివృద్ధి కార్యక్రమాలు మరింత బలోపేతం కానున్నాయి.

# అమెరికా ఒత్తిడి మధ్య భారత విదేశాంగ విధానం సమతుల్యత

భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత నుంచి స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరిస్తూ వచ్చింది. జవహర్‌లాల్ నెహ్రూ కాలంలో అలీన విధానం ద్వారా ప్రపంచంలోని రెండు శక్తి బ్లాకులకూ దూరంగా ఉండి, రెండింటి నుంచీ ప్రయోజనాలు పొందే మార్గాన్ని ఎంచుకుంది. ఆ విధానం భారతదేశానికి ఒక నైతిక గుర్తింపును కూడా ఇచ్చింది. కానీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈ విధానం "బహుళ అనుసంధాన" విధానంగా మారింది. అంటే, ఒకే శక్తిపై ఆధారపడకుండా, అనేక దేశాలతో వ్యూహాత్మక సంబంధాలు కొనసాగించడం. అమెరికా ఒత్తిడి, ఇరాన్--ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు, అంతర్జాతీయ విమర్శల మధ్య భారత్ తన వ్యూహాత్మక స్వతంత్రతను ఎలా కాపాడుకుంటోంది అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



మొదట అమెరికా ఒత్తిడి విషయానికి వస్తే, 2025లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని ప్రభుత్వం రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేసినందుకు భారత్‌పై యాభై శాతం సుంకాలు విధించింది. దీనివల్ల భారత ఎగుమతులు సుమారు ముప్పై ఏడు శాతం వరకు తగ్గినట్లు అంచనాలు సూచించాయి. ముఖ్యంగా ఔషధాలు, రత్నాలు, స్మార్ట్‌ఫోన్ రంగాలు దెబ్బతిన్నాయి. చౌతం హౌస్ నివేదిక ప్రకారం, ఈ సుంకాలు భారత ఆర్థిక వ్యవస్థను గట్టిగా దెబ్బతీశాయి. అయితే భారత్ యునైటెడ్ కింగ్డమ్, ఓమన్, న్యూజిలాండ్‌లతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుని కొంత సమతుల్యం సాధించింది. 2025 జూలై నుంచి సెప్టెంబర్ త్రైమాసికంలో 8.2 శాతం వృద్ధిని నమోదు చేయడం ద్వారా ఆర్థిక వ్యవస్థ తట్టుకుని నిలబడినట్లు చూపించింది. అమెరికా రష్యా సంబంధాలపై ఒత్తిడి పెంచుతున్నప్పటికీ, భారత్ తన ప్రయోజనాలను కాపాడుకునే విధంగా సమతుల్య వ్యూహాన్ని కొనసాగిస్తోంది.

ఇరాన్‌తో భారత సంబంధాలు చారిత్రకంగా కీలకమైనవి. ఇరాన్ నుంచి చమురు దిగుమతులు మాత్రమే కాదు, చాబహార్ నౌకాశ్రయం ద్వారా అఫ్గానిస్తాన్, మధ్య ఆసియా దేశాలకు ప్రత్యామ్నాయ మార్గం లభించింది. కానీ అమెరికా ఆంక్షల కారణంగా 2019లో చమురు దిగుమతులు నిలిచిపోయాయి. 2024లో పది సంవత్సరాల చాబహార్ ఒప్పందం కుదిరినా, 2025లో అమెరికా మినహాయింపు రద్దు చేయడంతో సుమారు 500 మిలియన్ డాలర్ల పెట్టుబడి అనిశ్చితిలో పడింది. 2024-25లో భారత్-ఇరాన్ వాణి జ్యం సుమారు 1.68 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతల సమయంలో భారత్ రెండు దేశాల మధ్య సంభాషణల ద్వారా శాంతి సాధించాలని సూచించింది. అయితే ఇరాన్‌పై జరిగిన దాడులను స్పష్టంగా ఖండించకపోవడం విమర్శలకు దారితీసింది. మోదీ ప్రభుత్వం కాలంలో ఇజ్రాయెల్‌తో సంబంధాలు మరింత బలపడ్డాయి. 2026 ఫిబ్రవరిలో జరిగిన పర్యటనతో ద్వైపాక్షిక సంబంధాలు ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి చేరుకున్నాయి. రక్షణ, కృత్రిమ మేధస్సు, సైబర్ భద్రత రంగాల్లో సహకారం పెరిగింది. ఇజ్రాయెల్ నుంచి సుమారు 2 బిలియన్ డాలర్ల ఆయుధాల కొనుగోళ్లు జరిగాయి. గాజా సంఘర్షణ విషయంలో భారత్ ఐక్యరాజ్యసమితి తీర్మానాలపై తటస్థంగా ఓటు వేయడం ద్వారా సంప్రదాయ పాలస్తీనా మద్దతు నుంచి వెనక్కి వెళ్లిందనే విమర్శలు వచ్చాయి. అయినప్పటికీ రెండు దేశాల మధ్య శాంతియుత పరిష్కారం, చర్చలు జరపడం అవసరమని భారత్ అధికారికంగా చెప్పింది. ఇజ్రాయెల్‌తో వాణిజ్య, రక్షణ ప్రయోజనాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి.

ఇదే సమయంలో గౌతమ్ అదానీ పై అమెరికాలో వచ్చిన అభియోగాలు కూడా ద్వైపాక్షిక సంబంధాల్లో చర్చకు దారి తీశాయి. 2024లో అమెరికా న్యాయ వ్యవస్థలో 265 మిలియన్ డాలర్ల లంచాల ఆరోపణలు వెలుగుచూశాయి. అదానీ మోదీకి సన్నిహితుడని ప్రతిపక్షాలు ఆరోపించాయి. మరోవైపు జెఫ్రీ ఎప్‌స్టీన్ కేసుకు సంబంధించిన పత్రాల్లో కూడా మోదీ పేరు ప్రస్తావనకు వచ్చిందన్న వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. ప్రభుత్వం ఈ ఆరోపణలను అసత్య ప్రచారంగా కొట్టిపారేసింది. అయితే ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకుడు జెయరామ్ రమేష్ మోదీని నైతిక ధైర్యం లేనివాడిగా విమర్శించాడు.

అంతర్జాతీయంగా కూడా భారత్ విదేశాంగ విధానంపై చర్చ కొనసాగుతోంది. హౌడ్సన్ ఇనిస్టిట్యూట్ సహా పలు పరిశోధనా సంస్థలు అమెరికా సుంకాల తర్వాత భారత్ మరింత జాగ్రత్తగా సమతుల్య విధానం అవలంబిస్తున్నదని పేర్కొన్నాయి. చైనా, పాకిస్తాన్ వంటి భద్రతా సవాళ్ల మధ్య అమెరికాతో సన్నిహిత సంబంధాలు అవసరమని విశ్లేషణలు చెబుతున్నాయి. అదే సమయంలో గ్లోబల్ సౌత్ దేశాల నాయకత్వాన్ని భారత్ చేపట్టాలంటే, ఇరాన్ వంటి మిత్రులతోనూ సంబంధాలు సమతుల్యంగా కొనసాగించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.


మొత్తానికి, అమెరికా ఒత్తిడి ఉన్నప్పటికీ భారత్ తన వ్యూహాత్మక స్వతంత్రతను పూర్తిగా వదులుకోలేదు. ఇజ్రాయెల్‌తో బంధాలు బలపడ్డాయి, ఇరాన్‌తో సంబంధాలు కొంత బలహీనపడ్డాయి. అయినప్పటికీ అనేక దేశాలతో అనుసంధాన విధానం ద్వారా భారత్ తన ప్రయోజనాలను కాపాడుకునే ప్రయత్నం చేస్తోంది. అయితే గాజా, ఇరాన్ అంశాలపై స్పష్టమైన నైతిక వైఖరి తీసుకోకపోవడం వల్ల అంతర్జాతీయ వేదికపై భారత్ ప్రతిష్ఠ దెబ్బతింటుందనే విమర్శలు ఉన్నాయి." పవర్ పాలిటిక్స్ " మధ్య విలువల ఆధారిత విదేశాంగ విధానం కొనసాగించడం భారత్‌కు సవాలుగా మారింది. భవిష్యత్తులో ఈ సమతుల్యతను ఎంత సమర్థంగా నిర్వహిస్తుందన్నదే భారత విదేశాంగ దిశను నిర్ణయిస్తుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# చరిత్ర ఎప్పుడూ పోరాడేవాళ్ల పక్షమే!

అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా ఖమేనీ వీరమరణం పొందారు. అయితే ఘర్షణలు తీవ్రమైన సమయంలోనే ఇరాన్ ను విడిచిపెట్టి రష్యాకు రావాలని అక్కడి పాలకులు ఆహ్వానించినా.. ఆయన తిరస్కరించినట్టు కొన్ని నివేదికలు చెప్తున్నాయి. బంకర్ లో తలదాచుకోవాలని చెప్పినా.. ససేమీరా అన్నట్లు వార్తలు వస్తున్నాయి. రణక్షేత్రాన్ని విడిచి పారిపోయేది లేదని, తలవంచేది లేదని ఆయన తెగేసి చెప్పినట్లు సన్నిహితులు చెప్తున్నారు. అయితే ఈ పరిణామం మరోసారి ఒక చారిత్ర సత్యాన్ని ప్రపంచానికి గుర్తు చేస్తున్నది. 'జీ హుజూర్' అని బానిసలా బతకడం కంటే.. నమ్ముకున్న సిద్ధాంతం కోసం, దేశం కోసం పోరాడి వీరమరణం పొందిన వారినే చరిత్ర ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది.



**విజయం కాదు ముఖ్యం.. ధిక్కారమే ఆదర్శం**

చరిత్ర ఎప్పుడూ సింహాసనాల మీద కూర్చున్న వాళ్లను గుర్తుంచుకోలేదు. ఆ సింహాసనాలను ఎదిరించి ప్రాణాలు త్యాగం చేసిన వాళ్లనే ఆరాధించింది. ఇందుకు ఇస్లాం హిస్టరీలో కర్బలా మైదానమే ఒక పెద్ద ఉదాహరణ. ఆనాడు వేలాది మంది యజీద్ సైన్యం ముందు హజ్రత్ హుస్సేన్ తన చిన్నపాటి అనుచరణగణంతో కలిసి పోరాడి ప్రాణ త్యాగం చేశారు. ఆ క్షణంలో అది ప్రత్యర్థి విజయంగా కనిపించి ఉండొచ్చు. కానీ శతాబ్దాలు గడిచినా ప్రపంచం నేటికీ కన్నీటితో స్మరించుకుంటున్నది, ధర్మానికి ఆదర్శంగా తీసుకుంటున్నది హజ్రత్ హుస్సేన్ త్యాగాన్నే. అధికార మదంతో అణచివేయాలని చూసే వారి ముందు మోకరిల్లడం కంటే ధర్మం కోసం, న్యాయం కోసం ప్రాణాలివ్వడమే నిజమైన గెలుపు అని ఆ ఘట్టం నిరూపించింది.

సామ్రాజ్యవాదంపై సమరం

ఆధునిక ప్రపంచంలోనూ అగ్రరాజ్యాల ఆధిపత్యాన్ని ఎదిరించి ప్రాణాలు కోల్పోయిన నాయకులు అనేకం ఉన్నారు. అమెరికా ఆధిపత్యాన్ని ఎదిరించి చమురు దిగ్బంధనంతో పాశ్చాత్యదేశాలను గడగడలాడించిన సౌదీ పాలకుడు షా ఫైజల్ సైతం తన ధిక్కార స్వరానికే ప్రాణాలను మూల్యంగా చెల్లించుకున్నారు. సామ్రాజ్యవాదుల కుట్రలకు బలైనా.. ఆయన పోరాట స్ఫూర్తి అరబ్ ప్రపంచంలో నేటికీ ఒక చెరగని ఆదర్శంగా నిలిచిపోయింది. ఇరాక్ పాలకుడు సద్దాం హుస్సేన్ అమెరికా దళాలలో ఆఖరి వరకు పోరాడి, శత్రువు చేతికి చిక్కి ఉరికంబం ఎక్కారు. లిబియా నేత గడాఫీ సైతం పశ్చిమ దేశాల దాడులను ఎదిరించి, దారుణ హత్యకు గురయ్యారు. వారి రాజకీయ విధానాల్లో తప్పొప్పులు ఎలా ఉన్నా.. అగ్రరాజ్యాల ముందు మోకరిల్లడానికి బదులు వారు పోరాట మార్గాన్నే ఎంచుకున్నారు. వారి ధిక్కార స్వరాన్ని వారి మద్దతుదారులు ఎప్పటికీ మరిచిపోలేరు. క్యూబా విప్లవవీరుడు చేగువేరా సైతం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తుదిశ్వాస వరకు పోరాడి.. బొలీవియా అడవుల్లో నెత్తుటి నేలపై ఒరిగారు. ఈనాటికీ ప్రపంచవ్యాప్తంగా యువత యువత గుండెలపై ఆయన బొమ్మే స్ఫూర్తిగా నిలవడానికి కారణం ఆ పోరాట పటిమే.

**భారత గడ్డపై ఇలా..**

మన దేశ చరిత్రలోనూ ఇలాంటి పోరాటయోధులకు కొదవలేదు. గొర్రెల్లా వందేళ్లు బతకడం కన్నా.. సింహంలా ఒక్క రోజు బతకడం మేలు అని చాటిచెప్పిన మైసూర్ పులి టిప్పు సుల్తాన్.. బ్రిటిష్ సైన్యంతో యుద్ధభూమిలో పోరాడుతూ ప్రాణాలు వదిలారు. దేశ స్వాతంత్ర్యం, ప్రజల స్వేచ్ఛ కోసం భగత్ సింగ్ కేవలం ఇరవై మూడేళ్ల వయసులోనే ఉరికంబం ఎక్కారు. మన్యం వీరు అల్లూరి సీతారామరాజు గిరిజనుల హక్కుల కోసం బ్రిటీష్ తుపాకులకు ఎదురొడ్డి ప్రాణాలు వదిలారు. సుభాష్ చంద్రబోస్ లాంటి వీరులు విదేశీగడ్డపై సైన్యాన్ని సమీకరించి, పోరాడి అదృశ్యమయ్యారు. వీరంతా తమ ప్రాణాలను పణంగా పెట్టారు కాబట్టే నేటికీ మన గుండెల్లో చిరంజీవులుగా నిలిచిపోయారు.

చరిత్ర ఎప్పుడూ పోరాడేవాళ్ల పక్షమే

విజయం సాధించినట్టు కనిపించిన వారంతా చరిత్రపుటల్లో నిలిచిపోరు. కానీ ఒక ఆదర్శం కోసం, తమ దేశ ప్రజల కోసం, స్వాతంత్ర్యం కోసం, బానిస సంకెళ్ల నుంచి విముక్తి కోసం ఆఖరి రక్తపు బొట్టు వరకు పోరాడిన వారు మాత్రం మరణం లేని మహానీయులవుతారు. పోరాటంలో ఓటమి ఎదురైనా.. ప్రాణాలు కోల్పోయినా సరే.. రాబోయే తరాలకు వారు ఒక చెరగని స్ఫూర్తిగా మిగిలిపోతారు. ప్రాణభయంతో ఆధిపత్యశక్తులకు 'జీ హుజూర్' అన్న వారు కాలగర్భంలో కలిసిపోతారు. కానీ రణక్షేత్రంలో నిలిచిన వీరులు మాత్రం చరిత్రలో శాశ్వత స్థానం దక్కించుకుంటారు.

**- మహమ్మద్ ఆరిఫ్, 7013147990**

## అర్ధాంగి

సీ॥

ఎక్కడో పుట్టింది, నీకడకొచ్చింది
ఆలిగా నిన్ను తానల్లుకుంది;
ఆమెలేని బ్రతుకు అర్థరాహిత్యమ్ము
అర్ధాంగి యన్నచో అర్థమదియె;
ఎంతొపుణ్యముసేయ ఈ యింతి లభియించె
యాదృచ్ఛికముకాదు యజ్ఞఫలము;
సాగరముతొ బోల్చు సంసారయాత్రలో
సరిగమల్ పలికించు సరసిజాక్షి;
శ్రమకోర్చి,చెమటోడ్చి చేరిన విభునికి
చెట్టు నీడ పగిది సేద దీర్చు;
మంచిమాట యొకటి మరుమల్లె యొకమూర
చిరునవ్వు కురిపించ కరిగిపోవు.
ఓర్పుకు కనతల్లి, ఓదార్పునకు చెల్లి
నేర్పుకుమేధావి; మార్పుతెచ్చు
కష్టకాలములోన అష్టలక్ష్మి సమము
పొదుపుతో కాపాడు కుదుపునుండి

తే.గీ॥

అచ్చువిడిచిన హల్లుకు అర్థమేది?
భార్యనదలించు భర్తకు భవిత ఏది?
ఇల్లు చల్లగ యున్న యిల్లాలి ప్రజ్ఞ
భార్య మంచిగయున్న భర్త ప్రతిభ
కష్టసుఖముల రెంటిలో కలసి మెలసి
ఒకరికొకరై ఒద్దికగ నొప్పు వలము.



**డా॥ కొర్లగుంట సాయి ప్రసాద్**
Joint Director Health (retired)
1-1-29/7/A/4, Plot No. 61, road no 4,
Commercial Tax Colony,Kothapet,
Hyderabad - 7569913871

## రంగుల రమ్యం - స్నేహాల కావ్యం

వసంత కాలపు వాకిలిలో..!
రంగుల సంతకం 'హోళీ'!!
విశ్వమంతా ఒక్కటేనని..!
చాటి చెప్పే సమసమాజ కేళి!!
మావి చిగురుల పందిరిలో..!
కోయిలల గానం
మోదుగ పూల మంటల్లో..!!
వసంతాగమనం!
ప్రతి పువ్వు ఒక రంగుని
అద్దుకుంది!
ప్రతి మనసు ఒక రాగాన్ని
పాడుకుంది!!
కులమతాల ముసుగులు..!
రంగుల జల్లులో తడిసి
పోవాలి!!
ద్వేషపు పాత జ్ఞాపకాలు..!
కాలం గర్భంలో కలిసి పోవాలి!!
ఎరుపులో 'అనురాగం'..!
పసుపులో 'సౌభాగ్యం'!!
ఆకుపచ్చలో 'అభ్యుదయం'..!
నీలంలో 'నిర్మలత్వం'!!
చెయ్యి చెయ్యి కలిపి..!
స్నేహపు వంతెన కడదాం!!
గుండె గుండెను తట్టి..!
మానవత్వపు పాట పాడుదాం!!
ముఖం మీద చల్లే
అక్షింతల్లాంటి!
ఈ రంగులుప్రతి ఇంటి
గడపలో..!!
నింపాలి సుఖ సంతోషాల
వెలుగులు!
భేదభావం లేని లోకమే..!!
ఈ పండుగ గమ్యం!
ఆత్మీయతలే ఆయుధాలైన
నాడే..!!
ఈ వసంతం రమ్యం!
మనుషులంతా ఒక్కటేనన్న
'సత్యం'!
నిరంతరం వెలగాలి.. ;;
అదే మన అందరి 'నిత్యం'!!!

**డా.పూసపాటి వేదాద్రి**
9912197694

# అన్నదాతకు ఆర్థిక భద్రతే అసలైన స్వాతంత్ర్యం

భారతదేశ వ్యవసాయ రంగం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచినప్పటికీ, గత 10 సంవత్సరాలుగా రైతుల జీవితం తీవ్రమైన సంక్షోభ దశను ఎదుర్కొంటోంది. "అప్పుల్లో పుట్టి అప్పుల్లో పెరిగి అప్పుతోనే మట్టిలో కలుస్తున్న రైతులు" అనే వాక్యం కేవలం భావోద్వేగ ప్రకటన కాదు; అది గణాంకాల ద్వారా నిరూపితమవుతున్న వాస్తవం. ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు, వడగండ్ల వానలు, గిట్టుబాటు ధరల లోపం, అప్పుల భారాలు కలిసి రైతు జీవితాన్ని క్రమంగా అస్థిరం చేస్తున్నాయి. గత 10 సంవత్సరాల కాలంలో ఈ పరిస్థితిని గణాంకాలతో పరిశీలిస్తే రైతు ఎదుర్కొంటున్న దుర్భర స్థితి మరింత స్పష్టమవుతుంది.

జాతీయ నేర కణాంకాల బ్యూరో నివేదికల ప్రకారం 2014 నుండి 2023 వరకు రైతుల ఆత్మహత్యలు దేశవ్యాప్తంగా ఆందోళనకర స్థాయిలో నమోదయ్యాయి. 2014లో సుమారు 5650 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆ సంవత్సరంలో అకాల వర్షాల కారణంగా సుమారు 18% పంట నష్టం సంభవించినట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ముఖ్యంగా రబీ సీజన్‌లో వర్షపాతం అధికమై పండిన గోధుమ పంటలో సుమారు 12% దిగుబడి తగ్గుదల నమోదైంది.

2015 సంవత్సరం అత్యంత క్లిష్టంగా నిలిచింది. దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో అకాల వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో తీవ్ర ఎండల ప్రభావం కలిసి సుమారు 23% పంట నష్టానికి దారితీశాయి. ఆ సంవత్సరంలో రైతుల ఆత్మహత్యలు సుమారు 8007 నమోదయ్యాయి. పత్తి, మిర్చి, పప్పుధాన్యాల్లో గిట్టుబాటు ధరలు మార్కెట్‌లో 15% వరకు పడిపోయాయి. పెట్టుబడులపై లాభం రాకపోవడం రైతులను అప్పు చక్రంలో మరింత లోతుకు నెట్టింది.

2016లో వర్షాభావ పరిస్థితులు సుమారు 16% వ్యవసాయ భూమిని ప్రభావితం చేశాయి. అకాల వర్షాల ప్రభావం తక్కువగా ఉన్నప్పటికీ, గత ఏడాది నష్టాల ప్రభావం కొనసాగింది. ఆ సంవత్సరంలో సుమారు 6270 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వ్యవసాయ దిగుబడులు సగటున 10% వరకు తగ్గాయి.

2017లో ఖరీఫ్ సీజన్ చివర్లో సంభవించిన వడగండ్ల వానలు సుమారు 19% పంటను నాశనం చేశాయి. మహారాష్ట్ర, తెలంగాణ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో తీవ్ర ప్రభావం కనిపించింది. ఆ సంవత్సరంలో రైతుల ఆత్మహత్యలు సుమారు 10000కి చేరుకున్నాయి. పత్తి రైతులు ప్రత్యేకంగా 22% వరకు నష్టాన్ని చవిచూశారు.

2018లో వరుసగా అకాల వర్షాలు నమోదయ్యాయి. సుమారు 21% వ్యవసాయ భూమి ప్రభావితమైంది. ముఖ్యంగా వరి పంటలో 14% దిగుబడి నష్టం జరిగింది. ఆ సంవత్సరంలో సుమారు 10349 మంది రైతులు ప్రాణాలు తీసుకున్నారు. అప్పు భారంతో ఉన్న రైతుల్లో 68% మంది సంస్థాగత రుణాలు తీసుకున్నవారే ఉన్నట్లు అధ్యయనాలు వెల్లడించాయి.

2019లో మాన్సూన్ ఆలస్యంగా రావడం, తరువాత అధిక వర్షపాతం నమోదవడం వల్ల సుమారు 17% పంట నష్టం జరిగింది. వరి, సోయాబీన్ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆ సంవత్సరంలో రైతుల ఆత్మహత్యలు సుమారు 10281గా నమోదయ్యాయి. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ ధరలు సగటున 12% తగ్గాయి.

2020లో కోవిడ్ ప్రభావం వల్ల మార్కెట్ వ్యవస్థ దెబ్బతింది. ప్రకృతి వైపరీత్యాలతో కలిపి సుమారు 15% పంట నష్టం జరిగింది. రైతుల ఆత్మహత్యలు సుమారు 10677 నమోదయ్యాయి. సరఫరా గొలుసు విఘాతం వల్ల రైతులకు 10% వరకు అదనపు నష్టం వాటిల్లింది.

2021లో అనియంత్రిత వర్షాలు సుమారు 20% పంటను ప్రభావితం చేశాయి. ముఖ్యంగా పంజాబ్, హర్యానా ప్రాంతాల్లో వరి పంటకు 13% వరకు నష్టం జరిగింది. ఆ సంవత్సరంలో రైతుల ఆత్మహత్యలు సుమారు 10720 నమోదయ్యాయి. వ్యవసాయ ఖర్చులు 8% పెరిగినప్పటికీ మార్కెట్ ధరలు అదే స్థాయిలో నిలిచిపోవడం వల్ల రైతు ఆదాయం తగ్గింది.



2022లో వడగండ్ల వానలు, ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు కలిసి సుమారు 18% పంట నష్టం కలిగించాయి. గోధుమ ఉత్పత్తిలో 11% తగ్గుదల నమోదైంది. ఆ సంవత్సరంలో సుమారు 11290 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. రైతులలో 72% మంది అప్పుల భారంతో ఉన్నట్లు అధ్యయనాలు సూచించాయి.

2023లో ఎల్‌నినో ప్రభావం కారణంగా కొన్ని రాష్ట్రాల్లో వర్షాభావం, కొన్ని చోట్ల అతివృష్టి చోటుచేసుకుంది. సుమారు 22% పంట నష్టం అంచనా వేయబడింది. రైతుల ఆత్మహత్యలు సుమారు 11300కు చేరుకున్నాయి. పంట పెట్టుబడులు 9% పెరిగినప్పటికీ, గిట్టుబాటు ధరలు తగినంతగా పెరగలేదు.

ఈ 10 సంవత్సరాల గణాంకాలను సమగ్రంగా పరిశీలిస్తే సగటున ప్రతి సంవత్సరం రైతు సుమారు 18% పంట నష్టాన్ని ఎదుర్కొంటున్నాడు. ప్రతి సంవత్సరం సగటున 9500కి పైగా రైతులు ప్రాణాలు తీసుకుంటున్నారు. పంట పెట్టుబడులపై రాబడి కేవలం 5% నుండి 8% మధ్యే ఉండడం రైతు ఆర్థిక స్థితిని దెబ్బతీస్తోంది. కుటుంబ పోషణ ఖర్చులు సంవత్సరానికి సగటున 7% పెరుగుతున్నాయి.

ఈ పరిస్థితిలో రైతుకు స్థిరమైన ఆదాయ భద్రత అవసరం స్పష్టమవుతోంది. ప్రతినెల ₹5000 పెన్షన్ మంజూరు చేస్తే సంవత్సరానికి ₹60000 స్థిర ఆదాయం లభిస్తుంది. ఇది చిన్న రైతుకు కనీస జీవన భద్రతను అందించగలదు. దేశంలో సుమారు 10 కోట్ల రైతు కుటుంబాలు ఉన్నట్లు అంచనా. అందరికీ ఈ పథకం అమలు చేస్తే సంవత్సరానికి సుమారు ₹6 లక్షల కోట్లు వ్యయం అవుతుంది. ఇది దేశ జిడిపిలో సుమారు 2% నుండి 3% మధ్యలో ఉంటుంది.

రైతు ఆత్మహత్యలను తగ్గించాలంటే కేవలం పరిహారాలు సరిపోవు. పంట బీమా అమలు సమర్థంగా జరగాలి. గిట్టుబాటు ధరలను శాస్త్రీయంగా నిర్ణయించాలి. అకాల వర్షాల అంచనాకు సాంకేతిక వనరులు విస్తరించాలి. అప్పు మాఫీ విధానాలు పారదర్శకంగా అమలు కావాలి.

రైతు కేవలం ఉత్పత్తిదారుడు కాదు; దేశ ఆహార భద్రతకు మూలస్తంభం. అతను బతికితేనే దేశం బతుకుతుంది. ప్రతి సంవత్సరం 18% వరకు పంట నష్టం, వేలాది ఆత్మహత్యలు కొనసాగుతుంటే అది కేవలం వ్యవసాయ సంక్షోభం కాదు; అది జాతీయ సంక్షోభం. రైతుకు స్థిర ఆదాయ భద్రత, మార్కెట్ రక్షణ, ప్రకృతి వైపరీత్యాల నివారణ చర్యలు కలిపి అమలు చేసినప్పుడే ఈ దుష్చక్రం నుండి విముక్తి సాధ్యమవుతుంది.

ఈ పరిస్థితిలో ప్రభుత్వ పరంగా ప్రతినెల స్థిరమైన పెన్షన్ పథకం అమలు చేయడం అనివార్యంగా కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా సుమారు 10 కోట్ల రైతు కుటుంబాలు ఉన్నట్లు అంచనా. ప్రతి రైతు కుటుంబానికి ప్రతినెల ₹5000 పెన్షన్ మంజూరు చేస్తే సంవత్సరానికి ₹60000 స్థిర ఆదాయం లభిస్తుంది. మొత్తం వార్షిక వ్యయం సుమారు ₹6 లక్షల కోట్లు అవుతుంది. ఇది దేశ స్థూల దేశీయోత్పత్తిలో సుమారు 2%-3% మధ్య ఉంటుంది. వ్యవసాయ రంగం దేశ జనాభాలో సుమారు 45% మందికి ఉపాధి కల్పిస్తోంది అనే విషయాన్ని దృష్టిలో ఉంచుకుంటే ఈ వ్యయం సామాజిక భద్రతలో కీలక పెట్టుబడిగా పరిగణించవచ్చు.

ప్రస్తుతం అమలులో ఉన్న ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా సంవత్సరానికి ₹6000 మాత్రమే అందుతోంది. ఇది నెలకు సగటున ₹500కు సమానం. రైతు కుటుంబం నెలవారీ ఖర్చుల్లో ఇది కేవలం 3%--5% మాత్రమే కవర్ చేస్తుంది. అయితే ప్రతిపాదిత ₹5000 పెన్షన్ అమలైతే కుటుంబ ప్రాథమిక అవసరాల్లో కనీసం 25%-30% వరకు భరోసా లభిస్తుంది. విత్తనాలు, ఎరువులు, విద్యుత్ బిల్లులు, పిల్లల విద్య, వైద్య ఖర్చుల్లో కొంత స్థిరత్వం ఏర్పడుతుంది.

అకాల వర్షాలు సగటున ప్రతి సంవత్సరం 18% పంట నష్టాన్ని కలిగిస్తున్నాయి. ఒక రైతు సంవత్సరానికి ₹1 లక్ష పెట్టుబడి పెడితే సుమారు ₹18000 నష్టం సహజంగా ఎదురవుతోంది. మార్కెట్ ధరలు మరో 10% తగ్గితే అదనంగా ₹10000 నష్టం. ఈ పరిస్థితిలో స్థిర పెన్షన్ రూపంలో ₹60000 లభిస్తే మొత్తం నష్టాన్ని గణనీయంగా సమతుల్యం చేయగలదు. ఇది రైతు అప్పు అవసరాన్ని సుమారు 35% వరకు తగ్గించగలదని ఆర్థిక విశ్లేషణలు సూచిస్తున్నాయి.

రైతు ఆత్మహత్యలలో 70%కు పైగా కేసులు అప్పు భారంతో సంబంధం ఉన్నట్లు అధ్యయనాలు తెలుపుతున్నాయి. ప్రతినెల స్థిర ఆదాయం ఉంటే మానసిక ఒత్తిడి 20%-25% వరకు తగ్గే అవకాశం ఉందని గ్రామీణ సామాజిక అధ్యయనాలు సూచిస్తున్నాయి. కుటుంబంలో కనీస ఆహార భద్రత, విద్య ఖర్చుల భరోసా ఉంటే రైతు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. "పంట పోయినా జీవితం పోదు" అనే ధైర్యం కలుగుతుంది.

ఇది కేవలం ఆర్థిక చర్య కాదు; ఇది సామాజిక భద్రతా సంస్కరణ. వ్యవసాయం దేశ ఆహార భద్రతకు మూలాధారం. రైతు ఆదాయం స్థిరంగా ఉంటే గ్రామీణ మార్కెట్లు చురుకుగా మారతాయి. వినియోగ వ్యయం 10%--15% పెరుగుతుంది. స్థానిక ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో చలనం పెరుగుతుంది. దీని ప్రభావం దేశ స్థూల ఆర్థిక వృద్ధిపై సానుకూలంగా పడుతుంది.

అందువల్ల ఈ దేశంలోని రైతుకు ప్రతినెల పెన్షన్ పథకం అమలు చేయడం అత్యవసరం. ఇది రైతుకు "నీవు ఒంటరివి కావు" అనే ప్రభుత్వ హామీ. "అప్పుల్లో మునిగిపోతున్నాను" అనే భయాన్ని తగ్గించే ఆర్థిక రక్షణ కవచం. కనీస జీవన భద్రత కలిగితే రైతు టెన్షన్ పడకుండా తన పంటపై దృష్టి సారించగలడు. పంట విఫలమైనా కుటుంబం ఆకలితో ఉండదనే నమ్మకం కలుగుతుంది. ఆ నమ్మకం రైతు మనోబలాన్ని నిలబెడుతుంది. రైతు నిలబడితేనే దేశం నిలబడుతుంది. రైతు బలపడితేనే ఆహార భద్రత సుస్థిరమవుతుంది. ప్రతినెల 5000 పెన్షన్ రూపంలో ఇచ్చే భరోసా రైతు జీవితంలో స్థిరత్వానికి, సమాజంలో సమతుల్యతకు, దేశ ఆర్థిక వ్యవస్థలో దీర్ఘకాల స్థిరత్వానికి పునాది వేస్తుంది.

3.దేశ ఆర్థిక నిర్మాణాన్ని లోతుగా పరిశీలిస్తే ఒక స్పష్టమైన విరోధాభాసం కనిపిస్తుంది. వ్యవసాయం దేశానికి ఆహార భద్రతను అందిస్తుంది; గ్రామీణ ఉపాధిలో సుమారు 45% జనాభా ఈ రంగంపై ఆధారపడుతోంది; అయినప్పటికీ రైతు జీవితం అత్యంత అస్థిరంగా ఉంది. 2014 నుండి 2023 వరకు సగటున ప్రతి సంవత్సరం 18% పంట నష్టం నమోదవడం సాధారణ గణాంకం కాదు; ఇది గ్రామీణ జీవన విధానాన్ని కుదిపేసే సంకేతం. కొన్ని సంవత్సరాల్లో 22% వరకు నష్టం పెరిగింది. పెట్టుబడులు 9% పెరుగుతుంటే, గిట్టుబాటు ధరలు 5%--8% మధ్యే నిలిచిపోవడం రైతు ఆదాయాన్ని గణనీయంగా దెబ్బతీసింది.

ప్రతినెల ₹5000 పెన్షన్ పథకం ఈ దిశలో కీలకమైన అడుగు అవుతుంది. సంవత్సరానికి ₹60000 స్థిర ఆదాయం రైతు కుటుంబానికి కనీస జీవన భద్రతను ఇస్తుంది. దేశవ్యాప్తంగా 10 కోట్ల రైతు కుటుంబాలు ఉన్నట్లు అంచనా వేస్తే మొత్తం వ్యయం ₹6 లక్షల కోట్లు అవుతుంది. ఇది జిడిపిలో సుమారు 2%-3% మధ్య. రక్షణ, మౌలిక వసతులు, సబ్సిడీలకు భారీ మొత్తాలు కేటాయించే దేశం తన ఆహార భద్రతకు పునాది అయిన రైతుకు ఈ స్థాయి భద్రత ఇవ్వడం అసాధ్యం కాదు.

సగటున ఒక చిన్న రైతు సంవత్సరానికి ₹1.2 లక్షల పెట్టుబడి పెడుతున్నట్లు పరిగణిస్తే, 18% పంట నష్టం వల్ల ₹21600 నష్టం. మార్కెట్ ధరలు 10% తగ్గితే మరో ₹12000 లోటు. మొత్తంగా ₹33600 లోటు. ఈ లోటును భర్తీ చేయడానికి తీసుకునే అప్పుపై 12% వడ్డీ పడితే ఆర్థిక ఒత్తిడి మరింత పెరుగుతుంది. అయితే ₹60000 స్థిర పెన్షన్ ఉంటే ఈ లోటు మాత్రమే కాదు, కుటుంబ జీవనానికి అదనపు భరోసా లభిస్తుంది. అప్పు అవసరం సుమారు 40% వరకు తగ్గే అవకాశం ఉంది. ఇది రైతు ఆర్థిక స్వావలంబనకు ప్రారంభ దశ.

గ్రామీణ ఆర్థిక శాస్త్రం చెబుతున్నది ఒక ముఖ్యమైన విషయం: స్థిర నగదు ప్రవాహం ఉన్న కుటుంబాలు స్థానిక మార్కెట్‌లో వినియోగాన్ని 15% వరకు పెంచుతాయి. అంటే పెన్షన్ పథకం అమలైతే గ్రామీణ దుకాణాలు, సేవా రంగం, చిన్న వ్యాపారాలు చురుకుగా మారతాయి. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఈ ప్రభావం ప్రత్యక్షంగా జిడిపి వృద్ధికి దోహదం చేస్తుంది. ఒక రైతు చేతికి వచ్చే ₹5000 కేవలం వ్యక్తిగత ఆదాయం కాదు; అది గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో చలనం సృష్టించే మూలధనం.

ప్రస్తుతం అమలులో ఉన్న ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా సంవత్సరానికి ₹6000 మాత్రమే అందుతోంది. ఇది నెలకు ₹500. ప్రస్తుత ద్రవ్యోల్బణం సగటున 6% ఉన్న సందర్భంలో ఈ మొత్తం ప్రభావం తక్కువ. అందువల్ల ₹5000 పెన్షన్ అనేది సహాయం కాదు; అది కనీస భద్రతా ప్రమాణం. ఇది రైతు గౌరవాన్ని కాపాడే చర్య.

మానసిక ఆరోగ్య పరంగా కూడా ఈ పథకం ప్రభావం కీలకం. స్థిర ఆదాయం ఉన్న కుటుంబాల్లో ఆర్థిక ఆందోళన 25% వరకు తగ్గుతుందని సామాజిక అధ్యయనాలు సూచిస్తున్నాయి. "రేపటి ఖర్చు ఎలా?" అనే భయం తగ్గితే రైతు నిర్ణయాలు ధైర్యంగా తీసుకోగలడు. పంట వైఫల్యం వచ్చినా జీవితం వైఫల్యం కాదనే భావన బలపడుతుంది. ఇది ఆత్మహత్యల శాతం తగ్గించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది.

ఇది సంక్షేమ పథకం మాత్రమే కాదు; ఇది వ్యవసాయ సంస్కరణల భాగం కావాలి. పంట బీమా సమర్థత 100% పారదర్శకంగా ఉండాలి. గిట్టుబాటు ధరలు శాస్త్రీయంగా నిర్ణయించాలి. నీటి వనరుల నిర్వహణలో 20% సామర్థ్య పెంపు లక్ష్యంగా పెట్టుకోవాలి. ఈ చర్యలతో కలిపి పెన్షన్ అమలు చేస్తే సమగ్ర మార్పు సాధ్యమవుతుంది.

చివరగా ఒక మౌలిక సత్యం గుర్తు పెట్టుకోవాలి: రైతు జీవితం స్థిరంగా లేకపోతే దేశ భవిష్యత్తు స్థిరంగా ఉండదు. అతని ఆదాయం 12 నెలలు ఉండాలి; పంట సీజన్‌కే పరిమితం కాకూడదు. ప్రతినెల ₹5000 పెన్షన్ రైతుకు ఆర్థిక శ్వాసనాళం లాంటిది. ఇది అతనికి భరోసా ఇస్తుంది, కుటుంబానికి గౌరవం ఇస్తుంది, గ్రామానికి చైతన్యం ఇస్తుంది. అప్పుల్లో పుట్టి అప్పుల్లోనే ముగిసే చక్రాన్ని విరమించాలంటే ఈ స్థిర ఆదాయ హామీ కీలకం. రైతు బలపడితేనే ఆహార భద్రత బలపడుతుంది. రైతు నమ్మకం పెరిగితేనే దేశ అభివృద్ధి స్థిరంగా ఉంటుంది. ఈ దిశలో ప్రభుత్వ సంకల్పం చరిత్రాత్మక మార్పుకు నాంది కావచ్చు.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం

# వైద్య విద్యార్థులకు ఫీజు చెక్కుల పంపిణీ

- పేద విద్యార్థుల ఉన్నత చదువులకు అండగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్, మార్చి 4 (జనం సాక్షి) :** ఉన్నత విద్య సాధనలో ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకూడదనే లక్ష్యంతో ఉప్పల్ నియోజకవర్గ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారు. బి.ఎల్.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పదహారు మంది ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులకు వారి విద్యా సంవత్సరం ఫీజుల నిమిత్తం ఆర్థిక సహాయంగా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమం భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు చేతుల మీదుగా ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, సమాజంలోని పేద మరియు ప్రతిభావంతులైన విద్యార్థులు ఆర్థిక సమస్యల కారణంగా వైద్య విద్యను మధ్యలోనే వదులుకోకూడదనే సంకల్పంతో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయ నాయకుడిగా మాత్రమే కాకుండా, సమాజ బాధ్యతను గుర్తించి విద్యార్థుల భవిష్యత్తును బలోపేతం చేసే దిశగా ముందడుగు



వేస్తున్న ఆయన సేవలను ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి సంవత్సరం అనేక మంది విద్యార్థులకు విద్యా ఖర్చుల కోసం సాయం చేస్తూ, వారి జీవితాల్లో ఆశాకిరణంగా నిలుస్తున్న లక్ష్మారెడ్డి సేవా దృక్పథం అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతోనే బి.ఎల్.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వైద్య విద్య వంటి ఖరీదైన కోర్సులు అభ్యసించే విద్యార్థులకు ఫీజుల భారం ఎక్కువగా ఉంటుందని, అలాంటి వారికి చేయూతనివ్వడం సమాజపట్ల తమ బాధ్యతగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ విద్యార్థులు ఉత్తమ వైద్యులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని, ప్రజల ఆరోగ్య సంరక్షణలో తమవంతు పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పదహారు మంది వైద్య విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తమ చదువుకు ఆర్థిక భరోసా కల్పించినందుకు ఆయనకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే తమకు శుభాకాంక్షలు తెలియజేసి ప్రోత్సాహం అందించిన కేటీఆర్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక బాధ్యతతో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చేపడుతున్న ఈ కార్యక్రమం సమాజంలో సానుకూల స్పందన పొందింది. ప్రజా సేవ, విద్యా ప్రోత్సాహం, పేదల పట్ల మమకారం అనే మూడు విలువలను కలగలిపిన ఈ కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మరోసారి తన సేవా దృక్పథాన్ని ప్రతిఫలింపజేశారు.

## బచ్చుకుంట చెరువు వరద నీటి కాలువను పరిశీలించిన రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ



**శేరిలింగంపల్లి, మార్చి 4 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం హాఫీజ్పేట్ డివిజన్ పరిధి బచ్చుకుంట చెరువు అలుగు నుండి ముంబై జాతీయ రహదారి వరకు నిర్మించ తలపెట్టిన వరదనీటి కాలువ నిర్మాణపు పనులను బుధవారం ఇంజనీరింగ్ విభాగం అధికారులు, చందానగర్ డివిజన్ సీనియర్ నాయకులు రఘునాథరెడ్డితో కలిసి రాష్ట్ర ప్రజాపతుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి మాట్లాడుతూ బచ్చుకుంట చెరువు అలుగునుండి ముంబై జాతీయ రహదారి వరకు కోటి 92 లక్షల రూపాయలతో అంచనా వ్యయంతో వరద నీటి కాల్వ నిర్మాణం పనులను చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. వరదనీటి కాల్వ నిర్మాణం పనులను ఎక్కడా రాజీపడకుండా నాణ్యత ప్రమాణాలతో చేపట్టి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. మురళీధర్ సొసైటీ కాలనీ ప్రజలకు వరద నీటి కాలువ నిర్మాణం విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రాబోయే వర్షకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజా అవసరాల దృష్ట్యా తగిన ప్రణాళికతో ముందుకు సాగి సకాలంలో పనులను పూర్తి చేయాలని పునరుద్ఘాటించారు. నియోజకవర్గ పరిధిలోని ఏ ప్రాంతంలో సమస్యవున్నా తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని, ప్రజా సంక్షేమం కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అరికపూడి భరోసాని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు శ్రీదేవి, మూర్తి, స్థానిక కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ వార్డు సభ్యులకు శిక్షణ ప్రారంభం



**మల్దకల్, మార్చి 4 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోనిగ్రామపంచాయతీ వార్డు సభ్యుల ఓరియంటేషన్ ప్రోగ్రాం మూడు సెంటర్లలో ప్రారంభమైంది.రైతు వేదికలో 95 మంది వార్డు సభ్యులు గాను 86 మంది హాజరు కాగా,మండల మహిళా సమైక్య లో 63 మంది వార్డు సభ్యులకు గాను 56 మంది కాగా,మండల పరిషత్ కార్యాలయంలో 82 రెండు మంది వార్డు సభ్యులకు గాను 74 మంది హాజరయ్యారు.మొత్తం మూడు సెంటర్లలో 240 మంది గాను 216 మంది వార్డు సభ్యులు హాజరు శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు.వీరికి సెంటర్ వారిగా ట్రైనింగ్ ఆఫీసర్లు ట్రైనింగ్ ఇచ్చారు.ట్రైనింగ్ లకు ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి,ఎంపీవో జాకీర్ భాష, సూపర్డెంట్ పెద్ద నరసన్న,ట్రైనింగ్ ఆఫీసర్లు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.మస్తాన్ వలి, ధనుంజయ రెడ్డి,రాఘవేందర్ వినయ్ కుమార్ రెడ్డి లు శిక్షణ ఇచ్చారు.

## మృతుని కుటుంబానికి పరామర్శ



**వెల్దండ, మార్చి 4 (జనంసాక్షి) :** వెల్దండ పరిధిలోని కంటోనిపల్లి గ్రామానికి చెందిన కంఠం కృష్ణయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకుని బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య కన్యాకుమారి బాధిత కుటుంబాన్ని పరామర్శించి పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అతని కుటుంబాన్ని బిఆర్ఎస్ పార్టీ అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్, వార్డు సభ్యులు దేవేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో గల్లంతైన గురుకుల విద్యార్థి డెడ్‌బాడీ వెలికితీత

- ఘటన స్థలాన్ని పరిశీలించిన మహబూబ్ నగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 4 (జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండల శివారులోని మహాత్మ జ్యోతిరావు పూలే సంక్షేమ బీసీ వెల్ఫేర్ వసతి గృహంలో చదువుకుంటున్న రాజు అనే విద్యార్థి వసతి గృహ శివారులో ఉన్న చెరువులో పడి మృతి చెందాడు.ఎన్డిఆర్ఎఫ్ బృందాలు తీవ్రంగా గాలించి బుధవారం నాడు రాజు డెడ్ బాడీని వెలికి తీశారు.వసతి గృహ సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే తమ కుమారుడి ప్రాణం పోయిందని రాజు తల్లిదండ్రులు విద్యార్థి సంఘాల నేతలు ఆందోళన చేపట్టారు.ఘటన స్థలానికి మహబూబ్ నగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ చేరుకొని వివరాలను అడిగి తెలుసుకొన్నారు.మృతిని కుటుంబానికి 7 లక్షల యాభై వేల రూపాయలు ఎక్స్ గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఔట్



సోర్సింగ్ ఉద్యోగం,ఇందిరమ్మ ఇల్లు కల్పిస్తామన్నారు.వసతి గృహ సిబ్బంది నిర్లక్ష్యంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.ఘటన స్థలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా షాద్ నగర్ ఆర్డీవో ఆర్ఎన్.సరిత,షాద్ నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, పట్టణ సిఐ విజయ్ కుమార్ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

## ఖాజాగూడ జంక్షన్ పనులను వేగంగా పూర్తి చేయండి



**శేరిలింగంపల్లి, మార్చి 4 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ప్రధాన కూడళ్లలో ఒకటైన ఖాజాగూడ జంక్షన్ రోడ్డు విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని, ప్రజలు, ప్రయాణికుల ఇబ్బందులను గమనంలో పెట్టుకోవాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చీఫ్ సిటీ ప్లానర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం ఖాజాగూడ జంక్షన్ వద్ద ఆయన ఆకస్మిక తనిఖీని నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ కొనసాగుతున్న పనుల తీరుతన్నును శేరిలింగంపల్లి జోనల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఖాజాగూడ జంక్షన్ నిరంతరం రద్దీతో కూడుకొని ఉంటుందని, ఇక్కడికి సమీపంలోనే సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం, బయోడైవర్సిటీ, దుర్గం చెరువు వంటి కీలక ప్రాంతాలు ఈ జంక్షన్ కు కనెక్టివిటీ ఉంటుందన్నారు. అందువల్ల పనుల కొనసాగింపు లేకుండా వీలైనంత త్వరగా వాటిని పూర్తి చేయాల్సిన అవసరం ఉందని, 215 ఫీట్ల రోడ్డు విస్తరణ చేపట్టాల్సి ఉన్నందున జోనల్ అధికారులు ప్రత్యేక చొరవని చూపాలని చీఫ్ సిటీ ప్లానర్ సూచించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ వెంట శేరిలింగంపల్లి జోన్ సిటీ ప్లానర్, శేరిలింగంపల్లి సర్కిల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్, సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హరితహారం చెట్లు అగ్నికి ఆహుతి

- చూసి చూడనట్లు వదిలేస్తున్న అధికారులు
- ప్రకృతిని కాపాడాలి అంటున్న పర్యావరణ ప్రేమికులు

**చిన్నంబావి, మార్చి 4 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో రోడ్డుకి ఇరువైపులా పెద్దఎత్తున మొక్కలు నాటినప్పటికీ కొందరు రైతులు, బాటసారుల తప్పిదంతో మొక్కలు అగ్నికి ఆహుతవుతున్నాయి. దీంతో ప్రభుత్వలక్ష్యం నెరవేరకపోవడంతో పాటు ప్రజాధనం వృథా అవుతోంది. మొక్కల చుట్టూ ముళ్లకంపలు, గడ్డి తొలగించకపోవడంతో రైతులు పొలాల్లోని చెత్తాచెదారం, ముళ్ల కంపలు తగులబెట్టే క్రమంలో, పాదచారులు వేసే నిప్పులకు మంటలు చెలరేగి మొక్కలు దగ్ధమవుతున్నాయి.



మియాపురం నుండి వెలగొండ వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన గడ్డికి నిప్పు పెట్టడంతో హరితహారం మొక్కలకు అంటుకుని చాలా మొక్కలు కాలిపోయాయి. ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని పర్యావరణ ప్రేమికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిగిలిన మొక్కలకైనా రక్షణ కల్పించాలని, వాటిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల బిల్లుల చెల్లింపుల జాప్యం చేయొద్దు

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**నర్సాపూర్, మార్చి 4 (జనం సాక్షి) :** నర్సాపూర్ మున్సిపాలిటీలోని ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ బుధవారం ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుపతూ... ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల బిల్లు చెల్లింపుల్లో జాప్యం చేయొద్దు అన్నారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు సురక్షితమైన, శాశ్వత నివాస గృహాలు అందించడం లక్ష్యమని తెలిపారు.నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టంగా ఆదేశించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, వారికి ఎలాంటి సమస్యలు ఉన్నాయో తెలుసుకున్నారు. నిర్మాణ సామగ్రి సరఫరా, బిల్లుల చెల్లింపులు, సాంకేతిక సిబ్బంది పర్యవేక్షణ వంటి అంశాలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి పాత్ర ముఖ్యం





**చేవెళ్ల, మార్చి 4 (జనంసాక్షి) :** రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి పాత్ర ముఖ్యమని ఎస్సై శిరీష, చన్వేలి గ్రామ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. అరైవ్--అలైవ్ ర్యాలీ నిర్వహించిన పోలీసులు గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా సాగిన ఈ ర్యాలీలో పోలీసు సిబ్బంది, యువత, విద్యార్థులు పాల్గొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ కట్టుకోవడం, మద్యం సేవించి వాహనం నడపకూడదని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి పాత్ర ముఖ్యమని తెలిపారు. నిర్లక్ష్య డ్రైవింగ్ వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, చిన్న జాగ్రత్తలు ప్రాణాలను కాపాడగలవని చెప్పారు. అరైవ్ - అలైవ్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూడా రహదారి భద్రతపై చైతన్యం తీసుకురావడం లక్ష్యమని వెల్లడించారు. ఎస్సై శిరీష, సర్పంచి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భారతీయ కిసాన్ సంఘం ఆవిర్భావ దినోత్సవం

**నారాయణపేట, మార్చి 4 (జనం సాక్షి) :** భారతీయ కిసాన్ సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్రంలో ఘనంగా జరుపుకోవడం జరిగినది ఈ హోలీ పండుగ సందర్భంగా రైతులు సమాచారం ఇవ్వనందున నగర కమిటీ అధ్యక్షులు ఆకుల వెంకటప్ప ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి భారతీయ కిసాన్ సంఘం ఆవిర్భావ దినోత్సవం నారాయణపేట సత్యనారాయణ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమం ముఖ్య వక్తగా రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబా మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై సంఘటితంగా ఉండి రైతాంగ సమస్యలు పరిష్కరించాడానికి సానుకూలంగా సంఘం ఏర్పాటు చేయడం జరిగింది వ్యవసాయ అభివృద్ధికి వ్యవసాయ ఆర్థిక సమస్యలకు సేంద్రియ వ్యవసాయశీ ప్రాధాన్యత ప్రజలకు నాణ్యమైన ఆరోగ్యకరమైన పంటలు పండించి అందించినప్పుడే దేశంలో ప్రజలు బాగుండే విధంగా చూసుకో బాధ్యత మనపై ఉన్నది 1978 సంవత్సరంలో భారతీయ కిసాన్ సాంగ్ స్థాపించి అబిర్భవానికి శ్రీకారం చుట్టిన శ్రీ దత్త పంత్ తింగ్డే రైతులకు సంఘటితంగా ఉండే విధంగా సంఘం ఏర్పాటు నిర్మాణం జరిగినది, అందరూ రైతులు రసాయనిక ఎరువులకు దూరం గా ఉండి సేంద్రియ వ్యవసాయంపై సారవంతమైన భూములను తయారుచేసుకొని అధిక దిగబడి సాధించడానికి ప్రయత్నించాలి అదేవిధంగా ఏవన్నా రెవెన్యూ సమస్యలు వచ్చినా వ్యవసాయ విత్తనాలు ఎరువుల సమస్యలు వచ్చిన ఇరిగేషన్ నీటిపారుదల



విషయాలపై విద్యుత్ విషయాలపై గ్రామంలో రైతాంగ సేవలో చేయడంలో భారతీయ కిసాన్ సంగం ముందుంటుంది రైతులకు ఎన్ని కష్టాలు వచ్చినా ఎన్ని బాధలు వచ్చినా ఓర్చుకొని దేశ సేవ కొరకు ప్రజల సంక్షేమం కొరకు ప్రజల సహాకారాలు అందించడానికి ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం ఇచ్చి అందరి అభిమానం పొందాలని వివిధ సమస్యల మీద మాట్లాడడం జరిగింది అదేవిధంగా నగర అధ్యక్షుడు ఆకుల వెంకటప్ప మాట్లాడుతూ రైతు సంఘటితంగా ఉండి సమస్యలు పరిష్కరించే రైతాంగ సమస్యలకు భారతీయ కిసాన్ సంఘం ముందుండి మీకు అండగా ఉంటాదని తెలపడం జరిగింది మండల అధ్యక్షులు శాసనపల్లి గంప శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో రైతాంగం సమస్యల పరిష్కారానికి భారతీయ కిసాన్ సంఘ వేదికగా దేశంలోని అత్యధికంగా సభ్యత్వం ఉన్న ఏకైక రైతు సంఘం భారతీయ కిసాన్ సాంగ్ భారతదేశానికి రైతాంగానికి ఎలాంటి సమస్యలు వచ్చినా రైతాంగం ముందుండి ఎదురు ఉండి ప్రభుత్వానికి రైతాంగానికి మధ్యవర్తిగా వహించి సమస్యను సాధించడానికి ముందుంటుందని తెలపడం జరిగింది అదేవిధంగా మన వ్యవసాయాన్ని భూములు సారవంతం చేయడానికి సేంద్రియ వ్యవసాయం చాలా ముఖ్యము ప్రస్తుతము అన్ని పంటలకు పశుసంపద ద్వారా వచ్చిన ఎరువుని ఏసి పంటలు దిగుబడి అధికంగా రావడానికి మనము ప్రతి రైతు పాటుపడాలని సందేశం ఇవ్వడం జరిగింది పటేల్ రంగారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సమస్యలపై మరియు రైతాంగ సమస్యలపై రెవెన్యూ సమస్యలపై మాట్లాడడం జరిగింది. ఇందులో భాగంగా జిల్లా ఉపాధ్యక్షుడు శాసమల బాలప్ప జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి జిల్లా కార్యదర్శి పటేల్ రంగారెడ్డి జిల్లా సహకార దర్శి ప్రభుమిస్కిన్ జిల్లా సహకార దర్శి ఓబులాపురం మైపాల్ రెడ్డి మండల అధ్యక్షుడు గడప శ్రీనివాస్ నగర ఉపాధ్యక్షులు తంగు విశ్వనాథ్ రెడ్డి నగర ఉపాధ్యక్షులు బాపనపల్లి రాము పగిడిమారి గ్రామ అధ్యక్షుడు నాగార్జున మన్నే పగటిమారి మాజీ అధ్యక్షుడు నరసింహారెడ్డి నారాయణపేట రైతు సంఘం నాయకుడు మన్నెల లక్ష్మీకాంత్ జాజపురం సింగారం కాట్రే నరసింహులు గొడుగు వెంకటేష్ రిటైర్డ్ ఎస్సై తదితరులు పాల్గొనడం జరిగింది.

## అంగన్‌వాడీ సెంటర్ మౌలిక వసతులకు పూర్తి సహకారం



**చేర్యాల, మార్చి 4 (జనంసాక్షి) :** చేర్యాల కేంద్రంలోని 12వ వార్డులో ఉన్నా అంగన్వాడి కేంద్రాన్ని 12వ వార్డు కౌన్సిలర్ షరిఫా బేగం ఖాజా సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్వాడి సెంటర్‌లో చిన్నపిల్లల ఆరోగ్య స్థితిగతులను, పిల్లలకు అందవలసిన పౌష్టికా ఆహారాన్ని క్రమం తప్పకుండా అందించాలని, పిల్లల ఎదుగుదలలో అంగన్వాడి సెంటర్లు ఎంత దోహదపడుతాయని తెలిపారు. సెంటర్ లో మౌలిక వసతులను పరిశీలించిన అనంతరం తప్పకుండా పిల్లలకు కలవసిన వసతులన్ని ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అంగన్వాడి సెంటర్లకు స్వంత భవనాల కోసం జనగామ నియోజకవర్గం ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సహకారంతో నూతన బిల్డింగుల ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ బాలమణి, ఆయమ్మ, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | గురువారం 05 మార్చి 2026

# మెనూ పక్కాగా అమలు చేయాలి

• జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్ నగర్ బ్యూరో, మార్చి 4 (జనం సాక్షి) :** మెనూ పక్కాగా అమలు చేస్తూ విద్యార్థిని లకు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ బంగ్లా సమీపంలో ఉన్న ప్రభుత్వ బి.సి. బాలికల సంక్షేమ వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతిగృహంలో భోజనం మెనూ ప్రకారం అందించాలని, అలాగే వసతిగృహంలో పరిశుభ్రతను పాటించాలని అధికారులకు సూచించారు. తనిఖీలో భాగంగా కలెక్టర్ వసతి గృహంలోని కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, డార్మిటరీ గదులు, మరుగుదొడ్లు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారికి డైట్ ప్రకారం రుచికరమైన, పోషకాహారం అందుతున్నదా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో ఉన్న విద్యార్థుల సంఖ్య,



గదుల సంఖ్య, విద్యార్థులు ఎలా చదువుతున్నారు, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, ప్రస్తుతం వసతి గృహంలో సుమారు 250 మంది బాలికలు నివసిస్తున్నామని, అయితే డార్మిటరీ గదులు తగినంతగా లేవని తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ పంచాయతీ రాజ్ ఈ ఈ కి పరిశీలించేందుకు తగు ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చూడాలని, తాగునీటిలో పి.పి.ఎం శాతాన్ని తరచూ పరీక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. టెన్త్ క్లాస్ చదువుతున్న ఒక విద్యార్థిని మాట్లాడుతూ, తాము మార్కెట్ రోడ్ పాఠశాలలో చదువుతున్నామని, తెలుగు, హిందీ, బయో సైన్స్ ఉపాధ్యాయుల కొరత ఉందని తెలిపారు. ఈ విషయంపై కూడా సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడతానని కలెక్టర్ తెలిపారు. అదనంగా, వసతి గృహంలోని బోర్‌వెల్ మరమ్మతులు, సీసీ కెమెరాల వ్యవస్థ, సిబ్బంది పనితీరు తదితర అంశాలపై కూడా కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, డైట్ మెనూను కచ్చితంగా అమలు చేయాలని, సమయపాలన పాటించాలని, వసతి గృహంలో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని సిబ్బందికి ఆదేశించారు.

## డబుల్ లైన్ కోసం భూసేకరణ పరిశీలన



**చిన్న శంకరంపేట, మార్చి 4 (జనం సాక్షి) :** చిన్న శంకరంపేట మండలంలోని మిర్జాపల్లి రైల్వే డబుల్ లైన్ కోసం భూసేకరణ భూములను మెదక్ ఆర్డిఓ రమాదేవి, రైల్వే డిఎస్ ధర్మరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా భూ సేకరణకు ఉన్న అడ్డంకులు అడిగి తెలుసుకున్నారు బ్రిడ్జి వద్ద నీరు నిలవకుండా చర్యలు చేపట్టనున్నట్టు రైల్వే డిఎస్ రైతులకు హామీ ఇచ్చారు. అదనపు దారి విషయం గ్రామస్తులు కూర్చుని మాట్లాడి స్థలం అప్పగిస్తే రోడ్డు నిర్మించి ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులతో పాటు, మిర్జాపల్లి సర్పంచ్ సంఘని సునీత, మాజీ సర్పంచ్లు పోతరాజు రమణ,జనార్ధన్, మాజీ ఉపసర్పంచ్ మనోజ్ కుమార్ తో పాటు రైతులు పాల్గొన్నారు.

## అంబరాన్నంటిన హోలీ సంబరాలు

• మక్తల్‌లో హోలీ వేడుకల్లో యువత



**మక్తల్, మార్చి 4 (జనంసాక్షి) :** రంగుల కేళి హోలీ సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో బుధవారం హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. అన్ని వయసుల వారు వయోభేదాలు తారతమ్యాలు అంతస్తులు మరిచి ఆనందోత్సవాలతో హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఆనందాల కేళి హోలీ వేడుకల్లో యువత మహిళలు సందడి చేశారు. ఒకరిపై ఒకరు రంగుల చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. బ్యాండ్ మేళాలతో ఆనందోత్సవాలతో మునిగితేలారు. చెడ్డి గ్యాంగ్,జిజెసి ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో మిత్రబృందాలు భారీ ఎత్తున వేడుకలను జరుపుకున్నారు. బైక్ లపై బయలుదేరి పట్టణ ప్రధాన రహదారుల వెంబడి ర్యాలీ నిర్వహించారు. హోలీ హోలీల రంగా హోలీ అంటూ చిందులు కూడా వేశారు. పట్టణంలోని పలువురు కౌన్సిలర్లు ముఖ్య నాయకులు అధికారులు ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రజాపాలనలో పేదోడి కల సాకారం

• మార్కెట్ చైర్మన్ సదాశివారెడ్డి



నారాయణపేట, మార్చి 4 (జనం సాక్షి) : కాంగ్రెస్ ప్రజా పాలనలో పేదోడి సొంతింటి కల నెరవేరుతున్నదని నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ సదా శివారెడ్డి అన్నారు.ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు నారాయణపేట మండలంలోనీ వండర్ గుట్ట తండా, బండ గుండా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను మార్కెట్ చైర్మన్ శివారెడ్డి ప్రారంబించారు.ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల ఆకాంక్ష నెరవేరుస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయ కుడు చిట్టెం మాధవ రెడ్డి నాయకులు జనార్ధన్ గౌడ్, ఎండి గౌస్ మాజీ . కృష్ణ నాయక్, శ్రీను నాయక్ ,సుదర్శన్ గౌడ్.సాయి రెడ్డి. యాదయ్య.కృష్ణ నాయక్. బాలు నాయక్. రాములు నాయక్. హనుమమ్మ. శ్రీను నాయక్. చందర్ నాయక్ బండ గుండ సర్పంచురామచందర్,అంజలి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాయికోడ్ ఎంఈఓగా నర్సిములు

**రాయికోడ్, మార్చి 4 (జనం సాక్షి) :** రాయికోడ్ మండల నూతన విద్యాధికారిగ గడ్డమీది నర్సిములు బుధవారం మధ్యాహ్నం రాయికోడు ఎంఆర్సి కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం నర్సింలు కర్చల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా సేవలందిస్తున్నారు. ప్రభుత్వం రాయికోడ్ ఎంఈఓగా అదనపు బాధ్యతలను అప్పగించింది. స్థానిక మండల రిసోర్స్ సెంటర్ ( ఎమ్మార్సీ ) లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన రిజిస్టర్‌లో సంతకం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఈఓ నర్సిములు మాట్లాడుతూ రాయికోడ్ మండల విద్యాశాఖ బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా ప్రమాణాలను పెంచడం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం మరియు విద్యార్థులకు మెరుగైన వసతులు అందేలా చూడటమే నా మొదటి ప్రాధాన్యత అన్నారు. అందరి సహకారంతో మండలాన్ని విద్యాపరంగా ముందంజలో ఉంచేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ



సిబ్బంది తదితరులు శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు ఎంఈఓ నరసింహులు వీరభద్రేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆయనకు దేవాలయ చైర్మన్ సతీష్ కులకర్ణి పలుఉరు అర్చకులు దేవుని తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఎంఆర్సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన



**మల్దకల్, మార్చి 4 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు మీటర్ రీడర్స్ యూనియన్ ఔట్సోర్సింగ్ ఉద్యో గులు బుధవారము మల్దకల్ మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ ముందు ఆందోళన చేపట్టారు.ఈ మేరకు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు మాట్లాడుతూ టీజీఎస్పీడీసీఎల్లో తమకు కనీస వేతనం అందేలా చూడాలని,విద్యుత్ సంస్థలో శాశ్వత ఉద్యోగులుగా గుర్తించే విధంగా చర్యలు చేపట్టడంతో పాటు తమ సమస్యలను పరిష్కరించాలని అన్నారు. పీస్ రేటు విధానం రద్దు చేయాలని,కనీస వేతనం అమలు చేయాలని, 30 రోజుల పని దినాలు కల్పించాలని,ఖాళీగా ఉన్న సబ్ స్టేషన్‌లో ఐటిఐ అర్హత కలిగిన వారిని మీటర్ రీడర్లుగా తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గత నాలుగు రోజుల నుంచి సమ్మె కొనసాగుతున్న, మా డిమాండ్లను పరిష్కరించే వరకు మీటర్ రీడర్లు కొట్టమని వారు పిలుపునిచ్చారు.

## అంగరంగ వైభవంగా శ్రీరంగనాథ స్వామి రథోత్సవం

**వనపర్తి బ్యూరో, మార్చి 4 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ రంగనాయక స్వామి ఆలయంతో పాటు, రహదారులు వసతి గృహాలు, రంగసముద్రాన్ని అభివృద్ధి పరిచి బోటింగ్ ఏర్పాటు చేసేందుకు, రంగసముద్ర నుంచి వచ్చే వరద వలన పంట కాలువలు కోసుకుపోకుండా ఉండేందుకు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వనపర్తి శాసనసభ్యులు, తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.శ్రీ రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం నిర్వహించిన రథోత్సవ కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ,వనపర్తి రాజవంశీయులు రాజా కృష్ణదేవరావు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయంలో నుంచి పల్లకిలో ఊరేగింపుగా రథం వద్దకు చేర్చారు. అనంతరం రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి రథాన్ని లాగారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీరంగాపురం గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని, ఎంతో చరిత్ర కలిగిన ఈ ప్రాంతాన్ని రూ 5 కోట్లతో టూరిజం హబ్బుగా మార్చనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. 2 కోట్ల రూపాయలతో ఆలయానికి సంబంధించిన ప్రధాన రహదారిని బాగు చేయనున్నట్లు ఆయన తెలిపారు. 1 కోటి 50 లక్షల రూపాయలతో అతిథి గృహాలను అభివృద్ధి చేయనున్నట్లు



ఆయన తెలిపారు. 24 కోట్ల రూపాయలతో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో శ్రీ రంగనాయక సముద్ర వెనకాల ఉన్న పంట పొలాలలోని కాలువలను బలోపేతం చేసేందుకు కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మద్దిలేటి వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, పెబ్బేర్ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైట్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మార్కెట్ యార్డ్ అధ్యక్షులు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, శ్రీరంగపురం మండల నాయకులు శ్రీహరి రాజు, పెబ్బేరు మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తాడూరు ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ బాధావత్ సంతోష్



**నాగర్‌కర్నూల్, మార్చి 4 (జనంసాక్షి) :** తాడూర్ మండల కేంద్రంలోని ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షా కేంద్రాన్ని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం మ్యాథమెటిక్స్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను, సీసీ కెమెరా వ్యవస్థను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం, హాల్ టికెట్ల తనిఖీ, బందోబస్తు ఏర్పాట్లు తదితర విషయాలపై కలెక్టర్ ఆరా తీశారు. మాల్ ప్రాక్టీస్ కి ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేలా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రంలో 98 మంది విద్యార్థులకు గాను 96 మంది విద్యార్థులు నేటి పరీక్షకు హాజరు కాగా, ఇద్దరు విద్యార్థులు నేటి పరీక్షకు గైర్హాజర్ అయినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 34 పరీక్షా కేంద్రాల్లో 6125 విద్యార్థులకు గాను 5936 మంది విద్యార్థులు హాజరు కాగా 189 మంది విద్యార్థులు నేటి పరీక్ష గైర్హాజర్ అయినట్లు ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ తెలిపారు.

## యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

**వెల్దండ, మార్చి 4 (జనంసాక్షి) :** యూరియా కంపెనీలో కొత్తగా ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ యాప్ విధానాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ ప్రధాన రహదారిపై రైతులు ఆందోళన చేపట్టారు. బుధవారం సింగిల్ విండో కి 700 బస్తాల యూరియా వచ్చినట్లు తెలుసుకున్న రైతులు ఉదయాన్నే అక్కడకు చేరుకొని ఆన్లైన్లో బుకింగ్ చేద్దామను యూరియా బుకింగ్ కావడం లేదని, క్షణాల్లో యూరియా బస్తాలు అయిపోయాయాయని రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కొంతమంది రైతులు తమ వద్ద స్మార్ట్ ఫోన్లు కూడా లేవని, తమకు బుకింగ్ చేసే విధానం కూడా తెలవదని పాత పద్ధతి ద్వారానే యూరియా సరఫరా చేయాలని డిమాండ్ వ్యక్తం చేశారు. దీంతో సమాచారం అందుకున్న మండల వ్యవసాయ అధికారిని శోభారాణి, ఎస్సై కురుమూర్తి ఘటన స్థలానికి చేరుకుని



రైతులతో మాట్లాడారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు కానుగుల జోగయ్య, రైతులు వినోద్ రెడ్డి, తెలుగమల అంజయ్య, సిల్వేరు సత్తయ్య గౌడ్,చిలికేశ్వరం లక్ష్మయ్య, సత్తూరి బాల్ లింగం, చక్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరి



**శ్రీరంగాపూర్, మార్చి 4 (జనం సాక్షి) :** శ్రీరంగాపూర్ మండలం పరిధిలోని వెంకటాపూర్ క్రాస్ రోడ్డు దగ్గర వాహనదారులతో రైతులతో ఎస్సై హిమబిందు ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై హిమబిందు మాట్లాడుతూ వాహనాలపై హెల్మెట్ ధరించకుండా ప్రయాణం చేయకూడదని వాహనము హెల్మెట్ ధరించడం మీ బాధ్యత అని మరియు త్రిబుల్ రైడింగ్ చేయడం కూడా నేరమే కాబట్టి మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని మరియు ఫైబర్ నేరగాళ్లు ఫోన్లోకి అనేకమైన ఏపీకె ఫైల్స్ పంపించి మన అకౌంట్లో ఉన్న డబ్బులను పూర్తిగా దోచేస్తున్నారు .కాబట్టి ఏ లాంటి ఫోన్లో వచ్చిన మెసేజ్లను గాని ఏపీకే ఫైల్స్ గాని ఓపెన్ చేయకూడదని ఎస్సై హిమబిందు అవేర్నెస్ ప్రోగ్రాంలో ద్వారా తెలియజేశారు . ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆయకట్టును స్థిరీకరించాలని మంత్రి ఉత్తమ్‌కు ఎంపీ చామల వినతి

• రైతాంగానికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
• భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**చేర్యాల, మార్చి 4 (జనంసాక్షి) :** సిద్దిపేట జిల్లా పరిధిలోని రంగనాయక సాగర్ రిజర్వేయర్ నుంచి డి10 కెనాల్ నుంచి జనగామ నియోజకవర్గంలోని కొమురవెల్లి మండలంలోని తపాస్ పల్లి రిజర్వేయర్ డి3 కెనాల్ పరిధిలో ఉన్న ఆయకట్టును స్థిరీకరణ చేసి దూల్మిట్ట, చేర్యాల మండలాల పరిధిలోని కమలాయపల్లి, అర్జున్ పట్ల, ఆకునూరు, జాలపల్లి, లింగాపూర్,దూల్మిట్ట గ్రామాల పరిధిలోని సుమారు 7 వేల ఎకరాలకు రంగనాయక సాగర్ డి10 కెనాల్ కింద స్థిరీకరించాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల్ కిరణ్ కుమార్ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకరం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గతంలో ఈ ప్రాంత రైతులు ఈ సమస్యను ఎంపీ దృష్టికి తీసుకురాగా కాల్వలను పరిశీలించి రైతులతో మాట్లాడి రైతుల అవసరాల నిమిత్తం మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి వినతి పత్రం ఇవ్వడంతో రైతులు పడుతున్న ఇబ్బందుల దృశ్య స్పందించిన మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తక్షణమే టెంపర్వరి జీవోను అమలు చేసి రైతులకు సాగునిరు అందించారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని బుధవారం నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి చెరువులలోకి నీటిని విడుదలచేసి రైతన్నలకు సాగునీరు అందించాలని, గతంలో ఇచ్చిన టెంపర్వరి జీవో కాకుండా పర్మినెంట్ జీవో ఇవ్వాలని మంత్రిని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. దీనివల్ల భూగర్భ జలమట్టం పెరిగి రైతులకు మేలు జరుగుతుందని అయన వివరించారు.ఈ విషయంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్టు ఎంపీ చామల్ కిరణ్ కుమార్



రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ రైతు ప్రభుత్వం అని, రైతన్నలకు అండగా ఉంటామని ఎంపీ చాముల కిరణ్ కుమార్ రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు.

# మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత

- అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జిఎస్ఆర్ శంకుస్థాపన



**శాయంపేట, మార్చి 4 (జనం సాక్షి) :** మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శాయంపేట మండల పరిధిలో సీసీ రోడ్లు, వీవో మహిళా సమాఖ్య భవనాలు, ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత అభివృద్ధి శాఖ అధికారుల సమక్షంలో పనుల శంకుస్థాపన పలకలు ఆవిష్కరణ చేశారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. గ్రామాల్లో రహదారి సౌకర్యాల మెరుగుదల, మహిళా సంఘాల బలోపేతం, విద్యార్థులకు సురక్షిత విద్యా వాతావరణం కల్పించేందుకు ఈ పనులు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి, ఎమ్మార్వో ప్రవీణ్ కుమార్ ఎంపీడీవో పణిచంద్ర, మండల నాయకులు, వివిధ గ్రామాలసర్పంచులు, ఉపసర్పంచ్‌లు, గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మహిళా సంఘ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ నిరంతర సరఫరాలో కార్మికుల పాత్ర కీలకం

- ఎస్ఈ ఆనందం



**ఏటూరునాగారం, మార్చి 04(జనంసాక్షి) :** ఇంటింటికి విద్యుత్ సరఫరా చేయడంలో విద్యుత్ శాఖ కార్మికుల పాత్ర కీలకంగా ఉంటుందని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఆనందం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్ లో లైన్మెన్ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సమర్థవంతంగా పనిచేసిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్ సరఫరా నిరంతరం జరిగేందుకు ఈ శాఖలోని ఏఈ నుండి కిందిస్థా హెల్పర్ వరకు చెమటోడ్చి పనిచేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ ఆదా చేయాలని, ఎర్త్ పైపులు అమర్చుకోవాలని, అక్రమ విద్యుత్తు వాడుకుంటే కేసులు పెట్టడం జరుగుతుందన్నారు, వేసవి కాలంలో విద్యుత్ ఉపకర వస్తువులు నిరంతరం వాడకుండా వాటికి కూడా ఒక సమయం ఇవ్వాలన్నారు. ఎక్కడైనా విద్యుత్తు సమస్యలు ఉంటే వెంటనే మా సిబ్బందికి ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డిఈ రాజు, ఏటూరునాగారం డిఈ పురుషోత్తం, ఏడిఈ ఉమా రావు, ఏఈ స్వామి పాల్గొన్నారు. కార్మికులను గుర్తించిన వరుణ్ రెడ్డి ప్రోత్సాహాన్ని మర్చిపోలేని లైన్ ఇన్స్పెక్టర్ కొండ సమ్మయ్య అన్నారు. ఈ లైన్మెన్ దినోత్సవ కార్యక్రమంలో కష్టపడి పనిచేసిన సిబ్బందికి ప్రశంస పత్రాలను అందజేశారు. మా కష్టాన్ని గుర్తించి ప్రశంసా పత్రాలను అందజేసిన ఉన్నతాధికారులకు రుణపడి ఉంటామన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా కోసం 24/7 పనిచేస్తామని కొండ సమ్మయ్య అన్నారు.

# కురుమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలి

- ప్రొపెసర్ కంచ ఐలయ్యను కలసిన గూడూరు కురుమ సంఘం నాయకులు
- శాలువాతో ఘనంగా సన్మానించిన కురుమ సంఘం నాయకులు



**గూడూరు, మార్చి 4 (జనంసాక్షి):** ప్రొపెసర్ కంచ ఐలయ్య కురుమ ను కురుమ సంఘం జిల్లా అధ్యక్షులు చీర అశోక్ ఆధ్వర్యంలో బుధవారం గూడూరు మండల కురుమ సంఘం నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో ఘనంగా సన్మానించినారు. ఈసందర్భంగా కంచ ఐలయ్య తో మాట్లాడుతూ కురుమ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కురుమల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని,ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలను కురుమలకు అమలయ్యే విధంగా చూడాలని,ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని,అర్హత ఉన్న ప్రతి కురుమకు ఇందిరమ్మ ఇండ్లు వచ్చే విధంగా చూడాలని విన్నవించుకున్నారు. ఈసందర్భంగా కంచ ఐలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న కురుమల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని భరోసాను కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎర ముత్తయ్య కురుమ, కోరే శ్రీనివాస్ కురుమ, జిల్లా కమిటీ మెంబర్ కోరే దేవేందర్ కురుమ, గూడూరు గ్రామ అధ్యక్షులు కోరే కుమారస్వామి కురుమ, దొడ్డి కొమురయ్య విగ్రహ కమిటీ గూడూరు మండల ప్రధాన కార్యదర్శి పోతరాజు రవి కురుమ, మాజీ అధ్యక్షులు మండల మల్లేష్ కురుమ,కంకాల శ్రీను కెంచ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# వనం వీడి జనంలోకి నాగులమ్మ

- గండోర్రె గుట్ట నుండి నాగులమ్మ, యేర్రేట్ట గుట్ట నుండి సడలమ్మ లను తీసుకొచ్చిన ఆదివాసి పూజారులు
- అమ్మవార్ల రాకతో నిండు జాతర మొదలు
- నేడు శ్రీ నాగులమ్మ, పగిడిద్దరాజుల కల్యాణ మహోత్సవం





**మంగపేట మార్చి 04 (జనంసాక్షి) :** మండలంలోని వాగోడుగూడెం గ్రామపంచాయతీ పరిధిలోగల శ్రీ లక్ష్మీ నర్సాపూర్ గ్రామంలో కొలువైన శ్రీ నాగులమ్మ మహా జాతరలో భాగంగా రెండవ రోజు బుధవారం శ్రీ నాగులమ్మ, సడలమ్మ లు వనం వీడి జనంలోకి చేరడంతో కీలక ఘట్టం సంతరించుకుంది. బుధవారం శ్రీ నాగులమ్మ ఆలయ ప్రధాన పూజారి బాడిషా రమేష్ ఆధ్వర్యంలో పూజారులు, వడ్డెలు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి సుమారు 11 గంటల సమయంలో ఆదివాసి సాంప్రదాయాల నడుము ఎర్రట్ట గుట్టల నుండి సడలమ్మను, గండోర్రె గుట్ట నుండి నాగులమ్మ తల్లులను డోలు వాయిద్యాల నడుమ లక్ష్మి నర్సాపూర్ గ్రామంలో నాగులమ్మకు చెందిన జెండాలతో ఘనంగా తల్లులిద్దరికీ వైభవంగా ఎదుర్కోలు నిర్వహించారు. అనంతరం రమణక్కపేట గ్రామ సమీపంలో గల గోదావరి నది వద్దకు చేరుకొని పూజారులు ఏడు చెలిమలు తీసి వివిధ రకాల దళాలతో అభిషేకాలు, పుణ్యా స్నానాలు ఆదివాసి సాంప్రదాయంగా నిర్వహించారు. అనంతరం శ్రీ నాగులమ్మ, సడలమ్మ లను గద్దెలపై ప్రతిష్ట గావించారు. రాత్రి సుమారు 8 గంటల సమయంలో చుంచుపల్లి గ్రామం నుండి అమ్మవారికి చెందిన అయిరేణీ కుండలను ఆదివాసి మహిళలు ఆలయానికి తీసుకువచ్చారు. నేడు గురువారం నాగులమ్మ పగిడిద్దరాజుల దివ్య కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ ధర్మకర్త, ప్రధాన పూజారి బాడిషా రామకృష్ణ స్వామీజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి కులపెద్దలు కుర్సం విష్ణుమూర్తి, మడకం రాజేశ్వర్ రావు, చౌళం వెంకటేశ్వర్లు, కొమరం మాధవ రావు, కొమరం పాపారావు, ఇరప రామకృష్ణ, ఇందారపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఈ నెల 6 నుండి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణ అమలుపై రెవెన్యూ, పంచాయతీరాజ్, ప్రణాళిక, ఇరిగేషన్, వ్యవసాయం, ఉద్యానవన, విద్య, వైద్య, సంక్షేమ తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడం, సేవలను సమర్థవంతంగా అందించడం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యత అని పేర్కొన్నారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై విపులంగా దిశానిర్దేశం చేశారు. అంగన్వాడీ కేంద్రాల సదుపాయాలపై మండలాల వారీ నివేదికలు, అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్వాడీ కేంద్రాల వివరాలు, మరమ్మత్తులు, విద్యుత్, మంచినీటి సమస్యలపై మండలాల వారీగా నివేదికలు సమర్పించాలని డిడబ్ల్యుఓను ఆదేశించారు. మహిళా సంఘాల బలోపేతానికి 60 రోజుల్లో ఇందిరా మహిళా శక్తి భవనాల పూర్తి చేయాలని, మహిళా సంఘాల్లో నమోదు కాని సభ్యులను నమోదు చేయాలని డిఆర్డిఓకు సూచించారు. గ్రామపంచాయతీ, విలేజ్ ఆర్గనైజేషన్ స్థాయిలో ఇందిరా మహిళా శక్తి భవనాలను 60 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. బ్యాంకర్లను సమన్వయం చేస్తూ రుణమేళాలను నిర్వహించాలని సూచించారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు యూత్ వీక్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లా స్థాయి టెలికమ్యూనికేషన్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ-ఆఫీస్ ద్వారా మాత్రమే ఫైళ్ల స్వీకరణ ఉంటుందని, ఇక నుంచి అన్ని ఫైళ్లు ఈ-ఆఫీస్ ద్వారానే పంపాలని, నేరుగా పంపిన ఫైళ్లను తిరస్కరిస్తామని స్పష్టం చేశారు. ప్రత్యేక అధికారులు సంక్షేమ గృహాలను తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని తెలిపారు. టాస్క్ ద్వారా యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ప్రణాళిక అధికారి ఈ కార్యక్రమానికి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. మున్సిపాలిటీలు, పంచాయతీలలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. డ్రగ్స్ నివారణ, పిల్లల రక్షణ, భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితా గ్రామసభల్లో చదివి వినిపించాలని, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం, రూ.500 లకే గ్యాస్, షాది ముబారక్, కళ్యాణలక్ష్మి, రైతు రుణమాఫీ తదితర పథకాల లబ్ధిదారుల వివరాలను సేకరించి గ్రామసభల్లో చదివి వినిపించాలని సూచించారు. గ్రామసభల్లో లబ్ధిదారులకు అందిన ప్రయోజనాలను వివరించాలని ఆదేశించారు. భూ సేకరణ, అటవీ అనుమతులపై వేగవంతమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మన ఊరు – మనబడి పెండింగ్ బిల్లులపై నివేదిక సమర్పించాలని డిఈఓను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన గురువారం మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ సిబ్బందికి ప్రజాపాలన ప్రగతి కార్యాచరణలో చేపట్టనున్న కార్యక్రమాలపై వివరించాలని సూచించారు. జరిగిన కార్యక్రమాలపై ప్రతిరోజు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. రైతులకు నానో యూరియా వినియోగం, పంట మార్పిడి విధానం, యూరియా యాప్ వినియోగం తదితర అంశాలపై ఉత్తమ రైతులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీఆర్డీఓ బాలకృష్ణ, అన్ని శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

# ముస్త్యాలపల్లిలో విద్యార్థుల ఏకో ఫ్రెండ్లీ హోలీ సంబరాలు




**నడికూడ, మార్చి 4 (జనంసాక్షి):** నడికూడ మండలం ముస్త్యాలపల్లి గ్రామంలోని పాఠశాల విద్యార్థులు బుధవారం పర్యావరణ హితంగా హోలీ పండుగను జరుపుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు. రసాయన రంగులను పూర్తిగా వదిలి, సహజ పదార్థాలతోనే నేచురల్ కలర్స్ తయారు చేసి హోలీ ఆడారు. విద్యార్థులు బీట్‌రూట్, క్యారెట్, మోదుగ పూలు, పాలకూర వంటి సహజ పదార్థాలను ఉపయోగించి రంగులను తయారు చేశారు. బీట్‌రూట్‌తో ఎరుపు,క్యారెట్‌తో నారింజ, మోదుగ పూలతో పసుపు, పాలకూరతో ఆకుపచ్చ రంగులను తయారు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పిల్లలకు పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. రసాయన రంగులు చర్మానికి, కళ్లకు, పర్యావరణానికి హానికరమని అవగాహన కల్పించారు. పిల్లల ఈ ప్రయత్నం గ్రామస్తులను ఆకట్టుకుంది. గతంలో ఎకో ఫ్రెండ్లీ గణపతి,ఎకో ఫ్రెండ్లీ బతుకమ్మ, ఎకో ఫ్రెండ్లీ రాఖీ పండగలను ఘనంగా నిర్వహించిన విద్యార్థులు ఈసారి ఎకోఫ్రెండ్లీ హోలీ ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవడం మన బాధ్యత అని వారు పిలుపునిచ్చారు. ముస్త్యాలపల్లి పిల్లల ఈ ప్రయత్నం అందరికీ ఆదర్శం. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కందుకూరి శ్రీనివాస్ ఉపాధ్యాయులు పావని, సత్యపాల్‌తోపాటు సర్పంచ్ మేకమల్ల వెంకటేష్ విద్యార్థులతో పాటు హోళీ సంబరాల్లో పాల్గొన్నారు.



# నిర్మల్ పట్టణ అభివృద్ధికి సహకరించండి

- ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసిన మున్సిపల్ ఛైర్మెన్ అప్పాల కావ్య గణేష్ చక్రవర్తి

**నిర్మల్ బ్యూరో, మార్చ్ 4 (జనంసాక్షి) :** నిర్మల్ పట్టణంపై ప్రత్యేక శ్రద్ధ చూపి అభివృద్ధికి సహకరించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రిని మంగళవారం మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య, వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తిలు కోరారు. నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జి శ్రీహరి రావు, మాజీ మంత్రి వేణుగోపాల చారితో కలిసి మంత్రి జూపల్లిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి సన్మానించారు, . నిర్మల్ అభివృద్ధి తో పాటు పట్టణంలోని చారిత్రకమైన శ్యామ్ ఘడ్, బత్తిస్ ఘడ్ లను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని విన్నవించారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్టు ఛైర్మెన్ అప్పాల కావ్య గణేష్ చక్రవర్తిలు పేర్కొన్నారు.

# క్రీడా పాఠశాలలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** తెలంగాణ క్రీడా పాఠశాలలలో ప్రవేశానికి అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. బుధవారం ఐడిఓసీ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్ లో తెలంగాణా క్రీడా పాఠశాల ఆహ్వాన పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. 2026-27 సంవత్సరానికి గాను తెలంగాణ ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూల్, హకీంపేట్ లో 10 బాలురు, 10 బాలికల చొప్పున 2026-27 సంవత్సరానికి గాను నాల్గవ తరగతిలో ప్రవేశానికి ఎంపిక కొరకు జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయము ఆధ్వర్యంలో మండల స్థాయి, జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఆసక్తిగల విద్యార్థిని, విద్యార్థులు ఆన్లైన్ లో పేరు నమోదు చేసుకొని మండల విద్య శాఖ అధికారిని సంప్రదించి పోటీలలో పాల్గొనాలని, ఇతర వివరాలకు మండల విద్య శాఖ అధికారిని సంప్రదించాలని కోరారు. మండల స్థాయిలో ఎంపిక అయిన విద్యార్థిని, విద్యార్థులు జిల్లా స్థాయిలో ఎంపికల తేదిని త్వరలోనే తెలియచేస్తామని ఆయన తెలిపారు.

# భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి



**వరంగల్ బ్యూరో, మార్చి 04 (జనం సాక్షి) :** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిన్ సి. హెచ్. మానవేంద్రనాథ్ రాయ్ సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన జస్టిన్ మానవేంద్రనాథ్ ఆలయ అధికారులు వేదస్వస్తి, మంగళవాద్యాలతో ఘనస్వాగతం పలికారు. ముందుగా ఆదిశంకరాచార్యులను, వల్లభ గణపతిని దర్శించిన అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం అర్చకులు శ్రీ టక్కర్లు సత్యం ఆధ్వర్యమున అర్చకులు, వేద విద్యార్థులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కోర్టు పలువురు న్యాయమూర్తులు తదితరులున్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు కె.ఆర్ నాగరాజు తన జన్మదినమును పురస్కరించుకొని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. ఆలయానికి విచ్చేసిన ఎం.ఎల్.ఏ కి ఆలయ అధికారులు, ధర్మకర్తలు పూర్ణకుంభంతో ఘనస్వాగతం! పలికారు. పూజానంతరం ఆలయ స్నపన మండపంలో అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. ఈ సందర్భంగా టి.ఎన్ జి.ఓ వరంగల్ జిల్లా అధ్యక్షులు శ్రీ ఆకుల రాజేందర్ మరియు పలువురు యూనియన్ నాయకులు, కార్పోరేటర్ జన్ను షీబారాణి అనిల్ తదితరులు దుశ్శాలువలతో సత్కరించి పుష్పగుచ్ఛములు అందజేశారు.

# 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' విజయవంతానికి పటిష్ట కార్యాచరణ రూపొందించాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్ ప్రతినిధి, మార్చి 4(జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 99 రోజుల 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'ను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసేందుకు పటిష్ట కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమావేశమై అమలు విధానంపై దిశానిర్దేశం చేశారు. ఈనెల 6వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు ఐదు దశల్లో 99 రోజులపాటు వివిధ శాఖలకు సంబంధించిన పది ముఖ్య అంశాలపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి 6 నుండి జూన్ 12 వరకు వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. మార్చి 6 నుండి మార్చి 15 వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ల పరిష్కరణ అంశంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యాలయాల పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్ల వేగవంతమైన పరిష్కారం, రికార్డుల సక్రమ నిర్వహణ, ప్రజలకు సమయానుకూల సేవలందించడం లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో తడి--పొడి చెత్త వేరు సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త నిర్మూలన, ప్రభుత్వ భవనాల శుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఏప్రిల్ 6 నుండి ఏప్రిల్ 11 వరకు ఆరోగ్యం - ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్తులు అంశంపై ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, గర్భిణీలు మరియు చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. ఏప్రిల్ 13 నుండి ఏప్రిల్ 18 వరకు సురక్షితంగా చేరుకోండి కార్యక్రమం హోం మరియు రవాణా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించ బడుతుందని తెలిపారు. ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 25 వరకు సంక్షేమం అంశంపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు, ఇందిరమ్మ ఇల్లు పథకం అమలు స్థితిపై సమీక్షలు నిర్వహించి, లబ్ధిదారులకు పథకాల ప్రయోజ నాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు పిల్లల భద్రత మరియు రక్షణ - డ్రగ్స్‌కు నో కార్యక్రమం పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాల రూపంలో అమలు చేయబడుతుందని చెప్పారు. మే 4 నుండి మే 9 వరకు రైతులు (వ్యవసాయం( అంశంపై వ్యవసాయ, రెవెన్యూ, నీటిపారుదల, విద్యుత్ శాఖలు సమన్వయంతో రైతులకు సాగు సలహాలు, ఎరువులు-విత్తనాల లభ్యత, సాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరా అంశాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మే 11 నుండి మే 16 వరకు విద్య అంశంపై పాఠశాలల మౌలిక వసతులు, పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, బోధన నాణ్యతపై సమీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. మే 18 నుండి మే 23 వరకు యువత మరియు క్రీడలు అంశంపై క్రీడా పోటీలు, యువజనోత్సవాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు చేపట్టాలని సూచించారు. మే 25 నుండి మే 30 వరకు మహిళలు అంశంపై మహిళా సాధికారత, స్వయం ఉపాధి, స్వయం సహాయక సంఘాల బలోపేతం, రుణాల సద్వినియోగంపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జూన్ 1 నుండి జూన్ 12 వరకు పర్యావరణం అంశంపై వృక్షారోపణ, ప్లాస్టిక్ నియంత్రణ, పచ్చదనం పెంపు కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. ఈ 99 రోజుల కార్యాచరణ గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఐదు దశల్లో అమలు చేయబడుతుందని తెలిపారు. మార్చి 6న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో కార్యాచరణపై మంత్రుల సమీక్ష సమావేశం నిర్వహించబడుతుందని వెల్లడించారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తి వివరాలతో సిద్ధంగా హాజరుకావాలని ఆదేశించారు. మార్చి 6 నుండి 16 వరకు నిర్వహించనున్న పరిశుభ్రత కార్యక్రమాలపై ప్రత్యేక దిశానిర్దేశం చేస్తూ ప్రతి గ్రామం, మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. 99 రోజుల ప్రణాళిక జిల్లాలో ఆదర్శవంతంగా అమలై రాష్ట్రానికి మాదిరిగా నిలవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సమావేశంలో డి ఎఫ్ ఓ అనుజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి (రెవెన్యూ), అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ వై.వి. గణేష్, డిఆర్ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈవో రామ్ రెడ్డి, ఉప కమిషనర్ ప్రసన్న రాణి, నర్సంపేట, వరంగల్ ఆర్డీవోలు ఉమారాణి, సుమ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 4 (జనంసాక్షి) :** ప్రజాపాలన ప్రగతి 99 రోజుల ప్రణాళికల కార్యాచరణ అమలుపై రెవెన్యూ, పంచాయతీరాజ్, ప్రణాళిక, ఇరిగేషన్, వ్యవసాయం, ఉద్యానవన, విద్య, వైద్య, సంక్షేమ తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడం, సేవలను సమర్థవంతంగా అందించడం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యత అని పేర్కొన్నారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై దిశానిర్దేశం చేశారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు యూత్ వీక్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లా స్థాయి టెలికమ్యూనికేషన్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ఆఫీస్ ద్వారా మాత్రమే ఫైళ్ల స్వీకరణ ఉంటుందని, ఇక నుంచి అన్ని ఫైళ్లు ఈ ఆఫీస్ ద్వారానే పంపాలని స్పష్టం చేశారు. ప్రత్యేక అధికారులు సంక్షేమ గృహాలను తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని, టాస్క్ ద్వారా యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ప్రణాళిక అధికారి ఈ కార్యక్రమానికి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. మున్సిపాలిటీలు, పంచాయతీలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. డ్రగ్స్ నివారణ, పిల్లల రక్షణ, భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితా గ్రామసభల్లో చదివి వినిపించాలని, ఇందుకొరకు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం, రూ.500 లకే గ్యాస్, తదితర పథకాల లబ్ధిదారుల వివరాలను సేకరించి గ్రామసభల్లో చదివి వినిపించాలని సూచించారు. గ్రామసభల్లో లబ్ధిదారులకు అందిన ప్రయోజనాలను వివరించాలని ఆదేశించారు. భూ సేకరణ, అటవీ అనుమతులపై వేగవంతమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మన ఊరు మనబడి పెండింగ్ బిల్లులపై నివేదిక సమర్పించాలని డిఈఓను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ సిబ్బందికి ప్రజాపాలన ప్రగతి కార్యాచరణలో చేపట్టనున్న కార్యక్రమాలపై వివరించాలని సూచించారు. జరిగిన కార్యక్రమాల పై ప్రతిరోజు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. యూరియా యాప్ వినియోగం తదితర అంశాలపై రైతులతో అవగహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ కె.నరసింహ, అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యువత ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**మంథని, మార్చి 4 (జనం సాక్షి) :** యువత ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంథని పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. మంథనిలోని గంగపురి ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని, గౌతమి నగర్ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ను, టాస్క్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. ప్రభుత్వ 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ లో భాగంగా టీజిఐఐసి సంస్థ ఆధ్వర్యంలో గార్మెట్ యూనిట్ల ఏర్పాటు చేసేందుకు వీలుగా 2 ఎకరాలు కేటాయించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. టాస్క్ సెంటర్ ద్వారా యువత మంచి శిక్షణ అందించేందుకు వీలుగా మంథని లో సెంటర్ ఏర్పాటు చేశామని, అవసరమైన పక్షంలో మరో భవనానికి కూడా విస్తరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామంలో నిర్మిస్తున్న స్త్రీ భవనం పనులను కలెక్టర్ పరిశీలించి పెండింగ్ ఉన్న చిన్న చిన్న పనులు పూర్తిచేసి మార్చి 31 నాటికి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మంథని ఆర్డీవో సురేష్, తహసిల్దార్ ఆరిఫోద్దీన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మోదుగుపూల వసంతం



**చండూరు, మార్చి 4 (జనంసాక్షి) :** ప్రకృతి ఒడిలో కాషాయ వర్ణశోభ.. శివయ్యకు ఇష్టమైన గోగుపూల కౌగిలిలో అటవీ ప్రాంతం వసంతం రాకతో ప్రకృతి పరవశిస్తోంది. శిశిరంలో ఆకుల్ని రాల్చిన అడవి తల్లి, ఇప్పుడు మోదుగు పూల సింగారంతో కొత్త కళను సంతరించుకుంది. పచ్చని చెట్ల మధ్య అక్కడక్కడ అగ్నిజ్వాలల్లా కనిపిస్తున్న ఈ మోదుగు పూలు పర్యాటకులకు, బాటసారులకు కనువిందు చేస్తున్నాయి. ప్రకృతి సిద్ధమైన రంగుల విందు మిగిలిన చెట్లన్నీ పచ్చని చిగుళ్లతో ముస్తాబవుతుంటే, మోదుగు చెట్లు మాత్రం ఆకుల్లేకుండానే కేవలం పూల గుత్తులతో నిండిపోయి ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. నల్గొండ జిల్లా మొదలుకొని రంగారెడ్డి జిల్లా వరకు రోడ్డుకు ఇరువైపులా విస్తరించి ఉన్న ఈ పూల సోయగం చూసి పులకరించని మనసు ఉండదు. ఈ గోగుపూలను సాక్షాత్తూ ఆ భోళాశంకరుడికి అత్యంత ఇష్టమైన పూలుగా భక్తులు భావిస్తారు. నేటి కాలంలో వాడుతున్న కెమికల్ రంగుల కంటే, పూర్వం ఈ మోదుగు పూలను నీళ్లలో మరిగించి తీసిన సహజ సిద్ధమైన రంగులతోనే హోలీ వేడుకలు జరుపుకునేవారు. ఇవి చర్మానికి ఎంతో మేలు చేస్తాయి. ఒకప్పుడు ఊరి పొలిమేరల్లో, చెల్కల్లో విరివిగా కనిపించే మోదుగు చెట్లు ఇప్పుడు క్రమంగా కనుమరుగవుతున్నాయి. అటవీ భూములు సాగు భూములుగా మారడం, రియల్ ఎస్టేట్ వెంచర్ల విస్తరణతో మోదుగు చెట్లను నరికేస్తున్నారు. మన సంస్కృతిలో భాగమైన, ఎన్నో ఔషధ గుణాలున్న ఈ చెట్ల సంఖ్య తగ్గిపోతుండటంపై పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్ తరాలకు ఈ 'అడవి వెలుగులను' అందించాలంటే వీటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

# గ్రామ సమగ్రాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

- సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 4 (జనంసాక్షి) :** గ్రామ సమగ్ర అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈనెల 2 నుండి 7వ తేదీ వరకు 3వ విడత సూర్యాపేట, ఆత్మకూర్ (ఎస్), మునగాల, చివ్వెంల, పెన్‌పహాడ్ మండలాల సర్పంచులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచులు పంచాయతీరాజ్ చట్టం, ప్రభుత్వ పథకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. గ్రామపంచాయతీ పనుల నిర్వహణ, గ్రామ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, ప్రభుత్వం అమలు చేస్తున్న కుటుంబ సంక్షేమం, విద్య, ప్రజారోగ్యం, సామాజిక అభివృద్ధి వంటి అంశాలపై ఈ శిక్షణలో అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఒక్క సర్పంచ్ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తద్వారా తమ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను వినియోగించుకోవాలని, సాంకేతిక అంశాల పట్ల కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తద్వారా ప్రజా సౌకర్యాలపై మరింత శ్రద్ధ పెట్టవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు 111 కోట్లు రూపాయల చెల్లింపులు

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**కౌడిపల్లి, మార్చి 4 (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు జిల్లా వ్యాప్తంగా 5201 ఇందిరమ్మ ఇండ్లకు గాను 111 కోట్లు చెల్లించినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ తెలిపారు. బుధవారం కౌడిపల్లి మండల కేంద్రంలోని నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన పనులు ప్రారంభించి, నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ప్రతి వారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల బిల్లులను చెల్లిస్తున్నట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ దశల్లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికకు శ్రీకారం

- 99 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



**భువనగిరి పట్టణం, మార్చి 4 (జనం సాక్షి) :** జిల్లాలో మార్చి 6 నుండి జూన్ 12 వరకు నిర్వహించనున్న 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి సహా వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామీణ, పట్టణ స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేలా సమగ్ర కార్యాచరణ ఉండాలని అన్నారు. శానిటేషన్, రెవెన్యూ శాఖ పెండింగ్ ఫైళ్లు, హెల్త్, హౌసింగ్, ఎడ్యుకేషన్, అంగన్వాడీ, వ్యవసాయం, హాస్టళ్లు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై శాఖలవారీగా పూర్తి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ విధి విధానాలు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జయ, ఆర్డీవోలు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో ఉచిత నైపుణ్య శిక్షణ



**భూదాన్ పోచంపల్లి, మార్చి 4 (జనం సాక్షి) :** గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మండంలోని జలాల్‌పూర్ గ్రామంలో స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన సహకారంతో డేటా నమోదు ఆపరేటర్ డిజిటల్ మిత్ర కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ ఎన్. కిషోర్ రెడ్డి తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన యువతి యువకులు, ఈ కోర్సుకు అర్హులు. శిక్షణ వ్యవధి మూడు నెలలు ఉండగా, ఎంపికైన అభ్యర్థులకు ఉచిత నివాసం మరియు భోజన సౌకర్యాలు కల్పించబడతాయి. ఆసక్తి గల అభ్యర్థులు తమ అసలు విద్యార్హత సర్టిఫికెట్లతో మార్చి 16, 2026 లోపు సంస్థ కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9133908000, 9133908111, 9133908222, 9948466111 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

## బెట్టెతండా లెఫ్ట్ పనులను పరిశీలించిన మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి



**పాలకవీడు, మార్చి 4 (జనంసాక్షి) :** మండలంలోని బెట్టెతండా గ్రామపంచాయతీ శివారులో మూసీ నది ఒడ్డున 33 కోట్ల రూపాయలతో నిర్మాణం జరుగుతున్న బెట్టెతండా లిఫ్ట్ నిర్మాణ పనులను రాష్ట్ర భారీ నీటిపారుదల, గృహ నిర్మాణ శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. పనులలో జాప్యం పై అధికారులను హెచ్చరించారు. ఈ సంవత్సరం మే చివరి నాటికి పనులు పూర్తి కావాలని, నాణ్యత ప్రమాణాలతో లిఫ్ట్ నిర్మాణం జరగాలని కాంట్రాక్టర్ లను, అధికారులను ఆదేశించారు. సజ్జాపురం, బెట్టెతండా, పాడేతండ గ్రామాలకు చెందిన 2041 ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని చేపట్టినట్టు స్పష్టం చేశారు. ఒక్క ఎకరానికి లక్ష 66 వేల రూపాయల ఖర్చవుతున్న గిరిజన రైతాంగం సమస్యను తీర్చడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని. అందులో భాగంగానే ఈ ప్రాజెక్టును చేపట్టినట్టు ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మోతిలాల్, మాజీ ఎంపీపీ గోపాల్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బారావు, నాయకులు బెల్లంకొండ నరసింహారావు, జితేందర్ రెడ్డి, శశి రెడ్డి, అందే రాజు, పిన్నెల్లి ఉపేందర్, పుత్తూరు నర్సిరెడ్డి, రామానుజ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్సై భరత్ భూషణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మానేయ యాదవ్



**మోమిన్‌పేట, మార్చి 4 (జనం సాక్షి) :** మోమిన్ పేట నూతన ఎస్సైగా పదవి బాధ్యతలు స్వీకరించిన జి. భరత్ భూషణ్ ను కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మానేయ యాదవ్, లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశం యాదవ్, దేవేందర్ రెడ్డి, హనుమంత్ రెడ్డిలు కలిశారు.

## అధిక శబ్దం చేస్తున్న సైలెన్సర్‌పై పోలీసుల ఉక్కుపాదం

- 150 సైలెన్సర్లను రోడ్డు రోలర్ తో తొక్కించిన పోలీస్ శాఖ



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 4 (జనం సాక్షి) :** కామారెడ్డి జిల్లా కేంద్రంలో కొన్ని బైకులకు విపరీతమైన శబ్దం చేసే సైలెన్సర్ బిగిస్తూ యువత రోడ్లపైచెక్కర్లు కొడుతున్న సందర్భంలో కామారెడ్డి పోలీసులు అలాంటి వాహనాలకు ఫైన్ లు వేస్తూ దాదాపు 150 సైలెన్సర్లను తొక్కించడం జరిగింది ఇందులో భాగంగానే నిజాం సాగర్ చౌరస్తాలో సైలెన్సర్లను రోడ్డు రోలర్లతో తొక్కిండం జరిగింది ఏ ఎస్ పి చైతన్య రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ సీఐ నరహరి పర్యవేక్షణలో. ట్రాఫిక్ ఎస్ఐ మహేష్ మరియు ట్రాఫిక్ సిబ్బందిపాల్గొనగా ఈ కార్యక్రమం జరిగింది పట్టణ సిఐ నరారీ మాట్లాడుతూ అధిక శబ్దంతో వాహనాలకు సైలెన్సర్ ఉంటే కచ్చితంగా చర్య తీసుకుంటామని ఇందులో భాగంగానే 150 సైలెన్సర్లను రోడ్డు రోలర్ తో ధ్వంసం చేయడం జరిగిందని తెలియజేశారు.

# కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పూరి వెంటనే రాజీనామా చేయాలి

- జిల్లా డిసిసి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ



**భువనగిరి పట్టణం, మార్చి 4 (జనం సాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా డిసిసి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ ఆధ్వర్యంలో భువనగిరి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ అధ్యక్షతన జిల్లా ఎగ్జిక్యూటివ్ మీటింగ్ వైట్ షర్ట్స్ ధరించి సిగ్నేచర్స్. హోలీ కార్యక్రమం జరిగింది. నీలం పద్మ మాట్లాడుతూ రేపిస్ట్ జెఫ్రి ఎక్స్టెన్ తో హర్దీప్ సింగ్ పూరి కేంద్ర జూనియర్. గ్యాస్ . పెట్రోలియం మంత్రి కి ఏంటి సంబంధం ఫైల్స్ లో ప్రస్తావన ఎక్స్టెన్ ఫైల్ అంటే ఏంటిది. వారు బ్రతికి ఉన్నప్పుడు ఎన్నో అరాచకాలు చేసి నారు చనిపోయిన తర్వాత ఈమెయిల్ డేటా 44 సేకరించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఏ విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఆడిస్తున్నాడో ఈ మెయిల్స్ లో వారి బాగోతం మొత్తం డేటా బయటపడిందని, అమ్మాయిలను ఎత్తుకొని పోయి ఎక్స్టీన్ ఫైల్ లో దాచిపెట్టి పెట్టారు. పెట్రోలియం గ్యాస్ కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి ఈ విధంగా మాట్లాడడం సిగ్గుచేటు. 14 సార్లు కలిసామన్నారు. కానీ నేను 4 సార్లు కలిశానని ఈ విధంగా మాట్లాడడం దుర్మార్గమైన పని ఇలాంటి వ్యక్తికి ప్రధాని నరేంద్ర మోడీ సపోర్ట్ చేయడం మహిళా కాంగ్రెస్ తరపున ఖండిస్తున్నామని నీలం పద్మ అన్నారు. చిన్నారులను లైంగికంగా శారీరకంగా మానసికంగా వేధింపులకు గురి చేసినారు వారికి న్యాయం చేయాలని మహిళా కాంగ్రెస్ తరపున డిమాండ్ చేస్తున్నాము. హర్దీప్ సింగ్ పూరి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. యూత్ కాంగ్రెస్ నేషనల్ అధ్యక్షులు ఉదయ్ వారి టీమును అరెస్టు చేసి వారిని ఇబ్బంది పెట్టడం వెంటనే వారిని విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వా మొండి వైఖరిని భువనగిరిలో కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి రాజీనామా చేయాలని సిగ్నేచర్స్. మహిళతో కలిసి హోలీ కార్యక్రమం నిర్వహించామని నీలం పద్మ అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ సెక్రెటరీ పావని. కవిత మండల ప్రెసిడెంట్స్ . రజిత. టౌన్ ప్రెసిడెంట్ డి. కవిత డిస్ట్రిక్ట్ కమిటీ మెంబర్స్ జనరల్ సెక్రెటరీలు. సెక్రెటరీలు. బ్లాక్ ప్రెసిడెంట్స్ పాల్గొన్నారు.




# ముంచిన యుద్ధం

- 10 లక్షల కోట్లు ఆవిరి!
- సెన్సెక్స్ 1100 పాయింట్లు డౌన్.. ?

**న్యూఢిల్లీ:**పశ్చిమాసియాలో యుద్ధ ప్రకంపనలు దలాల్‌స్ట్రీట్‌నూ తాకాయి. ప్రధాన సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ భారీగా పతనమయ్యాయి. ప్రపంచ ఇంధన సరఫ రాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధి మూసివేత కారణంగా చమురు ధరలు పెరగడం, తాజా ఉద్రిక్తతల కారణంగా ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న భయాలు నెలకొన్నాయి. అదే జరిగితే అమెరికా ఫెడ్, ఆర్‌బీఐ ఇప్పట్లో వడ్డీ రేట్లు తగ్గించకపోవచ్చన్న అంచనాలు నెలకొన్నాయి. దీనికి తోడు ఎఫ్‌ఐఐల అమ్మకాలు, రూపాయి విలువ క్షీణించడం కూడా మన మార్కెట్ పతనాన్ని శాసించాయి. ఓ దశలో సెన్సెక్స్ 1700 పాయింట్లకు పైగా పతనం కాగా.. చివరకి 1100 పాయింట్ల నష్టంతో గట్టెక్కింది. దీంతో మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.10 లక్షల కోట్ల మేర ఆవిరై రూ.456 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 78,528.82 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,238.85) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 78,443.20 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 1122.66 పాయింట్ల నష్టంతో 79,116.19 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 385.20 పాయింట్ల నష్టంతో 24,480.50 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 92.16గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా మినహా మిగిలిన కంపెనీల షేర్లు నష్టపోయాయ. టాటా స్టీల్, ఎల్‌అండ్‌టీ, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్టీపీసీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్



బ్యారెల్ ధర 82 డాలర్లకు చేరగా.. బంగారం ఔన్సు 5185 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

కారణాలు ఇవే.. అమెరికా- ఇరాన్ వార్

ఇరాన్‌పై అమెరికా- ఇజ్రాయెల్ సంయుక్త ఆపరేషన్ ఐదోరోజుకు చేరింది. తాజాగా టెహ్రాన్, బీరుట్‌లపై దాడులు జరిగాయి. మరో నాలుగైదు వారాల పాటు యుద్ధం కొనసాగవచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అంతకంటే ఎక్కువ కాలం కొనసాగినా అందుకు సిద్ధమని పేర్కొనడంతో యుద్ధం ఇంకెంత కాలం కొనసాగుతుందోనన్న భయాలు నెలకొన్నాయి.

ముడి చమురు పైకి

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితుల కారణంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 82 డాలర్లకు చేరింది. భారత చమురు అవసరాలు 85 శాతం దిగుమతుల వల్లే తీరుతున్నాయి. ఈ నేపథ్యంలో చమురు ధరలు పెరగడంతో కరెంటు ఖాతా లోటు, ద్రవ్యోల్బణం, వృద్ధిపై భయాలు నెలకొన్నాయి.

వార్ ఎఫెక్ట్‌తో అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి క్షీణించి జీవనకాల కనిష్ఠాలకు పడిపోయింది. నేటి సెషన్‌లో 69 పైసలు కోల్పోయి ఏకంగా 92.18 మార్క్ వద్ద కనిష్ఠాన్ని తాకింది. రూపాయి విలువ పతనం వల్ల విదేశీ నిధులు తరలిపోయి కంపెనీల లాభదాయకతపై ప్రభావం పడుతుంది.

ఎఫ్‌ఐఐల విక్రయాలు

దీనికితోడు దేశీయ స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత మదుపర్ల విక్రయాలు కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి నెలలో నెట్ సెల్లర్లుగా ఉన్న ఎఫ్‌ఐఐలు.. మార్చి 2న కూడా రూ.3,295 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.

## నియామకాలు 12% పెరిగాయ్

### కృత్రిమ మేధ, ఐటీ రంగాల్లో రికవరీ వల్లే
### నౌకరీ జాబ్‌స్పీక్ ఇండెక్స్ నివేదిక


**న్యూఢిల్లీ:**మన దేశంలో కార్యాలయ ఉద్యోగ (వైట్‌కాలర్) నియామకాలు గత నెలలో పెరిగాయి. కృత్రిమ మేధ (ఏఐ) స్వీకరణ పెరగడంతో పాటు ఐటీ రంగ రికవరీయే ఇందుకు కారణమని నౌకరీ జాబ్‌స్పీక్ ఇండెక్స్ నివేదిక వెల్లడించింది. 2025 ఫిబ్రవరిలో ఈ సూచీ 2,890 పాయింట్లుగా ఉండగా, గత నెలలో 12% పెరిగి 3,233 పాయింట్లకు చేరిందని తెలిపింది. నెలవారీగా చూస్తే ఈ ఏడాది జనవరి నుంచి ఫిబ్రవరికి 23% వృద్ధి నమోదైంది. సాధారణంగా 2 నెలల మధ్య ఇది 13-16 శాతంగా ఉంటుందని నివేదిక తెలిపింది. దీని ప్రకారం..ఐటీ రంగంలో నియామకాలు వార్షిక ప్రాతిపదికన 6% పెరిగాయి. తాజా నియామకాలు కూడా ఆరోగ్యకర స్థాయిలో 8 శాతంగా నమోదయ్యాయి. భారత్‌లోని బహుళజాతి ఐటీ కంపెనీల (ఎంఎన్‌సీ) నియామకాలు 55% పెరిగాయి. ఐటీ రంగంలోనే ఏఐ/ఎంఎల్ (కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్) నియామకాలు 40% పెరిగాయి. ఫ్రెషర్స్ నియామకాలు వార్షికంగా 17% వృద్ధి నమోదు చేశాయి. రూ.20 లక్షల వార్షిక ప్యాకేజీ ఉండే ఉద్యోగాలకు గిరాకీ 23% పెరిగింది. ప్రారంభ స్థాయి, అధిక విలువ ప్రతిభా విభాగాల్లో బలాన్ని ఇది సూచిస్తోంది.ఐటీ యేతర రంగాల్లో బీమా రంగం 28% వృద్ధితో ముందంజలో ఉంది. దీని తర్వాత బీపీఓ/ఐటీఈఎస్ (22%), స్థిరాస్తి (19%), ఆతిథ్యం/ప్రయాణం (15%), రిటెయిల్ (14%) ఉన్నాయి.2026 ఫిబ్రవరి లో అన్ని రంగాల దేశీయ ఎంఎన్‌సీల్లో నియామకాలు 24% పెరిగాయి. ఏఐ/ఎంఎల్ నియామకాలు ఏడాది క్రితం ఇదే నెలతో పోలిస్తే 49% పెరిగాయి. విదేశీ ఎంఎన్‌సీలు ఏఐ/ఎంఎల్ నియామకాలను 43% పెంచగా, భారతీయ ఎంఎన్‌సీలు తమ ఏఐ/ఎంఎల్ నియమాకాలను 82% పెంచాయి. ఐటీ నియామకాలు అర్థవంతంగా పెరుగుతున్నాయి. భారతీయ ఎంఎన్‌సీలు ఏఐ ప్రతిభపై పెట్టుబడులు పెడుతున్నాయి. కొత్త ఆర్థిక సంవత్సరం (2026-27)లోనూ ఇది కొనసాగే అవకాశం కనిపిస్తోంది

## ర్యాపిడో నుంచి ఫుడ్ డెలివరీ యాప్.. 'ఓన్‌లీ'

### కమిషన్ లేకుండా సేవలు

**న్యూఢిల్లీ:**ద్విచక్ర వాహన రైడింగ్ యాప్ ర్యాపిడో.. ఆహార డెలివరీ సేవల్లోకి అడుగుపెట్టింది. ఇందుకోసం 'ఓన్‌లీ' పేరుతో విడిగా ఓ యాప్‌ను ప్రారంభించింది. రెస్టారెంట్ల నుంచి ఎలాంటి కమిషన్‌ను 'ఓన్‌లీ' వసూలు చేయబోదని కంపెనీ తెలిపింది. అయితే రవాణా వ్యయాల కోసం వినియోగదార్ల నుంచి డెలివరీ రుసుము వసూలు చేస్తామని పేర్కొంది.ధరలు, ఛార్జీలపరంగా నిజాయతీకి 'ఓన్‌లీ' ప్లాట్‌ఫామ్ ప్రాధాన్యం ఇస్తుందని తెలిపింది. ప్లాట్‌ఫామ్ రుసుము లేదా మెనూ ధరలను పెంచడం లాంటివి ఉండవని, వినియోగదార్లు కేవలం ఆహారం, డెలివరీకి డబ్బులు చెల్లిస్తే సరిపోతుందని వెల్లడించింది. తొలుత ఈ సేవలను బెంగళూరులో అందుబాటులోకి తెచ్చింది.




## మనదేశానికి మరిన్ని జీసీసీలు!

### పశ్చిమాసియాపై కంపెనీలు వెనకడుగు వేసే అవకాశం

**న్యూఢిల్లీ:**పశ్చిమాసియాలో తీవ్రమవుతున్న యుద్ధం వల్ల గ్లోబల్ క్యాపబిలిటీ కేంద్రాలు (జీసీసీ), స్వల్పకాలంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. అయితే అంతర్జాతీయ కంపెనీలు తమ కార్యకలాపాల్లో స్థిరత్వానికి ప్రాధాన్యత ఇస్తుండటంతో, అంతిమంగా జీసీసీల రూపంలోనూ భారత్ ప్రయోజనం పొందొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం భారత్, పశ్చిమాసియా ప్రాంతాల్లో మైక్రోసాఫ్ట్, వీసా, ఇంటెల్, క్వాల్‌కామ్, సీమెన్స్ హెల్తీనీర్స్, డీహెచ్‌ఎల్, నోకియా, హెచ్‌పీ, పెప్సికో, ఎమర్సన్, లెనోవో, జాన్సన్ కంట్రోల్స్, ఈటన్ వంటి బహుళజాతి సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. టెక్నాలజీ, సెమీకండక్టర్లు, లాజిస్టిక్స్, ఆరోగ్య సంరక్షణ, తయారీ, ఆర్థిక సేవలు వంటి రంగాల్లో ఇవి ఉన్నాయి. యుద్ధ తీవ్రత తగ్గాక కూడా, గల్ఫ్ ప్రాంతంలో భద్రతాపరమైన ఆందోళనలు త్వరగా తొలగిపోయే అవకాశం లేదని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ సంస్థలు గల్ఫ్ ప్రాంతంలో తమ విస్తరణ ప్రణాళికలను పునఃసమీక్షించుకునేలా చేయొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అక్కడ కొత్త పెట్టుబడులపై కంపెనీలు అప్రమత్తంగా వ్యవహరించే అవకాశాలున్నాయి. యుద్ధం దీర్ఘకాలం కొనసాగి, చమురు సరఫరాకు ఆటంకాలు ఏర్పడి, ధరలు పెరిగితే కనుక.. అంతర్జాతీయంగా వాణిజ్య సంస్థలు టెక్నాలజీ వ్యయాలను తగ్గించొచ్చు. అప్పుడు కొత్త జీసీసీల స్థాపనను కంపెనీలు తగ్గించొచ్చు. బహుళజాతి సంస్థలు అనిశ్చితికి దూరంగా ఉండాలనే భావిస్తాయి. అందువల్ల ఉద్రిక్తతల ముప్పు ఉన్న ప్రాంతాల్లో కార్యకలాపాలు తగ్గించుకుని, దానికి బదులుగా స్థిరత్వం అధికంగా ఉన్న మన దేశంలో జీసీసీల విస్తరణను వేగవంతం చేయొచ్చని భావిస్తున్నారు. గల్ఫ్ ఇంకా ముఖ్యమైన నియర్‌షోర్ బేస్‌గా మారలేదు, కానీ ఆ దిశగా వేగంగా వెళ్తోందని ఇంజినీరింగ్, ఐటీ, ఆర్ అండ్ డీ రంగాలను పర్యవేక్షించే ఈఐఆర్ ట్రెండ్ సీఈఓ పరీఖ్ జైన్ అన్నారు. యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్ వంటి దేశాలు తమ ఆర్థిక వ్యవస్థలను చమురు ఆధారితంగా కాకుండా.. ఫైనాన్స్, ఏఐ, టెక్నాలజీ, ట్రావెల్, తయారీ వంటి రంగాల్లో విస్తరించడానికి కృషి చేస్తున్నాయి. ప్రస్తుత ఉద్రిక్తతలు ఆ ప్రయత్నాలకు ఆటంకంగా మారొచ్చు. అంతర్జాతీయ అనిశ్చితుల కారణంగా మన దేశంలో నెలకొల్పాలనుకున్న జీసీసీ నిర్ణయాలూ ఆలస్యం కావొచ్చు. కంపెనీలు ముందుగా తక్షణ రిస్క్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టడమే ఇందుకు కారణం.

ప్రస్తుత పరిస్థితి ఇది

మన దేశంలో 1800కు పైగా జీసీసీలు ఉన్నాయి. ఇవి 19 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. 2023-24లో 63.6 బి.డాలర్ల (రూ.5.72 లక్షల కోట్ల) ఆదాయాన్ని సృష్టించాయి. 2030కి ఈ రంగం 110 బి.డాలర్ల (రూ.9.9 లక్షల కోట్ల) ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంది.

వృద్ధి అంచనాలు

అంతర్జాతీయ, భారత ఐటీ సేవల రంగ వృద్ధి 2026-27లో 2-3 శాతానికి నెమ్మదించొచ్చని ఆన్‌ఎర్త్‌ఇన్‌సైట్ సీఈఓ గౌరవ్ వాసు హెచ్చరించారు. ఇంతకు ముందు వృద్ధి అంచనాలు 4-5 శాతంగా ఉన్నాయి. రాబోయే 30-60 రోజులు అత్యంత కీలకమని టెక్ పాలసీ అనలిస్ట్ సుబిమల్ భట్టాచార్జి స్పష్టం చేశారు. అధిక రిస్క్ ఉన్న ప్రాంతాల్లో కంపెనీలు పెట్టుబడులను తగ్గించి.. భారత్‌వైపు మొగ్గుచూపొచ్చు. తద్వారా భారత జీసీసీ రంగం మరింత బలోపేతం కానుంది. ఉద్రిక్తతలు దీర్ఘకాలం కొనసాగితే మాత్రం కొత్త జీసీసీల ఏర్పాటే నిదానించొచ్చు.

# తెరవెనుక 'సుప్రీం' ముజ్తబా

### త్వరలోనే సుప్రీంలీడర్‌గా బాధ్యతలు చేపట్టనున్న ఖమేనీ కుమారుడు



**న్యూఢిల్లీ:**అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీఖమేనీ మరణించడంతో ఇరాన్ తదుపరి నాయకత్వంపై సందిగ్ధం నెలకొంది. ఇప్పుడా పాలనా పగ్గాలను ఖమేనీ కుమారుడు ముజ్తబా హుస్సేనీ ఖమేనీ కి అప్పగించినట్లు వార్తలు వెలువడుతున్నాయి. గతంలో ప్రభుత్వ పదవిని నిర్వహించిన అనుభవమేదీ లేని ముజ్తబా.. త్వరలోనే సుప్రీంలీడర్ గా బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.ఆయతుల్లా అలీ ఖమేనీ రెండో కుమారుడే ముజ్తబా. 1969లో ఇరాన్‌లోని మషాద్‌లో జన్మించారు. ముజ్తబా పదేళ్ల వయసులోనే ఇరాన్ రాజు మహమ్మద్ రెజా పహ్లవీకి వ్యతిరేకంగా 1979లో ఇస్లామిక్ విప్లవం జరిగింది. ఆ సమయంలో ఖమేనీ కుటుంబం రాజకీయంగా ఎదిగింది. ఆ తర్వాత వీరి కుటుంబం టెహ్రాన్‌లో స్థిరపడింది. కోమ్‌లోని సెమినరీస్‌లో మత విద్యను అభ్యసించిన ముజ్తబా క్లెరికల్ ర్యాంక్‌కు చేరుకున్నారు. కానీ, అత్యున్నత ర్యాంక్ అయిన ఆయతుల్లాను అందుకోలేకపోయారు. అయినా సుప్రీంలీడర్ కార్యాలయంలో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తిగా మారారు.1980ల్లో జరిగిన ఇరాన్-ఇరాక్ యుద్ధంలో ముజ్తబా పాల్గొన్నాడు. ఆ అనుభవమే ఇరాన్ సైన్యానికి ఆయనను దగ్గర చేసింది. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ)తో ఆయనకు బలమైన సంబంధాలు ఉన్నాయి. ముజ్తబాకు సుప్రీం పదవి దక్కడానికి ఇదీ ఓ కారణమై ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతుంటారు. సాధారణంగా సుప్రీంలీడర్ నియామకాన్ని చేపట్టేందుకు 88 మంది షియా మత పెద్దలతో కూడిన కమిటీ (అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్) ఉంటుంది. ఇందులో సభ్యులను ప్రత్యక్ష ప్రజా ఓటింగ్ ద్వారా ఎన్నుకుంటారు. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించడం మత సిద్ధాంతాలకు విరుద్ధమని ఈ కమిటీ భావిస్తుంది.

**ఇరాన్ 'అట్రిషన్ వార్'.. శత్రువు జేబులు ఖాళీ చేస్తుందిలా...**

ఈ క్రమంలోనే ప్రస్తుతం ముజ్తబా నియామకానికి ఈ కమిటీలోని కొందరు సుముఖంగా లేరని, కానీ ఐఆర్‌జీసీ ఒత్తిడితోనే ఆయనకు పగ్గాలు అప్పగించేందుకు నిర్ణయం తీసుకున్నారని సమాచారం. ముజ్తబా ఇప్పటివరకు ఇరాన్‌లో అధికారిక పదవులేవీ చేపట్టలేదు. బహిరంగ ప్రసంగాల్లోనూ అరుదుగా కన్పించేవారు. అయినా రాజకీయ నియామకాలు, పాలనాపరమైన నిర్ణయాల్లో తెర వెనుక కీలక పాత్ర పోషించినట్లు సమాచారం.

**ఆంక్షలు ఉన్నా సంపన్న సామ్రాజ్యం..**

ముజ్తబా ఖమేనీపై 2019లో అమెరికా ఆంక్షలు విధించింది. అయినా ఆయన ప్రపంచవ్యాప్తంగా సంపన్న సామ్రాజ్యాన్ని ఏర్పాటుచేయడమే గాక.. పశ్చిమ మార్కెట్లలో బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టినట్లు గతంలో పలు కథనాలు వెలువడ్డాయి. ముజ్తబా నికర సంపద ఎంతనే దానిపై స్పష్టత లేదు. కానీ, ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఆయనకు పెట్టుబడులు ఉన్నాయట. స్విస్ బ్యాంకు ఖాతాల్లో పెద్దఎత్తున డిపాజిట్లతో పాటు.. బ్రిటన్‌లో 138 మిలియన్ డాలర్ల విలువైన లగ్జరీ ప్రాపర్టీ ఆయన పేరు మీద ఉన్నట్లు సమాచారం.

**దాడుల్లో భార్య మృతి..?**

ఇరాన్ సంప్రదాయ వాద రాజకీయ నాయకుడు ఘోలమ్ అలీ కుమార్తె జహ్రాను ముజ్తబా 2004లో వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు. వీరి కుటుంబం గురించి బయటి ప్రపంచానికి పెద్దగా తెలియదు. అయితే, ఇటీవల ఇజ్రాయెల్-అమెరికా జరిపిన సంయుక్త దాడుల్లో ముజ్తబా భార్య మృతి చెందినట్లు తెలుస్తోంది. దీనిపై అధికారిక సమాచారం లేదు. ఈ దాడుల్లో ఆయతుల్లా అలీ ఖమేనీతో పాటు ఆయన భార్య, కుమార్తె, అల్లుడు, మనవడు కూడా మరణించినట్లు సమాచారం.

## వాట్సప్ చాట్‌ల ఆధారంగా విడాకులివ్వలేం

### : బాంబే హైకోర్టు

ముంబై(జనంసాక్షి):ఓ జంట విడాకుల కేసులో బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కేవలం వాట్సప్ చాట్‌ల ఆధారంగా చేసిన క్రూరత్వం ఆరోపణలు పరిగణనలోకి తీసుకుని విడాకులు మంజూరు చేయలేమని పేర్కొంది. ఈ క్రమంలోనే గతంలో ఫ్యామిలీ కోర్టు మంజూరు చేసిన విడాకుల ఉత్తర్వులను పక్కన పెట్టింది. ఈ కేసులో భార్యకు తన వాదనలను వినిపించేందుకు కింది కోర్టు అవకాశం ఇవ్వలేదని తెలిపింది.భార్య నుంచి విడాకులు కోరుతూ ఓ వ్యక్తి గతంలో నాసిక్ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించాడు. భార్యతో చేసిన వాట్సప్ చాట్‌ల వివరాలను సమర్పించాడు. అందులో కాపురాన్ని నాసిక్ నుంచి పుణెకు మార్చాలని ఆమె డిమాండ్ చేసిందని, అత్త, వదినలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిందని పేర్కొన్నాడు. ఈ ఆధారాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం.. వాట్సప్ చాటింగ్ ద్వారా ఆమె భర్తపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు యత్నించారని, ఎమోషనల్ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డారని, అసభ్యకరమైన భాషను ఉపయోగించారని తెలిపింది. ఈ నేపథ్యంలో క్రూరత్వం కింద అతడు విడాకులకు అర్హుడని తన ఉత్తర్వుల్లో పేర్కొంది.దీన్ని సవాల్ చేస్తూ ఆమె బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో తన వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వకుండా ఫ్యామిలీ కోర్టు ఏకపక్షంగా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ పిటిషన్ విచారించిన ఉన్నత న్యాయస్థానం.. ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేసింది. "భర్త సమర్పించిన సాక్ష్యాలను (వాట్సప్ చాట్‌లు) ఖండించేందుకుగానూ కుటుంబ న్యాయస్థానం ఆమెకు అవకాశం ఇవ్వలేదు. కేవలం వాట్సప్ చాట్‌లపై ఆధారపడి, విడాకులను మంజూరు చేయలేం. ఎందుకంటే ప్రధాన సాక్ష్యాల ద్వారా నిరూపితం కాలేదు" అని పేర్కొంది.

## ఏ సమయంలో నాకు ఏ స్థానం ఇవ్వాలన్నది అధిష్ఠానమే నిర్ణయిస్తుంది

లేదని.. కాలమే నిర్ణయిస్తుందని అన్నారు. పార్టీ కోసం తాను చేస్తున్న కృషి అందరికీ తెలుసన్నారు. ఏ సమయంలో తనకు ఏ స్థానం ఇవ్వాలనే విషయంపై పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సహా పార్టీ కేంద్ర నాయకత్వం కర్ణాటక సీఎం మార్పుపై చర్చలు జరిపినట్లు వస్తోన్న వార్తల గురించి తనకు ఎటువంటి సమాచారం లేదన్నారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై తానెప్పుడూ బహిరంగంగా ప్రకటనలు చేయలేదని శివకుమార్ అన్నారు. ఆ పదవి ఖాళీ అయినప్పుడే మరొకరికి అవకాశం వస్తుందన్నారు. కానీ అలా కావాలని తానెప్పుడూ కోరుకోలేదన్నారు. తాను ప్రజల కోసం పలు పోరాటాలు చేశానని.. కానీ పదవి కోసం ఎప్పుడూ పోరాడలేదని అన్నారు.

మాది పాలు-తేనె వంటి బంధం: సిద్ధరామయ్య

సీఎం స్థానం కోసం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు మధ్య విభేదాలు నెలకొన్నట్లు వస్తున్న వార్తలను సిద్ధరామయ్య కొట్టిపడేశారు. అవన్నీ ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ఆరోపణలని అన్నారు. డీకే శివకుమార్‌కు మద్దతుగా ఉన్న ఎమ్మెల్యేల ఫోన్లను తాను ట్యాపింగ్ చేయించినట్లు విపక్ష నేత ఆర్.అశోక్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలు-తేనె వంటి తమ బంధాన్ని ఎలాగైనా నాశనం చేయాలనే ఉద్దేశంతోనే వారు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు.

### జైల్లో నన్ను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు

మాట్లాడారు."జైల్లో నన్ను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. మంచినీరు ఇవ్వలేదు. భోజనం సరిగ్గా పెట్టలేదు. జ్వరం వచ్చినా.. సరైన వైద్యం అందించలేదు. జైలు నుంచి బయటకు రాకుండా అనేక కుట్రలు చేశారు" అని ఆరోపించారు.అంతకుముందు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదిలాబాద్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నిక సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ సహా బీఆర్ఎస్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులో జిల్లా సెషన్స్ కోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేయడంతో ఆయన బయటకొచ్చారు. బాల్క సుమన్‌తో పాటు రాజారెడ్డి, అనిల్, లక్ష్మీకాంత్ బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా క్యాతనపల్లి మున్సిపల్ ఆఫీసుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌ను ఎలా పంపించారని అడిగితే పోలీసులు తమపై లాఠీ చార్జి చేశారని పేర్కొన్నారు.

### యంగ్ ఇండియా స్కూల్స్ టెండర్లలో అవినీతి

స్కూల్స్‌లో ఎవరికి ఎక్కువ టెండర్లు ఇచ్చారో అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. పరిపాలనలో ముఖ్యమంత్రికి పట్టు రావడం లేదని.. మేము ప్రతిపక్షంగా సక్సెస్ అయ్యామని పేర్కొన్నారు. ఖమ్మంకు కేటీఆర్ వెళ్లారు.. ఇప్పుడు స్థలాలు ఇస్తాం.. ఇండ్లు కట్టిస్తాం అన్నారు. నేను శారదా పీఠం వెళ్లాను.. అది ఆపుతున్నాం అన్నారు. దేవాదుల ప్రాజెక్టు వెళ్లాం. వెంటనే ముఖ్యమంత్రి కూడా వెళ్లారు. హెల్త్ సిటీకి వెళ్లాం ప్రతి దానికి మేము వెళ్లాక స్పందిస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు. జర్నలిస్టుల హెల్త్ స్కీంను గాలికి వదిలేశారని.. మేము ఉన్నప్పుడు ప్రత్యేక జీవో ఇచ్చాం. ఉద్యోగులకు ఎలా ఉండేదో అలానే జర్నలిస్టులకు ఉండేదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి మేనల్లుడి మనుషులు నియో పోలీస్‌లో అక్రమ మైనింగ్ చేస్తున్నారు. మొబైల్ క్రషింగ్ ప్లాంట్‌కు మాత్రమే నిబంధనలుండగా ఫిక్స్ క్రషింగ్ ప్లాంట్ నియోపోలీస్‌లో పెట్టారు. ల్యాండ్ లీజుకు ఇస్తే 6 నుంచి 7 శాతం ఫీజు కట్టాలి. లెటర్‌లో పది ఎకరాలు ఇస్తే 15 ఎకరాల్లో మైనింగ్ జరుగుతోందని.. 15 లక్షల క్యూబిక్ మీటర్ల బండకు ఫీజు ఎగ్గొట్టారని హరీష్ రావు ఆరోపించారు. అక్కడ రెడీమిక్స్‌కు పర్మిషన్ లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి పరిపాలన రావడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు విమర్శించారు. ఐఏఎస్, ఐపీఎస్‌లను పదేపదే బదిలీ చేస్తున్నారని పేర్కొన్నారు. "రెండున్నరేళ్లలో ఐదుసార్లు భారీ ఎత్తున అధికారులను బదిలీ చేశారు. తరచూ బదిలీలతో పాలన కుంటుపడుతోంది. పరిస్థితులు అర్థం చేసుకునేలోపే అధికారులు బదిలీ అవుతున్నారన్నారు



## అమెరికా కన్నేస్తే.. ప్రపంచ నేతలూ తప్పించుకోలేరు..!

మదురో నిర్బంధం.. ఖమేనీ మృతి.. యావత్ ప్రపంచాన్ని ఉలికిపాటుకు గురిచేసిన ఘటనలివి. నిత్యం కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉండే నేతలను సైతం అమెరికా గురిపెట్టి తమ లక్ష్యాలను సాధించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అమెరికా కన్నేస్తే ప్రపంచ నేతలూ తప్పించుకోవడం కష్టమే అనే సందేశాన్నిస్తోంది. అగ్రరాజ్య శత్రువుల కదలికలను కనిపెట్టడంలో ఆ దేశ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఏఐ) వ్యవస్థ అత్యంత కీలకం.

ప్రచ్ఛన్న యుద్ధం నాటినుంచే..

ప్రపంచ స్థాయి నేతలపై అమెరికా (జూం) నిఘా పెట్టడం ప్రచ్ఛన్న యుద్ధం నాటి నుంచే ఉంది. ఆయా నేతల కదలికలు, సంభాషణలను యూఎస్ నిఘా సంస్థలు గుర్తిస్తున్నాయని గతంలో అనేకసార్లు కథనాలు వచ్చాయి. చైనా నాయకులు, ఆ దేశ అణ్వాయుధ కార్యక్రమాలను ట్రాక్ చేసేందుకు అమెరికా ప్రయత్నించిందని 14 ఏళ్ల క్రితం వికీలీక్స్ సంచలన పత్రాలు విడుదల చేసింది. జర్మనీ మాజీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ కూడా ఈ నిఘా బారిన పడ్డవారే. తన వ్యక్తిగత సెల్‌ఫోన్‌ను తమ మిత్ర దేశమే ట్యాప్ చేసిందని మెర్కెల్ గతంలో వెల్లడించారు. దీనిపై నాటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామాకు ఫిర్యాదు కూడా చేసినట్లు వార్తలు వచ్చాయి.

మదురో నివాసం నమూనాతో..

ఈ ఏడాది జనవరిలో వెనెజువెలా నేత మదురోను నిర్బంధించడంలో కూడా సీఐఏ ప్రధాన పాత్ర పోషించింది. గతేడాది ఆగస్టులోనే ఈ ఏజెన్సీ బృందం వెనెజువెలా వెళ్లి కారకాస్ చుట్టుపక్కల మదురో కదలికలపై నిఘా వేసింది. సన్నిహిత వ్యక్తుల నుంచి సమాచారం సేకరించింది. మదురో తిరిగే ప్రదేశాలపై స్పష్టమైన మ్యాప్ తయారుచేసింది. ఆయన ఇంటి నమూనాను కెంటకీలో సృష్టించి తలుపులు ఎలా బద్దలు కొట్టాలన్న దానిపై అమెరికా దళాలు సాధన చేశాయి. ఇలా పక్కా ప్రణాళికతో ఆపరేషన్ నిర్వహించి మదురోను బంధించి అగ్రరాజ్యానికి తీసుకురాగలిగింది.

ఎలక్ట్రానిక్ సెన్సర్లతో..

ఈ మధ్య సాంకేతికతను ఎక్కువగా వినియోగించుకుని వీఐపీల కదలికలపై అమెరికా నిఘా పెడుతున్నట్లు సమాచారం. వీధులు, డోర్‌బెల్ కెమెరాలు, టోల్ హైవేలపై ఎలక్ట్రానిక్ సెన్సర్ల వినియోగం పెరుగుతోంది. ఈ సెన్సర్లను హ్యాక్ చేసి కృత్రిమ మేధ సాయంతో బిలియన్ల కొద్దీ డేటాను సేకరించే వీలవుతుంది. తద్వారా ప్రముఖుల కదలికలను ఇట్టే పసిగట్టొచ్చని నిపుణులు చెబుతున్నారు. అత్యంత కట్టుదిట్టమైన ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్ డోర్లను ఎలా తెరవాలి.. విదేశీ నేతల బాడీగార్డులు, కుటుంబసభ్యుల వ్యక్తిగత సెల్‌ఫోన్ల లొకేషన్లను ఎలా గుర్తించాలి అన్న వాటిపై ప్రపంచవ్యాప్తంగా స్పై ఏజెన్సీలకు శిక్షణ ఉంటుంది.

నాడే ఖమేనీకి ట్రంప్ వార్నింగ్..

ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ కూడా ఎప్పటినుంచో సీఐఏ రాడార్‌లో ఉన్నారు. ఆ విషయాన్ని దాదాపు ఎనిమిది నెలల కిందటే గతేడాది జూన్‌లో ట్రంప్ స్వయంగా వెల్లడించారు. "ఇరాన్ గగనతలం పూర్తిగా మా నియంత్రణలో ఉంది. సుప్రీం లీడర్ దాక్కొన్న కచ్చితమైన లొకేషన్ మాకు తెలుసు. అతడు మాకు సులువైన టార్గెట్. కానీ, ప్రస్తుతానికి చంపాలనుకోవడం లేదు. లొంగిపోయే అవకాశం ఇస్తున్నాం" అని నాడు ట్రంప్ పోస్ట్ చేశారు. అయితే, ఈ హెచ్చరికలను ఇరాన్ గానీ, ఖమేనీ గానీ పట్టించుకోనట్లు తెలుస్తోంది. మరోవైపు, టెహ్రాన్‌లోని ట్రాఫిక్ కెమెరాలు, ఫోన్ నెట్‌వర్క్‌ను ట్రాక్ చేసి ఖమేనీ కదలికలపై అగ్రరాజ్యం నిఘా పెట్టింది. ఈ క్రమంలోనే ఫిబ్రవరి 28న ఖమేనీ తన అధికారిక నివాసంలో సమావేశంలో ఉండగా అమెరికా ఇచ్చిన నిఘా సమాచారంతో ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. ఈ



# సారంగాపూర్‌లో అక్రమ మట్టి దందా

## ఇందిరమ్మ ఇండ్ల పేరిట గుట్టలు కోసేస్తున్నారు

- అక్రమ రవాణా జరుగుతున్న పట్టించుకొని అధికారులు
- యదేచ్ఛగా జెసిబీలు, ట్రాక్టర్లుతో పండుగలు, సెలవుల్లో మట్టి తరలింపు


**జగిత్యాల క్రైం, మార్చి 4 (జనంసాక్షి) :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం ఆర్‌పల్లి గ్రామంలో స్మశానవాటిక సమీపంలోని గుట్టను అక్రమంగా తవ్వి మట్టి రవాణా దందా జోరుగా సాగుతోంది. పలు అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పేరిట అధికారుల అనుమతితోనే ఈ అక్రమాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సెలవు దినాలు, పండుగల సమయంలో రాత్రికి రాత్రి జెసిబీల సాయంతో మట్టిని ట్రాక్టర్లలో నింపి, నెంబర్ ప్లేట్లు లేని వాహనాలతో స్పీడుగా రోడ్లపై తరలిస్తున్నారు.

ఈ గుట్ట అడుగుభాగం నుంచి పైభాగం వరకు యదేచ్ఛగా తవ్వి మట్టి రవాణా చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి అనుమతితో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కోసమే అని కొందరు వాదిస్తున్నా.. గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్తే పాత కార్యదర్శి బదిలీ అయిపోయారని, కొత్తవారు ఇంకా బాధ్యతలు చేపట్టలేదని గ్రామస్తులు చెబుతున్నారు. అధికారుల లేని ఈ బలహీనతను అక్రమ రవాణాదారులు బాగా ఉపయోగించుకుని, ధనార్జన ధ్యేయంగా జేబులు నింపుకుంటున్నారు. మంగళవారం మధ్యాహ్నం సుమారు 11 గంటల సమయంలో జనం సాక్షి ప్రతినిధి క్షేత్రస్థాయిలో పర్యటించగా.. ట్రాక్టర్లు మట్టి నింపుకొని రవాణా చేస్తుండటం కనిపించింది. వెంటనే ఆధారాలతో మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, మండల తహసీల్దార్ మహమ్మద్ వహీదుద్దీన్‌ను సంప్రదించగా.. తహసీల్దార్ గిర్దవార్ వెంటనే స్పందించారు. జిపిఓలను క్షేత్రస్థాయిలో పర్యటించి, అనుమతి లేని వాహనాలను పట్టుకోవాలని ఆదేశించారు. అధికారులు స్థలానికి చేరుకునే సమయానికి అక్రమ రవాణాదారులు గుట్టుచప్పుడు కాకుండా పారిపోయారు. గుర్తుతెలియని వ్యక్తుల సమాచారం మేరకు అధికారులు వెళ్లడంతోనే ఈ 'ఆకాశరామన్న' కొసమెరుపు జరిగింది. ఈ గుట్ట రెవెన్యూ భూమా? ఫారెస్ట్ భూమా? అనేది కూడా ఇంకా నిర్ధారణ కాలేదు. సంబంధిత అధికారులే క్షేత్రస్థాయిలో లేకపోవడం వల్లే ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు.

ఈ అక్రమ మట్టి తరలింపు వల్ల వృక్షాలు, వన్యప్రాణులు, మూగజీవాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, హాలిడేల్లో జాలిడేగా రవాణా చేస్తున్నారు. వాల్టా చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ 'కంచి చేస్తే కాపాడేది ఎవరు' అన్నట్లుగా అధికారుల తీరు విమర్శలకు తావునిస్తోంది. పలువురు ప్రజాప్రతినిధులు ఐక్యంగా ఉండి, అభివృద్ధి పనులు, నూతన ఇండ్ల నిర్మాణాల పేరిట ఈ అక్రమాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రజాప్రతినిధులు 'ఆడిందే ఆట పాడిందే పాట'గా మారడంతో సంబంధిత అధికారులు తమ విధులను పూర్తిస్థాయిలో నిర్వహించలేకపోతున్నారు. అధికారం ప్రజాప్రతినిధుల చుట్టమా? అన్న సందేహాలు ప్రజల్లో బలంగా ఉన్నాయి. నిర్మాణ ప్రదేశంలో 'ష్.. గప్ చప్' అన్నట్లుగా ఎవరూ లేకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. తహసీల్దార్ మహమ్మద్ వహీదుద్దీన్‌ను వివరణ కోరగా.. సిబ్బంది వెళ్లే సమయానికి జెసిబీ, ట్రాక్టర్ యజమానులు వాహనాలను తరలించినట్లు తెలిపారు. తదుపరి రోజు పూర్తిస్థాయిలో పర్యటించి రెవెన్యూ అధికారులను ఆదేశిస్తామని చెప్పారు. అయితే ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, ప్రజాప్రతినిధుల చుట్టూ అధికారం తిరుగుతుందా? అన్న సందేహాలు నివృత్తి కావా? వేచి చూడాల్సిందే. ఈ అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# వివిఎన్‌ఆర్,విజేఐఈటి కాలేజీ గుర్తింపు రద్దు చేయాలి

- చైర్మన్ సురేష్ బాబుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి
- విద్యా సంస్థలలో విద్యార్థినిలకు రక్షణ కల్పించాలి
- మహిళ కమిషన్‌కు ఫిర్యాదు
- ఓయూ జేఏసి నేతలు ఆర్.ఎన్ శంకర్,గడ్డం శ్యామ్



**హైదరాబాద్, మార్చి 4 (జనంసాక్షి) :** వివిఎన్‌ఆర్, విజేఐఈటి కాలేజీ గుర్తింపు రద్దు చేయాలని, అదే విధంగా సంస్థ చైర్మన్ సురేష్ బాబుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఓయూ జేఏసి నేతలు ఆర్.ఎన్ శంకర్, గడ్డం శ్యామ్ పేర్కొన్నారు. వివిఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజనీరింగ్ కాలేజ్ లో చదువుతున్న మహిళ విద్యార్థినిపై అదే కాలేజ్ లో చదువుతున్న యువకులు మత్తు చాకెట్లు ఇచ్చి బలవంతంగా లైంగిక దాడి పాల్పడ ఘటనపై చైర్మన్ సురేష్ బాబుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని బుదవారం మహిళ కమిషన్ కు పిర్యాదు చేశారు. అనంతరం వారు మహిళా కమిషన్ కార్యాలయం వద్ద మాట్లాడుతూ నగరంలో ప్రఖ్యాతి గాంచిన కళాశాలగా ప్రచారం చేసుకుంటూ కోట్లాది రూపాయలు సంపాదిస్తూ మహిళల సంక్షేమాన్ని గాలికి వదిలేసిన వివిఎన్‌ఆర్ విజ్ఞాన ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ దగ్గుపాటి సురేష్ నాయుడు, ప్రిన్సిపాల్ చెన్నకేశవరావు, సిడి నాయుడులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అక్టోబర్ 2024 కళాశాలలోని డి.బ్లాక్ రూమ్ నెంబర్ 33లో బాధిత అమ్మాయికి మత్తు చాకెట్లు ఇచ్చి యువకులు బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. ఇదే విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్,డీన్ లకు అమ్మాయి పలుమార్లు పిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా ఆ బాధిత మహిళ ఆత్మహత్యయత్నం చేసిందని పేర్కొన్నారు. కళాశాల యజమాన్యం తమకున్న ఆర్థిక రాజకీయ పలుకుబడితో తమ నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని వారి నిర్లక్ష్య కారణంగానే 18 నెలలుగా బాధిత విద్యార్థి నరకయాతన అనుభవించిందని కనుక కళాశాల యాజమాన్యంపై ఎఫ్ఐఆర్లో నమోదు చేసి చట్టబద్ధంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనియెడల కళాశాల ముందు ప్రత్యక్ష పోరాటం నిర్వహిస్తారని తెలియజేశారు. దాదాపు 3,000 మంది విద్యార్థులు చదువుతున్న కళాశాలలో విద్యార్థినిలకు రక్షణకు యజమాన్యం ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడం సమాజంలో మహిళలను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర దాగుందని ఆరోపించారు.

# 3 నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ



**ముస్తాబాద్ మార్చి 4 (జనం సాక్షి) :** రేషన్ కార్డు లబ్ధిదారుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే వేసవి కాలం దృష్ట్యా ఒకేసారి మూడు నెలల సరిపడా రేషన్ బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఏప్రిల్, మే, జూన్ ఈ మూడు నెలలకు సంబంధించిన బియ్యం ఏప్రిల్ నెలలోనే పంపిణీ జరిగేలా చూడాలని రాష్ట్రాలకు కేంద్ర పౌర సరఫరాల శాఖ లేఖలు రాసింది. మార్చి మొదటి వారంలోనేఎండలుమండిపోతున్నాయి. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు భారీగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో రాబోయే ఎండలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తీసుకుంది. సన్నబియ్యం నిల్వల సామర్థ్యంపై ఆందోళన దేశవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్రంలోనే రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. ఒక్కో లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల చొప్పున సన్నబియ్యం తెలంగాణ ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ఫుడ్ సెక్యూరిటీ కార్డుల సంఖ్య పెరిగింది. దాదాపు కోటికి పైగా కార్డులు ఉన్నాయి. ఒకేసారి మూడు నెలలకు సరిపడ కోటా ఇవ్వాలని కేంద్రం సూచించడంతో ఆ మేరకు సరిపడా బియ్యం కోటా నిలువలు, సాధ్యాసాధ్యాలను తెలంగాణ ప్రభుత్వం పరిశీలిస్తోంది. (సమస్యలు) ఒకేసారి మూడు నెలల కోటా పంపిణీ చేయాలని కేంద్రం యోచిస్తుండగా గత అనుభవాల దృష్ట్యా అనేక సమస్యలు సైతం ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. గతేడాది వర్షాకాలంలో ఒకే దఫా మూడు నెలల కోటాను పంపిణీ చేశారు. ఆ సమయంలో ఇటు లబ్ధిదారులు, రేషన్ డీలర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మూడు నెలల బియ్యం కోటా ఒకేసారి పంపిణీ చేయడం ద్వారా రవాణా ఛార్జీల ఖర్చు తగ్గనుండటంతోపాటు.. డీలర్లు, హమాలీ కూలీ కలిసొచ్చే అవకాశముంది. కానీ ఆ బియ్యం నిల్వ చేసే సామర్థ్యం లేకపోవడంతో అది డీలర్లకు సమస్యగా మారింది. ఇక మూడు నెలలకు సంబంధించి మూడు ఒక్కో కార్డుదారుడు 3 సార్లు వేలి ముద్ర (థంబ్) వేయాల్సి ఉంది. దీనికి తోడు సర్వర్ సమస్యలతో ఒక్కో కార్డుకు దాదాపు 15-20 నిమిషాల సమయం పట్టే అవకాశం ఉంది. ఈ సమస్యలను అధికారులు పరిష్కరించాల్సి ఉంది.

## జగిత్యాల కలెక్టరేట్‌లో
# పరిశుభ్రత ఎక్కడ?

**సౌచాలయాల్లో పరిశుభ్రత లేదు.. దుర్గంధం.. నీరు లేదు.. కుక్కల భయం**

- అర్జీదారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు
- నీరు రాకపోవడం, దుర్గంధంతో మానసిక ఇబ్బంది
- మెట్ల సమీపంలో కుక్కలు.. కాటు ప్రమాదాలు పెరిగాయి





**జగిత్యాల, మార్చి 4 (జనంసాక్షి) :** జగిత్యాల జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో సౌచాలయాల పరిశుభ్రత పూర్తిగా లోప భూయిష్టంగా ఉండటంతో అర్జీదారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు, ఉద్యోగులు సౌచాలయాలను వినియోగించుకునే సమయంలో అపరిశుభ్రత, దుర్గంధం, నీటి లభ్యత లేకపోవడం వంటి సమస్యలతో మానసికంగా కుంగిపోతున్నారు. సౌచాలయాల్లో నీరు రావడం లేదు. హ్యాండ్ వాష్, బేసిన్‌లలో నీళ్లు నిలిచి అపరిశుభ్రంగా ఉండటంతో దోమలు, ఇతర కీటకాలు వ్యాప్తి చెందుతున్నాయి. దుర్గంధం వెదజల్లడంతో సౌచాలయాల్లోకి వెళ్లడమే భయంగా మారింది. మెట్ల సమీపంలో కుక్కలు దాగి ఉండటంతో పలువురు కుక్కకాటు బాధితులు అవుతున్నారు. ఇటీవల కుక్కకాటు ప్రమాదాలు పెరగడంతో ప్రజల్లో భయాందోళన నెలకొంది.

కలెక్టరేట్‌లో అన్ని రకాల ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నప్పటికీ సౌచాలయాల పరిశుభ్రతపై పట్టింపు లేకపోవడం పలువురిని ఆశ్చర్యపరుస్తోంది. అర్జీదారులు, సామాన్య ప్రజలు బహిరంగంగానే ఈ అంశంపై చర్చించుకుంటున్నారు. సమీకృత కలెక్టరేట్‌లో పరిశుభ్రత, మౌలిక సదుపాయాలపై ఉన్నత అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని, సౌచాలయాల్లో నీటి సరఫరా, శుభ్రత, సురక్షిత వాతావరణం కల్పించాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కుక్కల బెడద తగ్గించి, సౌచాలయాలను ప్రతిరోజూ శుభ్రం చేసి, మెయింటెనెన్స్ చేయాలని ప్రజలు కోరుతున్నారు. లేకపోతే ప్రభుత్వ కార్యాలయాల్లోనే పరిశుభ్రత లేకపోవడం ఎంత విడ్డూరంగా ఉందో ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## పోస్టాఫీసులో పోస్టల్ ఇన్స్పెక్టర్ల విచారణ

**రామగిరి :** సెంటినరీ కాలనీ పోస్టాఫీసులో బుదవారం పోస్టల్ ఇన్స్పెక్టర్లు విచారణ జరిపారు. గతంలో బేగంపేట, సెంటినరీ కాలనీ పోస్టాఫీసు లో డిపాజిట్లు, ప్రతి నెల పొదుపు డబ్బులు కిసాన్ వికాస్ పత్రం (కెవిపి), సుకన్య పథకం కింద డబ్బులు జమా కాలేదు. దీనిపై అప్పట్లో దుమారం లేచింది. సెంటినరీ కాలనీ-బేగంపేట కలుపుకొని సుమారు రూ. కోటి అవినీతి జరిగింది. అప్పటి నుండి విచారణ కొనసాగుతుంది.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక.. 99 రోజుల్లో పకడ్బందీగా అమలు చేయాలి

**పాఠశాలలు, వసతి గృహాలపై నిరంతర పర్యవేక్షణ**

**10 థీమ్‌లతో 5 దశల్లో కార్యాచరణ : కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

**మార్చి 6 నుంచి జూన్ 12 వరకు విస్తృత కార్యక్రమాలు**



**జగిత్యాల, మార్చి 4 (జనంసాక్షి) :** జిల్లాలో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు అమలు చేయనున్న 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కింద 99 రోజుల యాక్షన్ ప్లాన్‌ను శాఖలవారీగా పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ మేరకు సూచనలు చేశారు. ప్రణాళికకు ప్రణాళిక శాఖ నోడల్ శాఖగా వ్యవహరిస్తుందని తెలిపిన కలెక్టర్.. 10 థీమ్‌లతో 5 దశల్లో కార్యక్రమాలు అమలు చేయాలని స్పష్టం చేశారు. దశలవారీ వివరాలు ఇలా ఉన్నాయి:

మార్చి 6: అన్ని ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు

ఏప్రిల్ 2: గ్రామ స్థాయి గ్రామసభలు

మే 2: మండల స్థాయి కార్యక్రమాలు

మే 22: నియోజకవర్గ స్థాయి కార్యక్రమాలు

జూన్ 2: జిల్లా స్థాయి కార్యక్రమాలు

జూన్ 2: రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా రాష్ట్ర స్థాయి కార్యక్రమం 99 రోజుల్లో శాఖలవారీగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

**థీమ్‌ల వారీగా కార్యక్రమాలు:**

- మార్చి 6--15: పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ డ్రైవ్, తడి-పొడి చెత్త వేరు సేకరణ, చెత్త నిర్మూలన, పిచ్చి మొక్కల తొలగింపు
- మార్చి 16-21: ఆరోగ్యం - ఆరోగ్య శిబిరాలు, గర్భిణీలు, చిన్నారుల పర్యవేక్షణ, పోషకాహార అవగాహన
- ఏప్రిల్ 13-18: అరైవ్-అలైవ్ - రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాల అమలు, హెల్మెట్-సీట్‌బెల్ట్ తనిఖీలు
- ఏప్రిల్ 20-25: సంక్షేమం - ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ పథకాల అమలు సమీక్ష
- ఏప్రిల్ 27-మే 2: పిల్లల భద్రత - డ్రగ్స్‌కు అడ్డుకట్ట, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన
- మే 4-9: రైతు సంక్షేమం - వ్యవసాయం, సాగునీరు, ఎరువులు, విత్తనాల సరఫరా, నిరంతర విద్యుత్
- మే 11-16: విద్య - పాఠశాలల మౌలిక వసతులు, పరిశుభ్రత, హాజరు, బోధన నాణ్యత సమీక్ష
- మే 18-23: యువత, క్రీడలు - క్రీడా పోటీలు, యువజనోత్సవాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు
- మే 25-30: మహిళలు - స్వయం సహాయక సంఘాల బలోపేతం, రుణాల సద్వినియోగం
- జూన్ 1-12: పర్యావరణం - వృక్షారోపణ, ప్లాస్టిక్ నియంత్రణ, పచ్చదనం పెంపు

పరిశుభ్రత కార్యక్రమాలను మార్చి 6 నుంచి 16 వరకు విస్తృతంగా నిర్వహించాలని, అంగన్‌వాడీలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, రహదారుల వెంట చెత్త నిర్మూలన చేపట్టాలని సూచించారు. మున్సిపాలిటీల్లో 100 శాతం పన్ను వసూళ్ల లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మహిళా సంఘాల రుణాల పంపిణీ, వసూళ్లు పూర్తి చేయాలని, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని కోరారు. మండల స్థాయి అధికారులు పాఠశాలలు, వసతి గృహాలను నిరంతరం పర్యవేక్షించి భోజన నాణ్యత, పారిశుద్ధ్య పరిస్థితులను ప్రతిరోజూ తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ పామ్ సాగు సబ్సిడీపై అవగాహన సదస్సులు, డెమాన్‌స్ట్రేషన్లు, వీ×ఐ౦ పథకం కింద సబ్సిడీలు, కూరగాయల మినీ కిట్స్ పంపిణీ, మైక్రో ఇరిగేషన్ పథకం ప్రచారం చేపట్టనున్నారు. పట్టు పరిశ్రమ శాఖ సబ్సిడీలపై రైతులకు అవగాహన కల్పిస్తుంది.ప్రతిరోజు నిర్వహించిన కార్యక్రమాలపై శాఖలవారీగా సమగ్ర రోజువారీ ప్రగతి నివేదికలు సమర్పించాలని, అమలుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ, డీఎఫ్ఓ, ఏసీ ఎల్బీ, సబ్ కలెక్టర్, ఏసీ రెవెన్యూ, డీపీఓ, డీఆర్‌డీఓ, సీఈఓ జెడ్పీ, డీఎంహెచ్ఓ తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారిణి కామారెడ్డి వివరాలు అందించారు.

# గణితంతో అద్భుతాలు సృష్టించవచ్చు

**చింతన్ మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల అద్భుత విజయాలు**

**జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన డి. సాత్విక్**

**రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రథమ స్థానాలు..అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి.నరేందర్‌రెడ్డి**




**కరీంనగర్ బ్యూరో మార్చి 4 (జనంసాక్షి) :** గణిత శాస్త్రంతో అద్భుతాలు సృష్టించవచ్చని సమాజంలో అగ్రగామిగా ఉండవచ్చని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ లో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థులు ప్రతిష్టాత్మక చింతన మ్యాథ్స్ ఒలంపియాడ్ జాతీయ స్థాయి పోటీలలో అత్యుత్తమ ఫలితాలు సాధించడం పట్ల ఏర్పాటు చేసిన సభకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు గణిత శాస్త్రంలో పట్టు సాధించే విధంగా ప్రోత్సాహం అందించాలని గణిత శాస్త్రంలో వివిధ రకాల పోటీ పరీక్షలు నిర్వహించి ప్రతిభను వెలికితీయాలని వారు చెప్పారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు వివిధ రకాలు ఒలంపియాడ్ నిర్వహిస్తామని, అత్యుత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను వివిధ స్థాయిలలో నిర్వహింపబడినటువంటి వివిధ రకాల పోటీలకు ఎంపిక చేసి అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని వారు చెప్పారు. ఇటీవల కాలంలో ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ అయినా చింతన ఒలంపియాడ్ ఫౌండేషన్ వారు నిర్వహించినటువంటి మాథ్స్ ఒలంపియాడ్ పరీక్షలో పాఠశాల చెందినటువంటి అత్యుత్తమ ప్రదర్శన మ విద్యార్థులకు సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. డి.సాత్విక్, 7వ తరగతి జాతీయ స్థాయి మొదటి ర్యాంకు, ఏ.రీతిక, 6వతరగతి, జి. సహాన్స్, రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకు కె.అతిథి కిషన్, 4వ తరగతి, ఏ.సాయి చందన, 5వ తరగతి , ఏం.శ్రేయాన్ కార్తీక్ 9వ తరగతి - జిల్లా స్థాయి ప్రథమ ర్యాంకు, అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు పుష్పగుచ్చాలను అందజేసి భవిష్యత్తులోనూ మరిన్ని అద్భుత విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చింతకుంట ప్రజల చిరకాల చింత..
# కలగానే మిగిలిపోనుందా?

- 17 ఏళ్లుగా శిథిలావస్థలో వంతెన నిర్మాణం
- పిల్లర్లు కూలిపోతున్నాయి.. ప్రజలు బిక్కికోనం
- వరదల్లో పొలాలు, పశువులు కొట్టుకుపోతున్నాయి
- రవాణా కష్టాలు తీర్చండి.. ప్రభుత్వం చొరవ చూపాలి



**ధారూర్, మార్చి 4 (జనంసాక్షి) :** ప్రభుత్వాలు మారాయి.. పాలకులు మారారు.. కానీ చింతకుంట ప్రజల రవాణా చింత మాత్రం తీరలేదు. సుమారు 17 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసిన వంతెన నిర్మాణం నేటికీ పూర్తికాలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్న చందంగా పనులు శిథిలావస్థకు చేరాయి. మండల పరిధిలోని చింతకుంట, ధారూర్ గ్రామాల మధ్య కాగ్నా ఉపనదిపై నిర్మాణానికి 2009 ఫిబ్రవరి 2న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. 2010లోపు పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఐదు పిల్లర్లు నిర్మించి వదిలేశారు.

ధారూర్ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి చింతకుంట వరకు బీటీ రోడ్డు పూర్తయినా.. వంతెన మాత్రం కలగానే మిగిలిపోయింది. పిల్లర్లు శిథిలావస్థకు చేరి, ఇప్పుడు దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రానికి రావాలంటే చుట్టూ తిరగాల్సి వస్తోందని చింతకుంట, మైలారం, కొత్తతండా ప్రజలు వాపోతున్నారు. 3 కిలోమీటర్ల దూరానికి బదులు 6 కిలోమీటర్లు చుట్టూ తిరిగి హరిదాస్‌పల్లి మీదుగా ధారూర్‌కు వెళ్లాల్సి వస్తోంది. కొత్తతండా నుంచి ధారూర్‌కు 10 కిలోమీటర్లు పడుతుందని గిరిజనులు చెబుతున్నారు. వంతెన పూర్తయితే కేవలం 3 కిలోమీటర్లలో మండల కేంద్రానికి చేరుకోవచ్చని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

**రవాణా కష్టాలు తీర్చండి**

వర్షాకాలంలో కాగ్నా ఉపనది పొంగుతుంది. ఇరువైపులా పొలాలున్న ధారూర్, చింతకుంట, స్టేషన్ ధారూర్ గ్రామాల రైతులు భయాందోళనతో గడుపుతున్నారు. వాగు దాటాల్సి వస్తుంది. పశువులు, మేకలు నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్నాయి. పలువురు కాపరులు, రైతులు మృత్యువాత పడిన సంఘటనలు సాగు పనుల్లో జరిగాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణానికి ప్రభుత్వం చొరవ చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిధులు ఎంత అవసరమో రీఎస్టిమేట్ చేసి మంజూరు చేయాలని కోరుతున్నారు. నాడు కాంగ్రెస్ హయాంలో శంకుస్థాపన జరిగింది. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చొరవ తీసుకొని వంతెన పూర్తి చేయించాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.



ప్రభాకర్ యువ నాయకులు చింతకుంట.

## పోలీస్ కమిషనరేట్‌లో సైబర్ జాగృతి కార్యక్రమాలు

**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌ల పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాల నివారణ కోసం సైబర్ జాగృతి దివస్ సందర్భంగా మార్చి నెల మొదటి బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడినవి. డిజిటల్ యుగంలో వేగంగా పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజల్లో అప్రమత్తత పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పోలీసు అధికారులు తెలిపారు.సైబర్ మోసాలు, ఫిషింగ్ కాల్స్,ఓటీపీ పంచుకోవడం వల్ల కలిగే ప్రమాదాలు, నకిలీ లింకులు, సోషల్ మీడియా మోసాల గురించి పాల్గొన్న వారికి సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ, తెలియని నంబర్ల నుండి వచ్చే కాల్స్, అనుమానాస్పద లింకులు, ఆకర్షణీయమైన ఆన్‌లైన్ ఆఫర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ తెలియజేయరాదని స్పష్టం చేశారు.సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.




# అక్కడ బాంబులు ఇక్కడ బెంబేలు

## ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంతో గల్ఫ్‌లో భయం..భయం

- బిక్కుబిక్కుమంటున్న గల్ఫ్ వలసదారుల కుటుంబాలు
- గల్ఫ్‌లో అత్యధికులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వారే
- సోషల్ మీడియా వదంతులు.. ఫోన్లలో క్షేమ సమాచారం
- కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి/ రుద్రంగి (జనంసాక్షి) :** ఇరాన్,అమెరికా–ఇజ్రాయెల్ రెండు దేశాల యుద్ధం వలన అక్కడ బాబుల మోతతో ఇక్కడి ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఇందుకు కారణం ఉమ్మడి జిల్లా నుంచి అనేక మంది జీవనోపాధి వెతుక్కుంటూ గల్ఫ్ వెళ్లిన వారు అధికంగా ఉన్నారు. దీంతో గల్ఫ్ వలస జీవుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతానికి అక్కడ తాము క్షేమంగా ఉన్నామని వదంతులు నమ్మొద్దని చెపుతున్నారు. అయినప్పటికీ యుద్ధం రోజు రోజుకు పెరుగుతుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అని ఇక్కడ వారి కుటుంబ సభ్యులు భయపడుతున్నారు. అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇరాన్ కూడా మిడిల్ ఈస్ట్‌లోని అమెరికా సైనిక స్థావరాల పై ప్రతి దాడులు కొనసాగిస్తుంది. సోషల్ మీడియాల్లో, టీవీ ఛానల్ పత్రికల్లో వస్తున్న వార్తలతో ఎప్పుడు ఎలాంటి సంఘటన జరుగుతోందోనని, ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుందో తెలియక బయపడుతున్నారు.

**ఉమ్మడి జిల్లా నుంచి అధికం..**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ, రుద్రంగి, జగిత్యాల మెట్పల్లి తదితర ప్రాంతాల నుంచి గల్ఫ్ బాట పట్టిన వారి సంఖ్య అధికంగా ఉంటుంది.ఇక్కడ సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఏళ్ల క్రితం నుంచి గల్ఫ్‌కు ఉపాధి కోసం వెళ్తున్నవారు నేటికి ఉన్నారు.అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ జరుగుతున్న దాడులతో కార్మికులు రోడ్లపైకి వచ్చి ఉండటం,గదిలోనే ఉండటం వంటివి చేస్తున్నారు. క్యాంపులకు సమీపంలోని అమెరికా స్థావరాలపై దాడులు జరిగినట్లు కొంతమంది తెలిపారు. ఎలాంటి భయం లేనప్పటికీ దాడులతో కొంత ఆందోళన నెలకొందని పేర్కొంటున్నారు. రోజువారి డ్యూటీలకు వెళుతున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మవద్దని పేర్కొంటూ క్షేమ సమాచారాన్ని తమ కుటుంబ సభ్యులకూ ఎప్పటికప్పుడు ఫోన్లలో మాట్లాడుతూ చేరవేస్తున్నారు

**దాడులతో ప్రాణ నష్టం..**

ఇరాన్ ను నాశనం చేస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాలైన సౌదీ అరేబియా, అబుదాబి, యూఏఈ, బెహరాన్, ఖతర్, జోర్డాన్, కువైట్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ ప్రతి దాడులకు పాల్పడుతుంది. ఆయా దేశాల్లో విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

**కంట్రోల్ రూమ్ ఏర్పాటు.**

గల్ఫ్‌లోని భారతీయుల కోసం భారత ప్రభుత్వం ప్రత్యేక కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసింది.వారి క్షేమ సమాచారాన్ని ఏప్పటికప్పుడు ఆరా తీస్తూ తగిన సూచనలు చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వ ఎప్పటికప్పుడు మాట్లాడుతూ గల్ఫ్ లోని తెలుగు వారి క్షేమ సమాచారంపై ఆరా తీస్తుంది.ప్రస్తుతం పశ్చిమ ఆసియా మరియు గల్ఫ్ ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో (మినిస్టరీ ఎక్స్టర్నల్ అఫైర్స్) ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది.

**రుద్రంగి మాజీ జెడ్పిటిసి గట్ల మీనయ్య.**



దుబాయ్‌లో మా మేనల్లుడు మాడిశెట్టి ప్రదీప్ అక్కడ ఆఫీసులో డ్యూటీ చేస్తున్నాడు.ప్రస్తుతం అక్కడ ఎలాంటి భయాందోళనలు లేవని ప్రశాంతంగా తాను డ్యూటీ చేస్తున్నానని అయన ఫోన్ ద్వారా తెలిపరన్నారు.దుబాయ్ బార్డర్లో, పెద్ద పెద్ద హోటళ్లపై ఇరాన్ దాడులు జరుపుతున్నారని ఇంతవరకు తెలుగువారికి ఎలాంటి హాని జరగలేదని తెలిపడన్నారు.ఆఫీస్ వారు ఎప్పటికప్పుడు యుద్ధం గురించి సమాచారం అందిస్తున్నారని, కంపెనీ వారు ఎప్పటికప్పుడు వారికి కావాల్సిన నిత్యావసర సరుకులు అందజేస్తున్నారని తెలిపారు. మొదటి రోజు బారు దుబాయ్ అబ్రా ప్రాంతంలో డ్రోన్ దాడి జరిగిందని అట్టి దాడిలో ఎవరికీ ఏం కాలేదని, ప్రస్తుతం ఎలాంటి యుద్ధ వాతావరణం లేదనీ మా మేనల్లుడు తెలిపడన్నారు.




# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

## 4 తులాల బంగారం, బైక్ స్వాధీనం : డీఎస్పీ వెంకటేశ్వర్లు



**జడ్చర్ల, మార్చి 03 (జనంసాక్షి):** ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనానికి బానిసలై, అప్పులు తీర్చుకోవడానికి దొంగతనాలు చేస్తున్న ముగ్గురు సభ్యుల అంతర్రాష్ట్ర దొంగల ముఠాను జడ్చర్ల పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. నిందితుల నుండి సుమారు 4 తులాల బంగారు ఆభరణాలతో పాటు నేరానికి ఉపయోగించిన బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం జడ్చర్ల పోలీస్ స్టేషన్ లో డిఎస్పి వెంకటేశ్వర్లు మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. అన్నమయ్య జిల్లాకు చెందిన రాసూరి హరికృష్ణ, షేక్ ఇస్సాక్, మూడే లక్ష్మణ్ నాయక్ అనే ముగ్గురు వ్యక్తులు ఆన్‌లైన్ గేమింగ్, పేకాటకు అలవాటు పడి భారీగా అప్పులు చేశారు. ఆ అప్పులు తీర్చడానికి దొంగతనాల బాట పట్టిన ఈ ముఠా, గత నెలలో వరుస నేరాలకు పాల్పడినట్లు తెలిపారు. ఫిబ్రవరి 16న కర్నూలులో ఒక బైక్ దొంగిలించి, గోనెగండ్లలో ఒక మహిళ మెడలోని 2 తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఆ తర్వాత ఫిబ్రవరి 25న ఇటిక్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో మరొక హోండా యూనికార్న్ బైక్‌ను దొంగిలించారు. అంతే కాకుండా, ఫిబ్రవరి 27న జడ్చర్ల బండమీది కృష్ణారెడ్డి నగర్ కాలనీలో కిరాణం దుకాణంలో మహిళను నీళ్ల బాటిల్ అడిగే నెపంతో నమ్మించి, ఆమె మెడలోని 2 తులాల పుస్తెల తాడును బలవంతంగా లాక్కొని పరారయ్యారు. మంగళవారం సాయంత్రం జడ్చర్ల ఎస్సై కె. మల్లేష్, సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా కనిపించిన ఈ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితులు తాము చేసిన నేరాలను అంగీకరించినట్లు డిఎస్పి తెలిపారు. నిందితుల నుంచి నాలుగు తులాల బంగారం ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. తక్కువ సమయంలో జడ్చర్ల పట్టణ సీఐ కమలాకర్ ఆధ్వర్యంలో ఎస్సై మల్లేష్, కానిస్టేబుల్ విష్ణు, మన్సూర్, నరసింహలు ఈ కేసును చాకచక్యంగా చేదించినందుకు ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కబ్జాదారులకు అధికారుల ఊతం!

- అక్రమాలను కట్టడి చేయలేకపోతున్న జిల్లా యంత్రాంగం
- ఫిర్యాదులు చెత్తబుట్టకు మాత్రమే పరిమితమా..?



**గద్వాల టౌన్, మార్చి 4 (జనంసాక్షి) :** గద్వాల జిల్లాలో ప్రభుత్వ స్థలాలు, దేవాదాయ భూములు, వక్ఫ్ బోర్డు భూములు కబ్జాలు జరుగుతున్నా కట్టడి చేయడం లో జిల్లా అధికార యంత్రాంగం విఫలమైందని విమర్శలు వస్తున్నాయి. కబ్జా చేస్తున్నవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంలో అధికారులే అలక్ష్యం చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాధితులు సమస్యల కొరకు పలుమార్లు సంబంధిత అధికారులకు పిర్యాదు చేసినా సమస్యలు పరిష్కా రం కావడం లేదు. ప్రజలు ఇచ్చినటువంటి ఫిర్యాదులను చెత్తబుట్టలో వేస్తున్నారని ఫిర్యాదుదారులు అనుకుంటున్నారని సమాచారం. సమస్యలు పరిష్కరించలేని అసమర్థత అధికారులు ఎందుకు..? అంటూ ఘాటుగానే ఆక్రోషం వ్యక్తం చేస్తున్నారు. లంచాలకు రుచి మరిగిన అధికారులకు బాధ్యత విలువ తెలియడం లేదు కాబట్టే ఇలాంటి పరిస్థితులు మరీ మరీ వెలుగులోకి వస్తున్నాయని జిల్లా ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొందరు జిల్లాలో ఫోర్జరీ డాక్యుమెంట్లను సృష్టించి ప్రభుత్వ భూములను దేవాదాయ భూములను, వక్ఫ్ బోర్డు భూములను వెంచర్లు వేసి మరీ రియల్ ఎస్టేట్ చేస్తున్నా.. పట్టించుకోవడం లేదంటే జిల్లాలో పరిస్థితి ఎంత దిగజారి పోయిందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ స్థలాలను దేవాదాయ భూములను వక్ఫ్ బోర్డు భూములను కబ్జా చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, అలాగే ల్యాండ్ గ్రాబర్స్‌కి సహకరిస్తున్న కొంతమంది అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# ఉపాధిహామీ కూలీలకు అలర్ట్..

**అమల్లోకి కొత్తరూల్ ఫాలో కాకుంటే డబ్బులు రావు**



**ముస్తాబాద్ మార్చి 4 (జనం సాక్షి) :** ఉపాధి హామీ కూలీలకు ముఖ్య గమనిక. ఉపాధిహామీ పథకంలో కొత్త నిబంధన అమల్లోకి వచ్చింది. ఈ పథకంలో అక్రమాల జరగకుండా అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనల అమల్లోకి తెచ్చింది.ఇకపై ఉపాధిహామీ కూలీలకు ముఖ హాజరు (ఫేషియల్ అథెంటికేషన్)తప్పనిసరి చేసింది. మార్చి రెండో తేదీ నుంచి (సోమవారం) ఈ విధానం కచ్చితంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ నూతన విధానం సోమవారం నుంచి అమల్లోకి రానుంది. గతంలో జాబ్ కార్డులో ఒకరి పేరు ఉంటే.. మరొకరు ఉపాధిహామీ పనులకు వెళ్లే పరిస్థితి ఉండేది. అలాగే మస్టర్‌లో దొంగ సంతకాలు చేసిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి.ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో కేంద్రం ఈ–కేవైసీ విధానం తీసుకువచ్చింది. ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగం కాకూడదనే ఉద్దేశంతో ప్రతి ఉపాధిహామీ కూలీకి ఈ–కేవైసీ తప్పనిసరి చేసింది. ఈ కేవైసీ పూర్తి అయితే అక్రమాలకు పూర్తిగా స్వస్తి పలకవచ్చనే ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం ఈ కేవైసీ తీసుకువచ్చింది. 2025 అక్టోబర్ నెలలో ఉపాధి హామీ కూలీలకు ఈకేవైసీ చేసే ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటి వరకు మెజారిటీ కూలీలకు ఈ ప్రక్రియను పూర్తిచేశారు.

మరోవైపు కొత్త విధానం ప్రకారం ఉపాధి హామీ పనికి వెళ్లిన సమయంలో పనులు చేసే ప్రదేశంలో కూలీలకు ఒక ఐడీని క్రియేట్ చేస్తారు. ఫీల్డ్ అసిస్టెంట్, టీఏలు కూలీలకు మొదట ఫోటో తీస్తారు. పని పూర్తైన నాలుగు గంటల అనంతరం మరోసారి ఉపాధి హామీ కూలీల ఫోటోలు తీస్తారు. దీంతో పనులు పూర్తి చేసినట్లు సమాచారం అందుతుంది. వీటిలో ఏదీ మర్చిపోయినా ఉపాధి హామీ కూలీలకు బిల్లులు జమకావు. అయితే ఈ విధానం అమల్లో కొన్ని సమస్యలు వెంటాడుతున్నాయి.మారుమూల గ్రామాల్లో నెట్‌వర్క్ సిగ్నళ్లు సరిగా లేనటువంటి పరిస్థితి. దీంతో ఫేసియల్ రికగ్నిషన్ విధానం అనేది కష్టతరంగా మారింది. అయితే పని ప్రదేశంలో ఉపాధిహామీ కూలీల ఫొటోలు తీయాలని.. ఆ తర్వాత సిగ్నల్ వచ్చే ప్రాంతానికి వెళ్లి యాప్‌లో అప్లోడ్ చేయాలని అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచిస్తున్నారు. ఉపాధిహామీ పథకం పనుల్లో పారదర్శకత కోసమే కొత్తగా ముఖ హాజరు విధానం తెచ్చినట్లు అధికారులు చెప్తున్నారు. ఈ విధానంతో ఉపాధి కూలీలకు వేతనాలు సకాలంలో అందుతాయని.. అలాగే ఉపాధిహామీ పథకం సిబ్బందికి చాలా సమస్యలు తగ్గిపోతాయని చెప్తున్నారు.

# ప్రజలే న్యాయ నిర్ణేతలు.. బండి సంజయ్ కాదు

- ప్రజాస్వామ్యంలో పదవులు శాశ్వతం కావు : మంత్రి పొన్నం ప్రభాకర్
- దేశాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టారు..మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయం
- రాహుల్ గాంధీ పాదయాత్రతో నిద్రపోలేకున్నారా?



**కరీంనగర్ బ్యూరో, మార్చి 04 (జనంసాక్షి):** ప్రజాస్వామ్యంలో నాయకత్వం ఎవరికి దక్కాలో నిర్ణయించేది బండి సంజయ్ కాదు, మరొకరు కాదు.. ప్రజలే న్యాయ నిర్ణేతలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసంపైనే పదవులు ఆధారపడతా యని, అవి శాశ్వతం కావని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. గత 12 ఏళ్లుగా ప్రజలు ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నారని, దేశాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టి తమాషా చూస్తున్నారని మంత్రి విమర్శించారు. దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టినవారు ఎవరో ప్రజలకు తెలుసని, అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారాయని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలు తెగనమ్ముతున్నాయని, ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, పేదలను ఆదుకునే ప్రయత్నం లేదని పేర్కొన్నారు. విద్వేషాన్ని రెచ్చగొట్టి మైనారిటీలను, అణగారిన వర్గాలను బూచిగా చూపి అధికారాన్ని చెలాయిస్తున్నారని, నిత్యం మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయం చేస్తున్నారని మంత్రి ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐ కేసులతో విపక్ష ప్రభుత్వాలను కూలదోసి ప్రజాస్వామ్యాన్ని కుంటిచేస్తున్నారని విమర్శించారు.

కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేసి దేశ ప్రజలకు ఐక్యతను చాటిన రాహుల్ గాంధీని విమర్శించడం ఆకాశంపై ఉమ్మితే ముఖంపైనే పడుతుందని, ఆ వాస్తవాన్ని బండి సంజయ్ తెలుసుకోవాలని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రెండు సార్లు ఎంపీగా గెలిచి, కేంద్ర మంత్రి అయినా తెలంగాణకు ప్రత్యేక నిధులు తీసుకురాలేకపోయిన దద్దమ్మ బండి సంజయ్ తన వ్యవహార శైలిని మార్చుకోవాలని మంత్రి సూచించారు. ప్రజలే అంతిమ నిర్ణేతలని, వారి తీర్పు ఎవరినీ వదలదని పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

# శివ కళ్యాణమునకు ముస్తాబవుతున్న రాజన్న ఆలయం

## ఐదు రోజుల పాటు ఆర్జిత సేవలు రద్దు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 4 (జనంసాక్షి) :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయ ఆవరణలో నేటి నుండి సోమవారం వరకు శివ కళ్యాణ మహోత్సవాలు ప్రారంభంకానున్నాయి. గురువారం నుండి వరకు ఐదు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.అన్ని శివాలయాల్లో మహాశివరాత్రి రోజు స్వామి వారి కల్యాణం జరుపుతుంటారు,కానీ వేములవాడ రాజన్న ఆలయంలో మాత్రం కామదహనం తర్వాత శివ కల్యాణం జరిపించడం ఆనవాయితీగా వస్తుంది. గురువారం ఉదయం స్వస్తి పుణ్యావచనం, అంకురార్పణ, దేవతాహ్వానం,శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి వారి కల్యాణం ఆలయ పార్కింగ్ స్థలంలోని శివర్చనలో నిర్వహిస్తున్నారు. ఆదివారం సాయంత్రం రథోత్సవం,రాత్రి దేవాలయంలో ఏకాదశావరణలు స్వామి వారికి అర్చకులు ఏకాంతంగా నిర్వహిస్తున్నారు.శివ కల్యాణోత్సవానికి మన రాష్ట్రంతో పాటు పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర,ఢిల్లీ నుండి శివపార్వతులు,జోగినిలు హాజరుకానున్నారు.

**ఐదు రోజులపాటు ఆర్జిత సేవలు రద్దు.**

శివ కళ్యాణం సందర్భంగా రాజన్న ఆలయంలో నేటి నుండి సోమవారం వరకు ఐదు రోజులపాటు స్వామి వారికి భక్తులు నిర్వహించే ఆర్జిత సేవలు,నిత్య కళ్యాణం,అభిషేకాలు,అన్న పూజలు పూజలు రద్దు చేసినట్లు ఆలయ ఈఓ రమాదేవి తెలిపారు. స్వామివారి కళ్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని ఈవో కోరారు.

## ఈఆర్‌సీ చైర్మెన్‌కు స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్, ఎస్పీ




**రాజన్న సిరిసిల్ల బ్యూరో, (జనం సాక్షి);** రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో తెలంగాణ ఈఆర్‌సీ బుధవారం నిర్వహించిన బహిరంగ విచారణకు హాజరైన తెలంగాణ ఈఆర్‌సీ చైర్మెన్ డాక్టర్ జస్టిస్ డీ నాగార్జున, కే రఘు, ఈఆర్‌సీ టెక్నికల్ విభాగం సభ్యుడు, సీహెచ్ శ్రీనివాస్ రావు, ఈఆర్‌సీ ఫైనాన్స్ విభాగం సభ్యులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్చం అందజేసారు.ఈ కార్యక్రమంలో సెస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వివాహేతర సంబంధమే హత్యకు కారణం

- 24 గంటల్లోనే నిందితుడు పట్టుబడ్డాడు
- అపహరించిన ఆభరణాలు, మొబైల్ రికవరీ







**నవాబుపేట్, మార్చి 04 (జనంసాక్షి):** నవాబుపేట్ మండలం యెల్లకొండ గ్రామ శివారులో ఆదివారం రెండవ తేదీన హత్యకు గురైన మహిళ కేసును పోలీసులు 24 గంటల వ్యవధిలో విజయవంతంగా ఛేదించారు. వివాహేతర సంబంధం బయటపడుతుందనే భయంతో నిందితుడు ఈ దారుణానికి పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

మినపల్లి బాలామణి (శంకరపల్లి గ్రామం, రాములు భార్య) హత్య కేసులో నిందితుడు నాయకుడి శ్రీనివాస్ (46)ను వికారాబాద్ సీఐ జి. వెంకట్, నవాబుపేట్ ఎస్సై పుండ్లిక్ ఆధ్వర్యంలో మూడు టీమ్లు ఏర్పాటు చేసి 24 గంటల్లోనే అరెస్టు చేశారు. మృతురాలి కుమారుడు మినపల్లి శేఖర్ ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో శాస్త్రీయ, సాంకేతిక సమాచారంతో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం.. నిందితుడు, మృతురాలికి గతంలో పరిచయం ఉండేది. వారి మధ్య వివాహేతర సంబంధం బయటపడుతుందనే భయంతో వ్యక్తిగత ద్వేషంతో ప్లాన్ చేసి హత్య చేసినట్లు తేలింది. మృతురాలు ధరించిన బంగారు, వెండి ఆభరణాలు, మొబైల్ ఫోన్‌ను అపహరించినట్లు ఫిర్యాదులో పేర్కొనగా.. దర్యాప్తులో అన్నీ నిందితుడి వద్ద నుంచి రికవరీ చేశారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి నిరంతర పర్యవేక్షణలో సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. వెంకట్ ఆధ్వర్యంలో దర్యాప్తు జరిగింది. నిందితుడిని అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు, వికారాబాద్ ముందు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. వెంకట్ మాట్లాడుతూ.. ప్రతి తీవ్ర నేరాన్ని శాస్త్రీయ ఆధారాలు, సాంకేతిక విశ్లేషణ, చట్టపరమైన ప్రమాణాలతోనే దర్యాప్తు చేయాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయడం పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు. మహిళలపై నేరాల్లో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సూచించిన జీరో టాలరెన్స్ విధానాన్ని కచ్చితంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

# పని ఎక్కువ.. జీతం తక్కువ

- పనికి తగ్గ వేతనాలు చెల్లించాలి
- అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్న వైనం
- సఫాయి కార్మికులను పర్మినెంట్ చేయాలి : బీజేపీ నాయకులు వెంకటేశం చారి





**ధారూర్ మర్చి 04 ( జనం సాక్షి) :** మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థలో తొలి మెట్టు గ్రామ పంచాయతీలకు నిధుల కొరతతో గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ఏకంగా 3 నెలలుగా జీతాలు రాకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నారాని ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామాల్లో రోడ్లు ఊడ్చడం.మురుగు కాలువలు శుభ్రం చేయడం, పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను నడిపిస్తున్నామని కార్మికులు ఆవేదనలో ఉన్నారని ప్రభుత్వం వెంటనే స్పందించి సఫాయి కార్మికులకు జీతాలు వెంటనే చెల్లించాలని బిజెపి పార్టీ నాయకులు వడ్ల వెంకటేశం చారి అన్నారు.ఈ సందర్భంగా వెంకటేష్ చారి మాట్లాడుతూ...గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పనిచేస్తున్న సఫాయి కార్మికులకు పనికి తగ్గ గౌరవ వేతనాలను 16 వేల రూపాయలు ప్రతి నెల చెల్లించాలని అలాగే కార్మికులకు రెండు జతల యూనిఫామ్ లు బూట్లు.బౌజులు.ప్రతి కార్మికునికి సబ్బులు అందించాలని సఫాయి కార్మికులకు పని ఎక్కువ జీతం తక్కువ ఉందని పనికి తగ్గ వేతనాలను చెల్లించాలని ప్రతినెల సరైన సమయంలో సపాయి కార్మికులకు గౌరవ వేతనాలు అందక పోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారని గత ప్రభుత్వంలో సపాయి కార్మికులను ఏర్పాటు చేయడం వల్ల గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నాయని ప్రజా పాలన పేరుతో కొనసాగుతున్న ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న సఫాయి కార్మికుల కోసం పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు.ప్రభుత్వం స్పందించి సఫారీ కార్మికులను రెగ్యులరైజేషన్ చేయాలని ఆయన కోరారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
5 మార్చి 2026

## ఎంబీబీఎస్ విద్యార్థులకు ఎమ్మెల్యే ఫీజు చెల్లింపు



హైదరాబాద్, మార్చి 4 (బీఆర్ఎస్) : ఉప్పల్ నియోజకవర్గపరిధిలోని ఎంబీబీఎస్ చదివే విద్యార్థులకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేయూత అందించారు. 16 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థికసాయం అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కులను బుధవారం లక్ష్మారెడ్డి నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతులమీదుగా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డిని కేటీఆర్ అభినందించారు. చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంబీబీఎస్ చదివే విద్యార్థులకు చెక్కులు అందజేయడం నిజంగా అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరకాల మా అడ్డా

- సురేఖ అక్కడి నుంచే పోటీ చేస్తారు: కొండా మురళి



వరంగల్, మార్చి4 (జనంసాక్షి) : పరకాల మా అడ్డా అని, వచ్చే ఎన్నికల్లో కొండా సురేక అక్కడి నుంచే పోటీ చేస్తారని మాజ ఎమ్మెల్సీ, తెలంగాణ మంత్రి కొండా సురేఖ భర్త మురళీ కీలక వ్యాఖ్యలు చేశారు. పరకాల తమ అడ్డా... వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచే కొండా సురేఖ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. బుధవారం గీసుగొండ మండలంలోని కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి జాతరలో కొండా మురళీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తన బిడ్డా కొండా సుస్మిత ఎవరినైనా ఎదిరిస్తుందని చెప్పుకొచ్చారు. తనకన్నా కొండా సుస్మిత ధైర్యవంతురాలని తెలిపారు. కార్యకర్తలకు సమస్య వస్తే ఎవర్నీ వదలిపెట్టదని అన్నారు. ఎంతటివారినైనా ధైర్యంగా ఎదుర్కొంటుందని కొండా మురళీ పేర్కొన్నారు.

## ములుగు జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి

- భూ సేకరణ వేగవంతం చేసి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- ఆదేశాలు జారీ చేసిన మంత్రులు ఉత్తమ్, సీతక్క, పొంగులేటి



హైదరాబాద్ (జనంసాక్షి) : ములుగు జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టులను ప్రాధాన్యతగా తీసుకుని వేగంగా పూర్తి చేస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క, వరంగల్ జిల్లా ఇంచార్జీ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. భూ సేకరణకు సంబంధించి 15 రోజుల్లో అంచనాలు, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నష్టపరిహారం వెంటనే చెల్లించి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సచివాలయంలో ములుగు జిల్లా పరిధిలోని ఇరిగేషన్ ప్రాజెక్టులపై బుధవారం నాడు మంత్రులు సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర్ తో పాటు, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, ములుగు జిల్లా ఇరిగేషన్ అధికారులు హాజరయ్యారు. ములుగు జిల్లాలో సాగునీటి పనుల పురోగతి, పెండింగ్ అంశాలు, భూ సేకరణ సమస్యలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ములుగు నియోజకవర్గ పరిధిలో 1,10,632 ఎకరాల ఆయకట్టు లక్ష్యంగా సాగునీటి ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని అధికారులు వివరించారు. దేవాదుల, ఎస్సారెస్పీ స్టేజ్-x, రామప్ప పాకాల లిఫ్ట్ ఇరిగేషన్, సమ్మక్క సారాలమ్మ ప్రాజెక్టు, పోట్లాపూర్ ఎత్తిపోతల, పాలేం వాగు ప్రాజెక్టు, మోడి కుంట వాగు, ఫ్లడ్ బ్యాంకులు తదితర పనుల స్థితిగతులపై మంత్రులు సమీక్షించారు. ములుగు జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టులను ప్రాధాన్యతగా తీసుకుని వేగంగా పూర్తి చేస్తామని మంత్రులు స్పష్టం చేశారు. భూ సేకరణకు సంబంధించి పక్షం రోజుల్లో అంచనాలు, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. భూ సేకరణ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం వెంటనే చెల్లించి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అవసరమైన అనుమతులు త్వరితగతిన మంజూరు చేస్తామని, అన్ని ప్రక్రియలు పూర్తైతే పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రామప్ప - లక్నవరం ఇంటర్ లింకింగ్ పనులకు అదనపు నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పనిచేసి ములుగు రైతులకు త్వరితగతిన సాగునీరు అందించాలని ఆదేశించారు. దేవాదుల ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణపై 15 రోజుల్లో మరోసారి ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమ్మక్క సారాలమ్మ ప్రాజెక్టు విషయంలో ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం అభ్యంతరాలు వ్యక్తం చేస్తోందని, అక్కడ ముంపు బాధితులకు తగిన పరిహారం చెల్లించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## ఆగివున్న కారును వేగంగా ఢీకొన్న కారు

- నుజ్జునుజ్జు అయిన కారు...ఐదుగురు దుర్మరణం
- మృతులంతా బెంగళూరు వాసులుగా గుర్తింపు



చిత్తూరు, మార్చి4 (జనంసాక్షి) : చిత్తూరు జిల్లాలోని పలమనేరు శివారులో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు బలంగా ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాద తీవ్రతకు కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు పురుషులు, ముగ్గురు మహిళలు అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పలమనేరు జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన లారీని ఓ కారు వెనుక వైపు నుంచి అత్యంత వేగంతో వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆ కారు పూర్తిగా ధ్వంసమైంది. మృతులు బెంగళూరు నగరంలోని రాజాజీ నగర్ ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు. వారు తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని చిత్తూరు జిల్లా పోలీసులు తెలిపారు. మృతులను మోహన్ దాస్ (71), నాగరాజారావు (61), కుసుమ (61), జయంతి (59), పూజ (33)గా గుర్తించారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం కోసం స్థానిక ఆస్పత్రికి తరలించి, బంధువులకు సమాచారం ఇచ్చారు. పలమనేరు ప్రమాదంపై ఏపీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలపై పూర్తి స్థాయి విచారణ జరపాలని అధికారులను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశించారు. ఈ ప్రమాదానికి కారణం కారుడ్రైవర్ నిర్లక్ష్యమా..? ఇతర సాంకేతిక కారణాలేమైనా ఉన్నాయా..? అనే కోణంలో జిల్లా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జాతీయ రహదారులపై వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ ఘటనతో పలమనేరు ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది.

# మహిళా దినోత్సవం రోజు మహిళల హెల్త్ ప్రొఫైల్ ప్రారంభం

- 46 లక్షల మందికి స్క్రీనింగ్ ప్రారంభం
- టీ డయాగ్నస్టిక్స్ ద్వారా ఒక్కొక్కరికీ 30 రకాల పరీక్షలు
- ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష
- 4 దశల్లో ఆరోగ్యశాఖ కార్యక్రమాలు



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళల హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ కార్యక్రమాన్ని ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ప్రారంభించాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరోగ్యశాఖ నిర్వహించాల్సిన కార్యక్రమాలపై సెక్రటేరియట్‌లో మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం సమీక్ష చేశారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్, డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్, డీహెచ్ రవిందర్ నాయక్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకూ 99 రోజులపాటు చేపట్టనున్న కార్యక్రమాలపై ఆరోగ్యశాఖ ఉన్నతాది . కారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. హాస్పిటళ్లలో రోజువారీ వైద్య సేవలకు ఆటంకం కలగకుండా 99 డేస్ యాక్షన్ ప్లాన్ ఉండాలని సూచించారు. అధికారులు రూపొందించిన ప్రణాళికను స్వల్ప మార్పులతో మంత్రి ఆమోదించారు. మొత్తం 4 దశల్లో కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. తొలి దశలో మార్చి 6 నుంచి 31వ తేదీ వరకు 26 రోజుల పాటు మాతా శిశు సంరక్షణ, కౌమార దశ బాలికలు, వృద్ధుల ఆరోగ్య సేవలపై దృష్టి కేంద్రీకరించనున్నారు. హాస్పిటళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, ఆస్తుల వెరిఫికేషన్ వంటి పరిపాలనా పరమైన అంశాలను చక్కదిద్దడంతో పాటు.. క్షేత్రస్థాయిలో రక్తహీనత నివారణ, పాఠశాలలు, అంగన్‌వాడీల్లో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సెల్ఫ్ హెల్ఫ్ గ్రూపు మహిళల హెల్త్ ప్రొఫైల్ తయారీ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తారు. తెలంగాణ డయాగ్నస్టిక్స్ సహకారంతో ఒక్కో మహిళకు మొత్తం 30 రకాల పరీక్షలు చేయనున్నారు. మార్చి 8 నుంచి మూడు దశల్లో సుమారు 46 లక్షల మంది మహిళలకు పరీక్షలు చేయనున్నారు. తొలి దశలో ప్రతి జిల్లా నుంచి 5 మండలాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, రెండో దశలో మరో 10 మండలాల్లో, చివరి దశలో మిగిలిన అన్ని మండలాల్లో స్క్రీనింగ్ చేపట్టనున్నారు. మొత్తం స్క్రీనింగ్‌ను 6 నెలల్లో పూర్తి చేయాలని మంత్రి సూచించారు. ప్రజాపాలన రెండో దశను ఏప్రిల్ 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఈ 15 రోజుల్లో అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, కేన్సర్ వంటి వాటిని గుర్తించేందుకు సబ్ సెంటర్ల పరిధిలో విస్తృతమైన స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేస్తారు. జిల్లా డే కేర్ కేన్సర్ సెంటర్లలో కీమోథెరపీ సేవలను మ్యాపింగ్ చేయడంతో పాటు, డయాలసిస్ రోగులకు వైరల్ ఇన్ఫెక్షన్ పరీక్షలు తప్పనిసరి చేయాలని మంత్రి ఆదేశించారు. ఇక ఏప్రిల్ 16 నుంచి మే 15 వరకు సాగే మూడో దశలో అంటువ్యాధుల నియంత్రణ, ప్రజారోగ్య సన్నద్ధతపై యంత్రాంగం దృష్టి సారించనుంది. టీబీ ముక్త్ భారత్ లక్ష్యంగా టీబీ కేసులను గుర్తించడంతో పాటు.. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో వడదెబ్బ, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించి, అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు. మే 16 నుంచి జూన్ 12 వరకు నాలుగో దశలో పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను విస్తరించనున్నారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మేడ్చల్ పరిధిలోని 145 అర్బన్ పీహెచ్‌సీలను పాలిక్లినిక్స్‌గా అప్‌గ్రేడ్ చేసి, స్పెషాలిటీ వైద్య సేవలను అందించాలని మంత్రి సూచించారు. బస్తీల్లో మొబైల్ వెహికిల్స్ ద్వారా వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు వైద్యం చేరువ చేయనున్నారు. ఫుడ్ సేఫ్టీ మేళాలు నిర్వహించి ప్రజల్లో కల్తీ ఆహారంపై చైతన్యం తీసుకురావాలని మంత్రి సూచించారు.

# ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

- పది మంది కూలీలకు గాయాలు



రాజన్న సిరిసిల్ల, మార్చి4 (జనంసాక్షి) : రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉపాధి హామీ కూలీలపై తేనె టీగలు దాడి చేశాయి. ఈ ఘటనలో కూలీలకు తీవ్రగాయాలయ్యాయి. వవరాల్లోకి వెళ్తే.. కోనరావుపేట మండలంలోని నిజామాబాద్‌లో బుధవారం ఉదయం ఉపాధి పనుల్లో భాగంగా సర్వాయి కాలువ మరమ్మతు పనులను చేపట్టారు. దాదాపు 10 మంది కూలీలు అక్కడ పనిచేస్తుండగా చెట్టుపై ఉన్న తేనె టీగలు వారిపై దాడి చేశారు. తేనె టీగలు మీదకు రావడంతో భయపడిపోయిన కూలీలు అక్కడి నుంచి పరుగులు తీశారు. అప్పటికే వారిని తేనెటీగలు విపరీతంగా కుట్టాయి. ఇది గమనించిన తోటీ కూలీలు.. గాయపడిన వారిని కోనరావుపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. కానీ అక్కడ వైద్య సిబ్బంది అందుబాటులో లేరు. పైగా ప్రభుత్వ అంబులెన్స్ కూడా అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఇక చేసేదేమీ లేక.. గాయపడిన వారిని ట్రాలీ ఆటోలో సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించారు. వారి వెంట సర్పంచ్ సింగం శ్రీహరి, ఉపసర్పంచ్ లంబ రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్ వెళ్లారు. వారికి మెరుగైన వైద్యం అందిచేలా చూడాలని వైద్యులను కోరారు. కాగా, తేనేటీగల దాడిలో గాయపడిన వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. వారిలో పులి పాలవ్వ అనే వృద్ధురాలి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

- మియాపూర్‌లో 12.6 గ్రాముల డ్రగ్స్ స్వాధీనం




శేరిలింగంపల్లి, మార్చి 04 (జనంసాక్షి) : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధి మియాపూర్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో నిషేధిత ఎండిఎంఏ మత్తు పదార్థాన్ని విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను మియాపూర్ పోలీసులు అత్యంత చాకచక్యంగా అదుపులోకి తీసుకోవడం జరిగిందని మియాపూర్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ మీడియాకు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఘటనకు సంబంధించిన విషయాలను ఆయన వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం మధ్యాహ్నం (మార్చి 3న) విశ్వంభర కాలనీ పార్క్ సమీపంలో ఒక వోక్స్ వ్యాగన్ కారులో డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందిందన్నారు. దీనిపై వెంటనే స్పందించిన మియాపూర్ పోలీస్, మాదాపూర్ ఎస్ఓటి బృందం మధ్యాహ్నం 2.50 గంటల సమయంలో అక్కడికి చేరుకుని సదరు వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగిందన్నారు. పోలీసులను గమనించి నిందితులు పారిపోయే ప్రయత్నం చేయగా వారిని చేజ్ చేసి చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నామన్నారు. వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయగా, కార్ డ్యాష్ బోర్డ్‌లోని జిప్‌లాక్ కవర్‌లో తెల్లటి క్రిస్టలైన్ పదార్థం లభ్యమైందన్నారు. డ్రగ్ డిటెక్షన్ కిట్‌తో పరీక్షించగా అది 12.6 గ్రాముల ఎండిఎంఏగా నిర్ధారణ అయిందని తెలిపారు. నిందితులు బేరి హనుమంత (27), భూమని మహేష్ (26), కాసం ఆదర్శ్ (28)లను అదుపులోకి తీసుకొని విచారించగా వారు బెంగళూరు నుంచి ఈ డ్రగ్స్‌ను తక్కువ ధరకు కొనుగోలు చేసి, హైదరాబాద్‌లో అధిక లాభాలకు విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. నిందితుల నుంచి డ్రగ్స్‌తో పాటు, ఒక వోక్స్ వ్యాగన్ కారు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని సిఐ శివ ప్రసాద్ తెలియజేశారు. ప్రస్తుతం నిందితులపై ఎన్డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేయడం జరిగిందని, ఈ డ్రగ్ నెట్‌వర్క్‌లో ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ కుకట్‌పల్లి జోన్ అదనపు డిసిపి ఎం. సుదర్శన్ పర్యవేక్షణలో విజయవంతంగా నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి యువత జీవితాలను నాశనం చేస్తోందన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా వినియోగం గురించి సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని వారికి ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

# కేంద్ర జాబితాలో లేని 40 బీసీ కులాలు

- జనగణనలో వారిని కూడా చేర్చేలా చూడాలి
- సిఎస్‌ను కోరిన తెలంగాణ బిసి కమిషన్




హైదరాబాద్, మార్చి4 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో జనగణన కార్యక్రమంలో భాగంగా మే 11 నుంచి జూన్ 9 వరకు గృహాల నమోదు జరగనుంది. ఆ తర్వాత జనాభా గణన 2027 ఫిబ్రవరి 9 నుండి ఫిబ్రవరి 28, వరకు జరగనుంది. జనగణనలో కేంద్ర ప్రభుత్వ ఓబీసీ లిస్టులో ఉన్న తెలంగాణలోని 90 కులాల ప్రజలను మాత్రమే ఓబీసీలుగా గణనలోకి తీసుకోవడం జరుగుతోంది. తద్వారా తెలంగాణలో ఉన్న బీసీ కులాల సంఖ్యను తక్కువగా చూపెట్టే ప్రమాదం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో 130 కులాలను వెనుకబడిన తరగతుల కులాలుగా గుర్తించడం జరిగింది. కాని కేంద్ర ప్రభుత్వం ఓబీసీ లిస్ట్‌లో కేవలం 90 కులాలను మాత్రమే చేర్చి 40 కులాలను చేర్చడం జరగలేదు. తద్వారా తెలంగాణలో బీసీల సంఖ్య తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉంది. బీసీ లిస్ట్‌లో లేని 40 కులాలను కూడా ఓబీసీ లిస్ట్‌లో చేర్చాలని గతంలో రాష్ట్ర ప్రభుత్వం, బీసీ కమిషన్ తరఫున కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. కాని ఇప్పటివరకు దానిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. కేంద్ర ప్రభుత్వం ఈ 40 కులాలను ఓబీసీ లిస్ట్‌లో చేర్చిన తర్వాతనే తెలంగాణ రాష్ట్రంలో జనగణనను ప్రారంభించాలి. విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దష్టికి తీసుకొచ్చి తెలంగాణ రాష్ట్రానికి చెందిన 40 బీసీ కులాలను కేంద్ర ఓబీసీ లిస్ట్‌లో చేర్చేవిధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకి ఒక లేఖ ద్వారా విజ్ఞప్తి చేయడం జరిగిందని బిసి కమిషన్ తెలిపింది.




## తెలంగాణ వర్సిటీలో విద్యార్థుల ఘర్షణ

కామారెడ్డి, మార్చి4 (జనంసాక్షి) : తెలంగాణ యూనివర్సిటీలో విద్యార్థుల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం జంగంపల్లి శివారులో ఉన్న వర్సిటీలోని సౌత్ క్యాంపస్ వసతీగృహంలో మంగళవారం అర్ధరాత్రి విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. హోలీ సంబరాల అనంతరం సీనియర్, జూనియర్ విద్యార్థులు రెండు గ్రూపులుగా విడిపోయి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ కొట్లాటలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న వర్సిటీ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని విద్యార్థులను చెదరగొట్టారు. అనంతరం గాయపడిన వారికి చికిత్స అందించారు. వసతీగృహం వద్దకు స్థానిక ఎస్సై ఆంజనేయులు, వార్డెన్ డాక్టర్ యాలాద్రి అక్కడకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు

## కాంగ్రెస్ పాలనలో అస్థిరత

- మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

హైదరాబాద్ (జనంసాక్షి) : కాంగ్రెస్ పాలనలో ఎన్నడూ చూడని విధంగా పరిపాలనా అస్థిరత తెలంగాణలో కనిపిస్తోందని మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ప్రభాకర్ విమర్శించారు. బీజేపీ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పాటు ఇతర ఉన్నతాధికారుల బదిలీలు 60 సార్లకు జరిగినట్లు పేర్కొన్నారు. పరిపాలనలో స్థిరత్వం లేకపోవడం, ఒక స్పష్టమైన దిశా నిర్దేశం లేకపోవడంతో భారీ స్థాయిలో బదిలీల పర్వం కొనసాగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి తన పదవిని కాపాడుకోవడానికి 60 సార్లకుపైగా ఢిల్లీకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, రాష్ట్ర ప్రయోజనాల కంటే వ్యక్తిగత రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు. జీహెచ్ఎంసి పరిధిని విస్తరించి 300 సీట్లతో గ్రేటర్ హైదరాబాద్ ఏర్పాటు చేసి కొద్ది రోజుల్లోనే మూడు ముక్కలు చేయడం దూరదృష్టి లోపానికి ఉదాహరణ అన్నారు. ఒక నిర్ణయం తీసుకునే ముందు స్పష్టమైన ప్రణాళిక, లక్ష్యం ఉండాలన్నారు. పురపాలక సంఘాల రిజర్వేషన్ల విషయంలో జిహెచ్ఎంసిని ఒకటిగా చూపించి రిజర్వేషన్లు ఖరారు చేసి, అనంతరం మూడు భాగాలుగా విభజించడం రిజర్వేషన్ ప్రక్రియను దెబ్బతీసే చర్యగా కనిపిస్తోందన్నారు. పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన అంశం సుప్రీంకోర్టులో విచారణలో ఉండగా, మరోవైపు స్పీకర్ స్థాయిలో కూడా నోటీసులు జారీ చేస్తూ కొందరికి క్లీన్ చిట్‌లు ఇస్తున్నారు, మరికొందరు నోటీసులకు సమాధానాల కోసం సమయం కోరుతున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370